ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి

# విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

అక్రిడేషన్ లు కలవు
విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
తెలుగుదిన పత్రికలో రిపోర్టర్లు కావలెను
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు,
నియోజకవర్గాలు, మండలాల
వారిగా రిపోర్టర్లు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యం
సంప్రదించవలసిన ఫోన్ నంబర్స్ :
9440897445, 8074636674

మంగళవారం 24 మార్చి 2026 | Tuesday 24 march 2026 | హైదరాబాద్ Hyderabad
సంపుటి: 28 సంచిక: 03 | Vol.No 28 Issue No .03
పేజీలు: 12+12 | వెల: రూ.1.00
PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
www.visionandhra.in

# హైదరాబాద్ అభివృద్ధికి అందరూ సహకరించాలి

- మూసీ ప్రక్షాళనతోనే కాలుష్య నివారణ సాధ్యం
- నగరంలోని పరిశ్రమలు ఓఆర్ఆర్ అవతలకు తరలింపు
- రూ.24 వేల కోట్లతో 74 కిలోమీటర్ల మేరకు మెట్రో విస్తరణ
- ఎలివేటెడ్ కారిడార్లతో అద్భుత నగరంగా హైదరాబాద్
- గుడ్ గవర్నెన్స్ కాదు... మాది స్మార్ట్ గవర్నెన్స్
- శాసనమండలిలో సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి

**విద్యుత్ ఉద్యోగులకు అండగా ప్రభుత్వం**
**ఆరోగ్యశ్రీని రూ.5 నుంచి రూ.10 లక్షలకు పెంచాం**
**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి**



హైదరాబాద్,మార్చి23 : ఎలివేటెడ్ కారిడార్లతో హైదరాబాద్ అద్భుత నగరంగా మారుతుందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. క్యూర్, ప్యూర్, రేర్‌గా విభజించి ట్రాఫిక్ రద్దీ తగ్గేలా చూస్తున్నామని చెప్పారు. శాసన మండలిలో ఆయన మాట్లాడుతూ..తెలంగాణ రూపురేఖలు మార్చేందుకే క్యూర్, ప్యూర్, రేర్ మోడల్ తీసుకొస్తున్నామని వ్యాఖ్యానించారు. కాలుష్యకారక పరిశ్రమలను ఓ ఆర్ ఆర్ బయటకు తరలిస్తామని తెలిపారు. నగరంలో ఉన్న పరిశ్రమలను సిటీ బయటకు తరలిస్తే.. ఆ భూములను మల్టీజోన్స్‌గా వినియోగించుకోవచ్చని వివరించారు. మెట్రో విస్తరణకు ఎల్ అండ్ టీ ఎందుకు సహకరించ లేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం సూచన మేరకే మెట్రోను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. రూ.15 వేల కోట్లతో మెట్రోను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ఏ రాష్ట్రంలోనైనా ఎయిర్‌పోర్టులకు మెట్రో కనెక్టివిటీ ఉంటుందని.. కానీ తెలంగాణలో అలాంటి పరిస్థితి లేదని తెలిపారు. జూన్, జులైలోపు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. పంజాగుట్ట, హైటెక్‌సిటీ, జూబ్లీహిల్స్‌లో ఎలివేటెడ్ కారిడార్లు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. రూ.24 వేల కోట్లతో 74 కిలోమీటర్ల మేరకు మెట్రోను విస్తరిస్తామని తెలిపారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా బేగంపేట ఎయిర్‌పోర్టు మధ్య నుంచి అండర్‌పాస్ నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. సిగ్నల్స్ దగ్గర వాహనాలు ఆగకుండా వెళ్లాలనేదే తమ ఆలోచన అని చెప్పుకొచ్చారు. ఫుట్‌పాత్‌ల ఆక్రమణలే కొన్ని ప్రమాదాలకు కారణమని అన్నారు. చిరు వ్యాపారులకు ఇబ్బంది ఉన్నా ఆక్రమణలు తొలగిస్తామని స్పష్టం చేశారు. ఢిల్లీ మాదిరిగా కాలుష్య నగరం కాకూడదనే హిల్ట్ పాలసీ తీసుకువచ్చామని వివరించారు. ప్రతిపక్షాల నేతలు హిల్ట్‌పాలసీపై ఆరోపణలు, అసత్య ప్రచారాలు చేయొద్దని హితవు పలికారు. అభివృద్ధికి అడ్డంకులు సృష్టించొద్దని కోరారు. నగరం నుంచి బయటకు మిగతా 2లో..

# ఆందోళనకరంగా పశ్చిమాసియా పరిస్థితి

- యుద్ధంతో భారత్‌కు ఎన్నో సవాళ్లు , - లోక్‌సభలో ప్రధాని మోడీ వెల్లడి



న్యూఢిల్లీ,మార్చి23 : పశ్చిమాసియాలో పరిస్థితి ఆందోళనకరంగా ఉందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. సోమవారం ఆయన లోక్‌సభలో మధ్యప్రాచ్యంలో యుద్ధం గురించి ప్రసంగించారు. మూడు వారాలుగా యుద్ధం కొనసాగుతోందన్న ప్రధాని మోదీ.. భారత్ ఇంధన అవసరాలను పశ్చిమాసియా తీరుస్తోందన్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ యుద్ధం భారత్‌కు ఎన్నో సవాళ్లు తీసుకొ చ్చిందని మోదీ అన్నారు. ప్రజలపై యుద్ధం తీవ్ర ప్రభావం చూపిస్తోందని కూడా ప్రధాని మోదీ వెల్లడించారు. పశ్చిమాసియాలో కోటి మందికిపైగా భారతీయులు ఉన్నారని, గల్ఫ్‌లో ఉన్న భారతీయుల రక్షణకు చర్యలు చేపట్టామని ప్రధాని మోదీ లోక్ సభలో చెప్పారు. 24 గంటలూ కంట్రోల్ రూమ్స్, హెల్ప్‌లైన్స్ ఏర్పాటు చేశామని, 3.75 లక్షల మంది భారతీయులు క్షేమంగా వెనక్కి వచ్చారని మోదీ మిగతా 2లో..

## విద్యుత్‌శాఖలో పనిచేస్తూ ప్రమాదవశాత్తు మరణం

- రెండు కుటుంబాలకు కోటి చొప్పున చెక్కులు అందచేత



హైదరాబాద్,మార్చి23 : విద్యుత్ శాఖలో పనిచేస్తూ విధి నిర్వహణలో మరణించిన వారి కుటుంబాలకు మిగతా 2లో..

## డ్రగ్స్ కేసులో కీలక పరిణామం

- నిందితులకు మూడురోజుల పోలీస్ కస్టడీ



హైదరాబాద్,మార్చి23 : మొయినాబాద్ డ్రగ్స్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో అరెస్టైన నిందితులను పోలీస్ కస్టడీకి ఇవ్వడానికి కోర్టు అనుమతి ఇచ్చింది. మొయినాబాద్ డ్రగ్స్ మిగతా 2లో..

# బియ్యం ఎగుమతులపై అసెంబ్లీలో మాటల యుద్ధం

- అక్రమాలు జరిగాయన్న హరీష్ రావు, - హౌజ్ కమిటీ వేయాలని డిమాండ్
- హరీష్ వ్యాఖ్యలను తోసిపుచ్చిన మంత్రి ఉత్తమ్



హైదరాబాద్,మార్చి23 :బియ్యం రవాణాపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అసత్యాలు చెప్పారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఫిలిప్పీన్స్‌కు బియ్యం పంపడంలో కుంభకోణం జరిగిందని ఆరోపించారు. సీబీఐ, ఈడీ కేసులున్న ప్రేమ్‌చంద్ గార్గ్‌ను సలహాదారుగా పెట్టుకున్నారని ఆక్షేపించారు. ఆయన ఇప్పుడు ఎక్కడ ఉన్నారో ప్రభుత్వం చెప్పాలని హరీశ్ ప్రశ్నించారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన ఈ అంశంపై మాట్లాడారు. మిగతా 2లో..

# సకాలంలో ఉద్యోగులకు జీతాల చెల్లింపు

- పెండింగ్ బిల్లులు కూడా త్వరలోనే చెల్లిస్తాం
- బిఆర్ఎస్ వదిలిన మూడు డిఎలు కూడా చెల్లిస్తాం
- బకాయిలు చెల్లించలేక పదవీ విరమణ పెంచారు
- ఉద్యోగుల సమస్యలపై అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



హైదరాబాద్,మార్చి23 : ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 15వ తేదీ తర్వాతే ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు చెల్లించేవారు.. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు మొదటి తేదీనే వేతనాలు చెల్లిస్తున్నాం అని డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క అన్నారు. బిఆర్ఎస్ నేతలు పెండింగ్ లో పెట్టి వెళ్లిన మూడు డి ఏ ల ను మా ప్రభుత్వం చెల్లించిందని అసెంబ్లీలో చెప్పారు. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల భారం తప్పించుకునేందుకు గత ప్రభుత్వం ఉద్యోగుల పదవీ విరమణ వయసును మూడు సంవత్సరాలకు పెంచిందన్నారు. మిగతా 2లో.. ప్రభుత్వ ఉద్యోగుల పదవి విరమణ వయస్సును 58 సంవత్సరాల నుంచి 61 సంవత్సరాలకు పెంచింది. నాలుగవ తరగతి ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 సంవత్సరాల నుంచి 65 సంవత్సరాలకు పెంచింది. ఉద్యోగుల పదవీ విరమణ



# ఎన్నికల అజెండా విస్మరించిన కాంగ్రెస్

- రైతుబంధును 15 వేలు అని,12వేలకు కుదింపు
- బడ్జెట్‌లో పెట్టినవి కూడా అమలు చేయరా?
- బడ్జెట్‌పై చర్చలో బిఆర్ఎస్ నేత హరీష్ రావు విమర్శలు

హైదరాబాద్,మార్చి23 : గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క సీజన్ కూడా ఎగ్గొట్టకుండా రైతుబంధు ఇచ్చిందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఎకరానికి రూ.15వేలు ఇస్తామని ఈ ప్రభుత్వం ఎన్నికల అజెండాలో, తొలి బడ్జెట్‌లో ప్రకటించి, తర్వాత దానిని రూ.12 వేలకు తగ్గించారని అన్నారు. మూడో పంటకు మిగతా 2లో..

# మీరు చేసిన అప్పలకు వడ్డీలు కట్టలేకపోతున్నాం

- రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన ఘనత మీదే
- బిఆర్ఎస్ తీరుపై మండిపడ్డ మంత్రి సీతక్క



హైదరాబాద్,మార్చి23 : తెలంగాణ అసెంబ్లీలో బ్జడెట్ చర్చలు వాడివేడిగా సాగుతున్నాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు చేసిన విమర్శలపై మంత్రి సీతక్క తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని, ఇప్పుడు ఆ అప్పులకు వడ్డీలు కట్టడానికే ప్రభుత్వ ఖజానా సరిపోతోందని ఆమె ధ్వజమెత్తారు. పాండవులు సంపాదించింది కౌరవుల తద్దినానికే సరిపోయినట్లు.. మీరు చేసిన అప్పులకు వడ్డీలు కట్టడమే మాకు సరిపోతోందని అంటూ ఆమె ఎద్దేవా చేశారు. హరీష్ రావు తన నియోజకవర్గంలోనే రైతులకు అప్పులు ఉన్నాయని చెబుతున్నారని, మరి ఫైనాన్స్ మినిస్టర్‌గా ఉండి కూడా పదేళ్లలో ఎందుకు రుణమాఫీ చేయలేకపోయారని సీతక్క ప్రశ్నించారు. ఏకకాలంలో లక్ష రూపాయల రుణమాఫీ మిగతా 2లో..



## సుదీర్ఘకాలంగా ప్రజాసేవలో మోడీ

- అభినందనలు తెలుపుతో ఎక్స్‌లో పవన్ పోస్ట్

అమరావతి,మార్చి23 : ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. ప్రధాని నరేంద్ర మోడీకి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ప్రభుత్వ అధిపతిగా నిరవధికంగా 8,931 రోజుల సేవ పూర్తి చేసిన సందర్భంగా ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రారంభమైన నరేంద్ర మిగతా 2లో..

## ఇది స్టీల్‌ప్లాంట్‌కు శంకుస్థాపన కాదు..

# స్టీల్ సిటీకి ఫౌండేషన్

- ఈజ్ ఆఫ్ డూయింగ్ కాదు..స్పీడ్ ఆఫ్ డూయింగ్
- ఆర్సెలార్ స్టీల్‌ప్లాంట్ పెట్టుబడి ఓ గొప్ప మలుపు
- ఉత్తరాంధ్ర సరికొత్త చరిత్రరాయబోతోంది
- స్టీల్ ప్లాంట్ శంకుస్థాపనలో సిఎం చంద్రబాబు









అనకాపల్లి,మార్చి 23 :ఉత్తరాంధ్రలోని నక్కపల్లిలో సరికొత్త చరిత్ర రాయబోతున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ఆర్సెలార్ స్టీల్‌ప్లాంట్ పెట్టుబడి ఓ గొప్ప మలుపు కాబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. నక్కపల్లి మండలం రాజయ్యపేటలో విశాఖ ఉక్కు కంటే అతిపెద్ద ప్లాంట్ రాబోతోందని, సోమవారం ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా మిగతా 2లో..

## ఆందోళనకరంగా పశ్చిమాసియా పరిస్థితి

తెలిపారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ కొరత లేకుండా చర్యలు చేపట్టామన్నారు. పశ్చిమాసియా పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. ఆయిల్, గ్యాస్, ఎరువుల సరఫరాకు హోర్ముజ్ జలసంధి కీలకమని మోదీ చెప్పారు. ఇంధన భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, దేశంలో 60 శాతం ఒఖఖ ఉత్పత్తి చేస్తున్నామని, 41 దేశాల నుంచి ఇంధనం కొనుగోలు చేస్తున్నామని మోదీ స్పష్టం చేశారు. దేశంలో 53 లక్షల మెట్రిక్ టన్నుల పెట్రోల్ రిజర్వ్ ఉన్నాయని, హోర్ముజ్ నుంచి మరిన్ని నౌకలు భారత్‌కు వస్తున్నాయని మోదీ వెల్లడించారు. రైల్వేల విద్యుదీకరణతో 180 కోట్ల లీటర్ల డీజిల్ ఆదా అయిందని కూడా మోదీ లోక్ సభలో చెప్పారు. ప్రపంచానికి ఆర్థికమాంద్యం ముప్పు పొంచి ఉందన్న ప్రధాని, భారత్‌పై మాంద్యం ప్రభావం పడకుండా చూస్తున్నామని, ఎలాంటి సంక్షోభాన్నైనా ఎదుర్కొనేందుకు సిద్ధమని మోదీ అన్నారు. ఖరీఫ్‌లో రైతులకు డీజిల్ కొరత లేకుండా చూస్తున్నామని, పవర్ ఎ÷-లాంట్స్‌కు కావాల్సినంత బొగ్గు నిల్వలు ఉన్నాయని మోదీ పేర్కొన్నారు. గల్ఫ్ సంక్షోభంపై పార్లమెంట్ మొత్తం ఒకే గళం వినిపించాలని మోదీ ఈ సందర్భంగా కోరారు. పశ్చిమాసియా సంక్షోభం.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై, ప్రజలపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. భారత్‌కు కూడా సవాళ్లు ఎదురవుతున్నాయి. మనకు ఎక్కువగా గల్ఫ్ నుంచే ముడిచమురు, గ్యాస్ వస్తోంది. యుద్ధం వల్ల ఇతర దేశాలతో జరిగే వాణిజ్యం దెబ్బతింటోంది. పశ్చిమాసియా ప్రాంతంలో దాదాపు కోటి మంది భారతీయులు నివసిస్తున్నారు. వాణిజ్య నౌకల్లోనూ అనేకమంది భారతీయ సిబ్బంది పనిచేస్తున్నారు. వారికి అవసరమైన సాయం అందిస్తున్నాం. భారత దౌత్య కార్యాలయాలు సాధ్యమైనంత తోడ్పాటు అందిస్తున్నాయి. ఈ ప్రాంతంలోని దేశాధినేతలతో ఇప్పటికే రెండుసార్లు మాట్లాడాను అని అన్నారు. ప్రస్తుత సంక్షోభ సమయంలో భారతీయుల భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నాం. యుద్ధం మొదలైనప్పటి నుంచి 3.75 లక్షల మంది భారతీయులు అక్కడి నుంచి స్వదేశానికి చేరుకున్నారు. అదేవిధంగా దాదాపు వెయ్యిమంది విద్యార్థులు తిరిగి వచ్చారు. యుద్ధ ప్రభావిత దేశాల్లో సీబీఎస్ఈ ఇప్పటికే 10, 12వ తరగతి బోర్డు పరీక్షలను రద్దు చేసింది. పశ్చిమాసియా పరిణామాల విషయంలో కేంద్రం ప్రభుత్వం అప్రమత్తంగా ఉంది. అన్ని విధాలా సహాయం అందించడానికి సిద్ధంగా ఉందని అన్నారు. అలాగే దేశీయంగా ఎల్పీజీ ఉత్పత్తిని పెంచుతున్నాం. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ సరఫరా సజావుగా జరిగేలా నిరంతర ప్రయత్నాలు చేస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరాదారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాం. గతంలో 27 దేశాల నుంచి ఇంధనాన్ని దిగుమతి చేసుకునేవాళ్లం. ఇప్పుడు ఆ సంఖ్య 41కి పెరిగింది. మనవద్ద ప్రస్తుతం 53 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలు ఉన్నాయి.

వీటిని 65 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా పెంచే దిశగా కృషి చేస్తున్నాం అని వివరించారు. ఇంధనంలో ఇథనాల్ కలపడాన్ని పెంచడం ద్వారా ఏటా ముడి చమురు దిగుమతులను 4.5 కోట్ల బ్యారెళ్ల మేర తగ్గించగలిగాం. ప్రభుత్వ, పారిశ్రామిక రంగాల సంయుక్త కృషితో.. ఈ సంక్షోభం వల్ల తలెత్తే సవాళ్లను దీటుగా ఎదుర్కోగలమనే నమ్మకం ఉంది. యూరియా, ఇతర ఎరువుల విషయంలో రైతులకు సాధ్యమైనంతమేర సాయం అందిస్తూనే ఉంటాం. చర్చలు, దౌత్యం ద్వారా పశ్చిమాసియా సంక్షోభానికి శాంతియుత పరిష్కారం సాధించేలా అన్ని పక్షాలను ప్రోత్సహిస్తున్నాం అని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు.

## సకాలంలో ఉద్యోగులకు జీతాల చెల్లింపు

వయసు పెంచడంతో 17వేల మంది ఉద్యోగుల పదవీ విరమణ ప్రయోజనాల భారం ప్రజా ప్రభుత్వం పైపడిందని అన్నారు. ఇప్పటికే ఉద్యోగుల మెడికల్ బిల్లులను మొత్తం క్లియర్ చేశాం. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి గత ప్రభుత్వం 40, 150 కోట్లు బకాయిలు పెట్టారు. వయస్సుపై సభలో శ్వేత పత్రం విడుదల చేసాం. ఆ బకాయిల్లో ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బిల్లుల మొత్తం 4,575 కోట్లు ఉన్నాయని వివరించారు. మా ప్రభుత్వం వచ్చాక ఉద్యోగుల పెండింగ్ బిల్లులు క్లియర్ చేసేందుకు ప్రతినెల 700 కోట్లు క్రమం తప్పకుండా చెల్లిస్తున్నాం. రాబోయే రోజుల్లో బకాయిలు త్వరితగతిన క్లియర్ చేసేందుకు ప్రతినెలా చెల్లించే 700 కోట్లను 1000 కోట్లకు పెంచాలని విధానపరమైన నిర్ణయం తీసుకునే ఆలోచన ఈ ప్రభుత్వం చేస్తుందని భట్టి అన్నారు. తాము ప్రతి సమస్యనూ మానవీయ కోణంలోనే చూస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన మూడు డీఏ బకాయిలను గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని చెప్పారు. అవన్నీ త్వరలోనే చెల్లిస్తామని చెప్పారు. శాసనసభలో ఆయన మాట్లాడారు. పదవీ విరమణ ప్రయోజనాలను గత ప్రభుత్వం చెల్లించలేదు. రిటైర్‌మెంట్ ప్రయోజనాలు చెల్లించలేకనే పదవీ విరమణ వయసును పెంచారు. దీంతో మా ప్రభుత్వంపై అదనపు భారం పడింది. గత ప్రభుత్వం రూ.40,154 కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టింది. ఉద్యోగులకు కూడా రూ.4,571 కోట్లు బకాయిలు పెట్టింది. సాధ్యమైనంత త్వరగా ఉద్యోగులకు బకాయిలు చెల్లిస్తాం. మానవీయ కోణం ఉంది కాబట్టి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నాం. ఉద్యోగులకు నగదు రహిత ఆరోగ్య కార్డులు ఇస్తున్నాం అని చెప్పారు.

## మీరు చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేకపోతున్నాం

చేస్తామని చెప్పి గత ప్రభుత్వం రైతులను వంచించిందని, ఇప్పుడు ఆరు నెలల తమ పాలనపై విమర్శలు చేయడం హాస్యాస్పదమని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమమే నిధులు, నియామకాల కోసం జరిగిందని గుర్తు చేసిన సీతక్క, బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఎంతమంది నిరుద్యోగులకు ఉద్యోగ గ్యారెంటీ ఇచ్చిందని నిలదీశారు. కేవలం నోటిఫికేషన్లు ఇచ్చి సరిపోదని, తాము అధికారంలోకి రాగానే వేల సంఖ్యలో నియామక పత్రాలు అందజేసి పేద కుటుంబాల్లో వెలుగులు నింపామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు , నూతనంగా ప్రకటించిన 'ఇందిరమ్మ జీవిత బీమా' పథకాలను చూసి బీఆర్ఎస్ నాయకులకు ఓర్వలేకపోతున్నారని సీతక్క విమర్శించారు. మీరు పదేళ్లలో ఎన్ని ఇళ్లు ఇచ్చారో లెక్క చెప్పండి.. మేము ఈ రెండేళ్లలో ఎన్ని ఇస్తామో చూపిస్తాం అని ఆమె సవాలు విసిరారు. హరీష్ రావు పడుతున్న బాధ అంతా అధికారం పోయిందనే తప్ప, ప్రజల మీద ప్రేమతో కాదని సీతక్క వ్యాఖ్యానించారు. సీటు మారగానే చరిత్ర మారిపోదని, పదేళ్ల అధికారంలో ఉండి ప్రజలకు చేయని పనుల గురించి ఇప్పుడు మాట్లాడటం సరికాదని హితవు పలికారు. ప్రజల కోసం తాము చేస్తున్న అభివృద్ధిని అడ్డుకోవద్దని ఆమె సూచించారు.

## సుదీర్ఘకాలంగా ప్రజాసేవలో మోడీ

మోడీ రాజకీయ ప్రయాణం, భారత ప్రధానిగా కొనసాగుతూ దేశానికి విశేష సేవలు అందించిందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. పదవిలో గడిపిన కాలం మాత్రమే కాకుండా, అచంచల సంకల్పం, అలసటలేని కృషి, దేశ సేవకు అంకితమైన జీవితం ప్రధాని మోడీని ప్రత్యేక నాయకుడిగా నిలబెట్టాయని ఆయన అభిప్రాయపడ్డారు పవన్ కల్యాణ్.. 'గ్రాస్ రూట్ స్థాయి నుంచి గ్లోబల్ స్థాయికి దేశాన్ని నడిపిస్తూ 'నేషన్ ఫస్ట్' సిద్ధాంతంతో పాలనకు కొత్త నిర్వచనం ఇచ్చారు' అని పవన్ కల్యాణ్ అన్నారు. రెండు దశాబ్దాలకు పైగా క్రమశిక్షణ, త్యాగం, అపార కృషితో కొనసాగుతున్న నాయకత్వం దేశ అభివృద్ధికి దోహదపడిందని తెలిపారు. మౌలిక వసతులు, పేదల సాధికారత, డిజిటల్ మార్పులు వంటి రంగాల్లో ప్రధాని మోడీ చేసిన కృషిని ఆయన ప్రశంసించారు. ప్రపంచ వేదికపై భారత్ ప్రతిష్టను పెంచడంలో కూడా ప్రధాని నరేంద్ర మోడీ పాత్ర కీలకమని పేర్కొన్నారు పవన్ కల్యాణ్? ఈ మైలురాయి నిజమైన నాయకత్వం స్థిరత్వం, నిబద్ధత, స్వార్థరహిత సేవపై ఆధారపడుతుందని గుర్తుచేస్తుందని అన్నారు. ఇక, ప్రధాని మోడీకి మరింత ఆరోగ్యం, శక్తి కలగాలని, దేశసేవలో ఇంకా ఎన్నో సంవత్సరాలు కొనసాగాలని ఆకాంక్షిస్తూ జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు..

## బియ్యం ఎగుమతులపై అసెంబ్లీలో మాటల యుద్ధం

'బియ్యం ఎగుమతి కోసం టెండర్లు పిలిచారా?నాఫెడ్‌కు అనుమతి ఇవ్వకుండా నామినేషన్ పద్ధతిలో ప్రైవేట్ సంస్థకు ఎందుకిచ్చారో చెప్పాలి. కాకినాడ పోర్టులో 7,500 టన్నుల బియ్యం ఉన్నది నిజమా.. కాదా?ఆ పోర్టులో గిడ్డంగి, నిర్వహణ ఛార్జీలు చెల్లిస్తున్నారా?లేదా?బియ్యం రవాణాలో కుంభకోణం జరిగింది. దీంతో ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగింది. ఈ అంశంపై హౌస్ కమిటీ వేసి నన్ను కూడా సభ్యుడిగా ఉంచాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. బియ్యం ఎగుమతులపై తెలంగాణ అసెంబ్లీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, హరీశ్ రావు మధ్య మాటల యుద్ధం సాగింది. ఫిలిప్పైన్ తో కు బియ్యం ఎగుమతుల్లో భారీ కుంభకోణం జరిగిందని హరీశ్ రావు ఆరోపించారు. ఫిలిప్పిన్స్ తో ఒప్పందం కోసం గార్గ్ ను అడ్వైజర్ గా పెట్టుకున్నారని.. గార్గ్ అనే వ్యక్తి ఈడీ ,సీబీఐ కేసులు ఎదుర్కొంటున్నాడని ఆరోపించారు. బియ్యం ఎగుమతుల కోసం ఎంఓయూ కుదుర్చుకున్నారా? అని ప్రశ్నించారు. కాకినాడ పోర్టులో 7 వేల 500 మెట్రిక్ టన్నుల బియ్యం .. ఏడాదిగా ముక్కిపోయాయని విమర్శించారు. బియ్యం ఎగుమతితో సివిల్ సప్లైస్ శాఖకు కోట్ల నష్టం జరిగిందని ఆరోపించారు. బియ్యం ఎగుమతిపై హౌస్ కమిటీ వేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. హరీశ్ వ్యాఖ్యలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ బియ్యాన్ని విదేశాలకు ఎగుమతి చేస్తున్నామని చెప్పారు. ఫిలిప్పిన్స్ తో బియ్యం ఎగుమతులకు ఒప్పందం కుదుర్చుకున్నామని చెప్పారు. బియ్యం ఎగుమతులపై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం అని మండిపడ్డారు. ఏమీ తెలియకుండా స్కాం అంటూ హరీశ్ రావు ఆరోపిస్తున్నారని చెప్పారు. షిప్పింగ్ చార్జీలు, గోదాం ఛార్జీలు చార్జీలన్నీ ఫిలిఫ్ఫైన్స్ చూసుకుంటుందన్నారు. రైతులు పండించిన ప్రతీ ధాన్యపు గింజ కొంటున్నామని చెప్పారు. గత సర్కార్ కంటే ఎక్కువగా రైతులకు మేలు చేస్తున్నామని తెలిపారు. నేరుగా ఫిలిఫ్ఫైన్స్ మంత్రితోనే ఒప్పందం చేసుకున్నామని తెలిపారు. అగ్రి మెంట్ చేసుకుని బియ్యాన్ని ఎగుమతి చేస్తున్నామని చెప్పారు ఉత్తమ్. మీరు సిఫారసు చేసిన వ్యక్తులకు బియ్యం ఇవ్వకుంటే స్కాం జరిగినట్టేనా అని హరీశ్ ను ప్రశ్నించారు ఉత్తమ్.

## విద్యుత్‌శాఖలో పనిచేస్తూ ప్రమాదవశాత్తు మరణం

రూ.1 కోటి చొప్పున ప్రమాద బీమా చెక్కులు అందజేసిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అందేశారు. మృతిచెందిన వారి కుటుంబాలను ఆదుకునేందుకు ముందుకు వచ్చిన విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్కను సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 5 లక్షల నుంచి పది లక్షలకు పెంచాం. సీపెక్ సర్వే ప్రకారం తేలిన కుటుంబాలన్నింటికీ రూ. 5 లక్షల బీమా వర్తిస్తుంది కుటుంబ పెద్ద మరణించినప్పుడు ఆ కుటుంబం వీధిన పడొద్దని భావనతో కుటుంబ బీమా తీసుకొచ్చాం అని ఈ సందర్భంగా సిఎం అన్నారు.విద్యుత్, సింగరేణి కార్మికులకు రూ. కోటి పైన ప్రమాద బీమా సౌకర్యం కల్పించాం అన్నారు. విద్యుత్ శాఖలో పని చేస్తూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఓర్సు సురేశ్, ముక్తార్ బేగ్ కుటుంబ సభ్యులకు రూ.కోటి చొప్పున చెక్కులు రేవంత్ రెడ్డి అందచేశారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల్లో మనోధైర్యం నింపేందుకే అసెంబ్లీ సమావేశాల సమయంలో చెక్కుల పంపిణీ కార్యక్రమం చేపట్టాం అన్నారు.

# డ్రగ్స్ కేసులో కీలక పరిణామం

కేసులో నిందితులుగా ఉన్న పైలెట్ రోహిత్‌రెడ్డి, రితేష్‌రెడ్డి, నమిత్ శర్మలను మూడు రోజుల పాటు పోలీస్ కస్టడీకి ఇవ్వాలని ఉప్పర్‌పల్లి కోర్టు ఆదేశించింది. విచారణలో భాగంగా మరిన్ని వివరాలు రాబట్టేందుకు పోలీసుల అభ్యర్థనపై కోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. కోర్టు అనుమతితో నిందితులను రేపటి నుంచి కస్టడీకి తీసుకుని పోలీసులు విచారణ చేపట్టనున్నారు. ఈ కేసులో డ్రగ్స్ సరఫరా, నెట్‌వర్క్‌కు సంబంధించిన కీలక విషయాలను వెలికితీయాలని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే ఈ కేసు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారగా, కస్టడీ విచారణలో మరిన్ని కీలక వివరాలు బయటపడే అవకాశం ఉందని పోలీసులు చెబుతున్నారు.

# హైదరాబాద్ అభివృద్ధికి అందరూ సహకరించాలి

వెళ్లేందుకే ఎలివేటెడ్ కారిడార్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మూసీ ప్రాజెక్టుతోపాటు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం జరుగుతోందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎలివేటెడ్ కారిడార్లకు ఎక్కువ భూమి కూడా అవసరం లేదని క్లారిటీ ఇచ్చారు. గతంలో మాదిరిగా నచ్చితే నజరానా.. లేకపోతే జరిమానా విధించే విధానం ఉండదని చెప్పుకొచ్చారు. గుడ్ గవర్నెన్స్ కాదని.. మాది స్మార్ట్ గవర్నెన్స్ అని వ్యాఖ్యానించారు. అనేక సంస్కరణలు తీసుకొస్తున్నామని.. ప్రతిపక్షాలు, ప్రజలు సహకరించాలని సూచించారు. ప్రతిపక్షాల నేతలు అభివృద్ధిని అడ్డుకోవాలని చూడొద్దని.. ఏవైనా సూచనలు ఉంటే ఇవ్వండి.. స్వీకరిస్తామని పేర్కొన్నారు. మూసీ ప్రక్షాళన అత్యంత అవసరమని తెలిపారు. మూసీ కాలుష్యంతో నల్గొండ జిల్లా ప్రజలు నరకం చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పండించిన పంటలు కూడా తినే పరిస్థితి లేదని అన్నారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను తమ ప్రభుత్వం తీసుకురాలేదని..కేసీఆర్ హయాంలో తీసుకొచ్చిన విధానాన్నే తాము కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు. గుజరాత్‌లో సబర్మతి ప్రక్షాళనకు కాంగ్రెస్ సహకరించిందని ప్రస్తావించారు. హైదరాబాద్‌లో మూసీ ప్రక్షాళనకు రాజకీయ రంగు ఎందుకు? అని ప్రశ్నించారు. ఎవరినీ నిరాశ్రయులను చేయం.. పునరావాసం కల్పిస్తామని భరోసా కల్పించారు. ప్రతిపక్షాల నేతలు అడ్డుకోవడం తప్పించి.. ఏ సలహా ఇచ్చినా తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎవరికీ నష్టం కలిగించం.. బాధితులందరినీ ఆదుకుంటామని మాటిచ్చారు. మూసీ పరివాహకంలో ఉన్న అందరికీ మెరుగైన వసతులు కల్పిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో వర్షం పడిందంటే కదల్లేని పరిస్థితి ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులకు ఇబ్బందులు తప్పట్లేదని తెలిపారు. హైదరాబాద్‌ను విస్తరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. దేశంలో ఐదు మెట్రో నగరాలైన హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు అత్యంత కీలకమైనవని చెప్పుకొచ్చారు. పెట్టుబడులను నగరాల నిర్మాణం, నిర్వహణ నిర్దేశిస్తాయని అన్నారు. నగరాలపైనే రాష్ట్రాల ప్రగతి ఆధారపడి ఉంటుందని తెలిపారు. ఢిల్లీలో కాలుష్యం వల్లే స్కూల్స్, ఆఫీసులకు సెలవులు ఇస్తున్నారని ప్రస్తావించారు. ముంబైలో వర్షం పడిందంటే కదల్లేని పరిస్థితి ఉందని చెప్పుకొచ్చారు. చెన్నై, బెంగళూరులోనూ ట్రాఫిక్ కష్టాలు తప్పట్లేదని అన్నారు. మానవ తప్పిదాల వల్లే అనేక కష్టాలు వస్తున్నాయని ప్రస్తావించారు. హైదరాబాద్ అంటే లేక్స్ అండ్ రాక్స్ సిటీ అని చెప్పుకొచ్చారు. ఓల్డ్ సిటీగా పిలుస్తున్న ప్రాంతం ఒకప్పుడు ఒరిజినల్ సిటీ అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆదాయ మార్గాలు మెరుగుపడటంతో ప్రతి కుటుంబంలో కార్లు పెరిగాయి. ట్రాఫిక్ రద్దీ వల్లే మెట్రో, ఎంఎంటీఎస్ విస్తరించుకున్నాం. హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ బాగా పెరిగింది. కాలుష్యం వెదజల్లే పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు తరలిస్తాం. రోడ్లను అండర్‌పాస్‌లు, సర్ఫేస్, ఎలివేటెడ్ కారిడార్లుగా విభజించాం. ఎక్కడా ట్రాఫిక్ ఆగకూడదనేదే మా లక్ష్యం. మెట్రో విస్తరణకు ఎల్ అండ్ టీ ముందుకు రాలేదు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల నేపథ్యంలో రూ.15వేల కోట్లు కేటాయించి మెట్రోను స్వాధీనం చేసుకున్నాం. ఈ ప్రాజెక్టును మరో 76 కి.మీ విస్తరిస్తాం. విస్తరణకు కేంద్రం కూడా సానుకూలంగా స్పందించింది. నగర శివార్ల నుంచి వచ్చే ఉద్యోగుల సంఖ్య బాగా పెరిగింది. శామీర్‌పేట, మేడ్చల్ వైపు ఎలివేటెడ్ కారిడార్లు నిర్మిస్తాం. దీనికోసం కేంద్ర సంస్థలతో మాట్లాడి భూమి తీసుకుంటున్నాం.

జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లో రోడ్ల విస్తరణకు ఇబ్బందులు ఉన్నాయి. సిగ్నల్ వద్ద వాహనాలు ఆగకుండా వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నాం. రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగిస్తున్నాం. చిరువ్యాపారులకు ఇతర చోట్ల స్థలాలు కేటాయిస్తాం. కొన్నిచోట్ల మల్టీ లెవల్ కారు పార్కింగ్‌లు ఏర్పాటు చేస్తున్నాం. ముందు జాగ్రత్త తీసుకోకుంటే ఢిల్లీ వలే కాలుష్యం పెరిగిపోతుంది. ఓఆర్ఆర్ లోపల పలుచోట్ల రేడియల్ రోడ్లు వేస్తున్నాం. దూరం తగ్గించేందుకు ఎలివేటెడ్ కారిడార్లు నిర్మిస్తున్నాం. సిటీ మధ్య నుంచి అన్ని ప్రాంతాలకూ ఇవి వస్తాయి. దీంతో హైదరాబాద్ అద్భుత నగరంగా మారుతుంది. డ్రైనేజీ వ్యవస్థను మారిస్తే మూసీ సుందరీకరణ త్వరగా పూర్తవుతుంది. 30వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నాం. ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. క్యూర్‌లో సర్వీస్ సెక్టార్, ప్యూర్‌లో ఇండస్ట్రియల్ సెక్టార్, రేర్‌లో అగ్రికల్చరల్ సెక్టార్ రానుంది. గుజరాత్ అభివృద్ధిలో భాజపాకు కాంగ్రెస్ పూర్తి సహకారం అందించింది. అన్ని పార్టీల నేతలూ ఒక్కటై నగర అభివృద్ధికి కలిసి రావాలని కోరారు.

## విద్యుత్ ఉద్యోగులకు అండగా ప్రభుత్వం

విధి నిర్వహణలో మరణించిన కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటామని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మృతిచెందిన వారి కుటుంబాలను ఆదుకునేందుకు ముందుకు వచ్చిన విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కను అభినందించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని పేర్కొన్నారు. సీపెక్ సర్వే ప్రకారం రూ. 5 లక్షల బీమా ఆయా కుటుంబాలకు వర్తిస్తుందని స్పష్టం చేశారు. కుటుంబ పెద్ద మరణించినప్పుడు ఆ కుటుంబం వీధిన పడొద్దనే భావనతో కుటుంబ బీమా తీసుకొచ్చామని అన్నారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల్లో మనోధైర్యం నింపేందుకే అసెంబ్లీ సమావేశాల సమయంలో చెక్కుల పంపిణీ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. విద్యుత్, సింగరేణి కార్మికులకు రూ. కోటి పైన ప్రమాద బీమా సౌకర్యం కల్పించామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన విద్యుత్ ఉద్యోగుల కుటుంబాలకు భారీ ఆర్థిక సాయాన్ని తెలంగాణ అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అందజేశారు. ఉద్యోగుల భద్రతకు, వారి కుటుంబాల భరోసాకు ప్రభుత్వం కట్టుబడి ఉందనే సంకేతాన్ని ఈ కార్యక్రమం ద్వారా చాటి చెప్పామని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం విద్యుత్, సింగరేణి కార్మికుల కోసం ప్రవేశపెట్టిన ప్రత్యేక ప్రమాద బీమా పథకం కింద భారీ మొత్తాన్ని అందజేశారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తూ మరణించిన ఇద్దరు విద్యుత్ ఉద్యోగుల కుటుంబాలకు చెక్కులు అందజేశారు. ఓర్సు సురేశ్ యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన ఉద్యోగి. ముక్తార్ బేగ్ మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఉద్యోగి. వీరి కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ. కోటి చొప్పున బీమా చెక్కులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అందజేశారు.

## ఇది స్టీల్‌ప్లాంట్‌కు శంకుస్థాపన కాదు.. స్టీల్ సిటీకి ఫౌండేషన్

ప్లాంట్‌కు భూమి పూజ జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 'ప్రపంచానికి ఏపీ సత్తా చాటిచెప్పే ప్రాజెక్ట్ ఈ స్టీల్‌ప్లాంట్. ప్రధాని మోదీ సహకారంతోనే ప్లాంట్ ఏర్పాటు సాధ్యమైంది. స్టీల్‌ప్లాంట్ ఏర్పాటులో మంత్రి లోకేశ్ కృషి ఎంతో ఉంది. అన్నివిధాలా సహకరిస్తున్న పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు. ప్లాంట్ ఏర్పాటుతో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారబోతున్నాయి. ఇది స్టీల్‌ప్లాంట్‌కు శంకుస్థాపన కాదు.. స్టీల్ సిటీకి ఫౌండేషన్. అని అన్నారు. ఉత్తరాంధ్రలోని నక్కపల్లిలో కొత్తచరిత్ర లిఖిస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమకంటే.. అతిపెద్ద పరిశ్రమ రాజయ్యపేటలో ఏర్పాటు కాబోతోందన్నారు. ఆర్సెలార్ మిత్తల్ పెట్టుబడిని గొప్ప మలుపుగా అభివర్ణించారు. భారత్‌లోనే అతిపెద్ద స్టీల్‌ప్లాంట్ నక్కపల్లిలో ఏర్పాటు కాబోతోంది. ప్రపంచంలోనే నెంబర్‌వన్ ఉక్కు పరిశ్రమగా ఆర్సెలార్ మిత్తల్ స్టీల్‌ప్లాంట్ కాబోతోంది. కేంద్రం సహకారం ఉండటం వల్లే ఈ ప్లాంట్ సాధ్యమవుతోందని అన్నారు. రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చాం. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన చేస్తామని హామీ ఇచ్చాం. ఇచ్చిన హామీలను 20 నెలల్లో పూర్తి చేశాం. ఏ పని తలపెట్టినా బేషరతుగా మద్దతిస్తున్న పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు. ఈ ప్రాజెక్టు తీసుకొచ్చేందుకు ప్రణాళికాబద్ధంగా పని చేసిన లోకేశ్‌కు అభినందనలు. 5,465 ఎకరాల్లో ఆర్సెలార్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కాబోతోంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి లభిస్తుంది. ఈ ప్రాజెక్టును రెండు దశల్లో పూర్తి చేస్తాం. ఇవాళ స్టీల్‌ప్లాంట్‌కే కాదు.. స్టీల్ సిటీకి పునాది వేశాం. 2028 డిసెంబర్ నుంచి స్టీల్ ఉత్పత్తి ప్రారంభమవుతుంది. ఈ ప్లాంట్ ద్వారా ఈ ప్రాంత రూపురేఖలే మారిపోతాయి. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వైపు వెళ్తున్నాం. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా రికార్డు స్థాయిలో భూ సేకరణ చేశాం అని అన్నారు. దేశంలోనే పెట్టుబడులకు ఏపీ గమ్యస్థానం. ఏపీలో ఉన్నన్ని వనరులు ఎక్కడా లేవు. అద్భుత విజయాలకు పెట్టుబడిదారులు ఏపీని కేంద్రంగా చేసుకోవాలి. ఇప్పటికే రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం. మూడేళ్లలో 22 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం. విశాఖను ప్రపంచస్థాయి నగరంగా చేస్తాం. విశాఖ, అమరావతి, తిరుపతిని మూడు రీజియన్లుగా అభివృద్ధి చేస్తాం. రేర్ ఎర్త్ మినరల్స్ హబ్‌గా విశాఖ తయారవుతుందని చంద్రబాబు అన్నారు. ఏపీలో అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన అందిస్తున్నాం. కేంద్రం సహకారంతోనే అభివృద్ధి సాధ్యమవుతోంది. ప్లాంట్ ఏర్పాటుతో లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయి. ప్రాజెక్టుకు భూములు ఇచ్చిన రైతులకు రుణపడి ఉంటాం. అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దుతాం. క్వాంటమ్ వ్యాలీకి కేరాఫ్‌గా అమరావతి మారబోతోంది. ఉత్తరాంధ్ర సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం. విశాఖకు గూగుల్ డేటా సెంటర్ రాబోతోందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వల్లే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ప్లాంట్ ఏర్పాటుతో ఉత్తరాంధ్ర ప్రజలకు అధిక ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఆర్సెలార్ పెట్టుబడులు తమలో విశ్వాసం మరింత పెంచాయని అన్నారు. చంద్రబాబు వంటి దార్శనిక నేత ఉంటేనే పెట్టుబడులు వస్తాయని, చంద్రబాబు వల్లే ఏపీకి పెట్టుబడులు వస్తున్నాయని అమిత్ షా కూడా చెప్పారని పేర్కొన్నారు. అత్యాధునిక సాంకేతికతతో దేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కాబోతోందని తెలిపారు. భూమిపూజలో పాల్గొనడం సంతోషంగా ఉందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఏపీలో పెట్టుబడులు పెడుతున్న స్టీల్‌ప్లాంట్ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ద్వారా లక్షమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలకు అధికంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. 'ఆర్సెలార్ స్టీల్ఎ÷-లాంట్ పెట్టుబడులు మాలో విశ్వాసాన్ని పెంచాయి. పెట్టుబడులు రావాలంటే దార్శనికత ఉన్న నేత కావాలని ఎన్నికల్లో చెప్పాను. లక్ష్మి మిత్తల్‌ను ఒప్పించి పెట్టుబడులు తీసుకురావాలంటే చంద్రబాబు వల్లే సాధ్యం. రాజకీయ ధురంధరుడు చంద్రబాబు వల్లే పెట్టుబడులు వస్తున్నాయి. అదే విషయాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా కూడా చెప్పారు. అత్యాధునిక సాంకేతికతతో దేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ స్టీల్ఎ÷-లాంట్ ఏర్పాటు కాబోతోందని పవన్ కల్యాణ్ తెలిపారు. ఏపీలో పెట్టుబడులు పెట్టాలని 2019లోనే ఆదిత్య మిట్టల్‌ను కోరామని మంత్రి నారా లోకేశ్ అన్నారు. 2024లో అధికారంలోకి రాగానే స్టీల్ఎ÷-లాంట్ కోసం ప్రయత్నాలు చేశామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులకు గమ్యస్థానమన్నారు. ప్లాంట్ ఏర్పాటుతో ప్రపంచ పటంలో అనకాపల్లి ఉంటుందని వెల్లడించారు. ఎ÷-లాంట్ ఏర్పాటుతో లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని తెలిపారు. పెట్టుబడిదారుల్లో సీఎం చంద్రబాబు విశ్వాసం నింపారని, ప్లాంట్‌కు కేంద్రమంత్రి కుమారస్వామి వేగంగా అనుమతులు ఇచ్చారని లోకేశ్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తోనే ఏపీ ప్రజలకు మేలు జరుగుతుందని కేంద్ర మంత్రి కుమారస్వామి అన్నారు. లోకేశ్ తండ్రికి తగ్గ తనయుడంటూ ప్రశంసించారు. నారా లోకేశ్ మంచి భవిష్యత్తు ఉన్న నాయకుడన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, ఉక్కు రంగంలో అనేక సంస్కరణలు తీసుకొస్తున్నామని తెలిపారు. విశాఖ ఉక్కును ఆర్థికంగా ఆదుకున్నామని వెల్లడించారు. చంద్రబాబు శ్రద్ధ, చొరవతో ఏపీ శరవేగంగా దూసుకుపోతోందని కేంద్ర మంత్రి కుమారస్వామి అన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ వల్ల ఏపీ ప్రజలకు మంచి జరుగుతుందన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమకు ఆర్థికంగా మద్దతిచ్చాం. విశాఖ ఉక్కు పరిశ్రమలో ఉత్పత్తి పెంచేలా చర్యలు చేపట్టాం అని అన్నారు.

## ఎన్నికల అజెండా విస్మరించిన కాంగ్రెస్

రైతుబంధు ఇవ్వాలని అడిగిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఒక సీజన్‌కే ఇస్తున్నారని అన్నారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా హరీశ్‌రావు శాసనసభలో మాట్లాడారు. ఒక సీజన్ రైతు భరోసా ఎగ్గొట్టి రుణామాఫీ చేశామని గొప్పలు చెప్పుకున్నారని ఎద్దేవా చేశారు. ' మొదటి బడ్జెట్‌లో పెట్టినట్లు ఎకరాకు రూ.15వేలు చొప్పున రైతు భరోసా ఇవ్వాలి. బడ్జెట్‌లో పెట్టినవి కూడా అమలు చేయకపోవడం సిగ్గుచేటు. ఎన్నికలు ఉన్నప్పుడు మాత్రమే రైతుభరోసా, పంటల బోనస్ ఇస్తున్నారు. రెండు బడ్జెట్లలో పెట్టిన పంటల బీమా ఈ బడ్జెట్‌లో మాయమైంది. రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని, రెండు బడ్జెట్‌లలో పెట్టారు. ఒక్కసారి కూడా ఇవ్వలేదు. జాబ్ క్యాలెండర్ త్వరలోనే ప్రారంభిస్తామని గత బడ్జెట్‌లో చెప్పారు. ఈసారి ఆ ప్రస్తావనే లేదని హరీశ్‌రావు అన్నారు. ఈ మేరకు అసెంబ్లీ వేదికగా కాంగ్రెస్ సర్కారుపై నిప్పులు చెరిగారు. బడ్జెట్‌పై చర్చలో భాగంగా అసెంబ్లీలో మాట్లాడిన ఆయన.. ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో లోపాలను ఆయన ఎండగొట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక్క సీజన్ కూడా ఎగ్గొట్టకుండా రైతుబంధు ఇచ్చామని మాజీ మంత్రి హరీశ్‌రావు చెప్పారు. కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే మూడు సీజన్‌లలో రైతు భరోసాను ఎగ్గింటిందని అన్నారు. కాంగ్రెస్ నేతలు ఎన్నికల ప్రచారం సందర్భంగా తాము అధికారంలోకి వస్తే ఎకరానికి రూ.15 వేలు రైతుబంధు ఇస్తామని హామీ ఇచ్చారని, ఈ మేరకు ఎన్నికల అజెండాలో కూడా పెట్టారని హరీష్‌రావు గుర్తుచేశారు. తొలి బడ్జెట్‌లో ప్రకటించి, ఆ తర్వాత దాన్ని రూ.12 వేలకు తగ్గించారని మండిపడ్డారు. మా ప్రభుత్వాన్ని మూడో పంటకు కూడా రైతుబంధు ఇవ్వాలని డిమాండ్ చేసిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు ఒక ఒక పంటకే ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. ఏటా ఒక సీజన్‌కే రైతు భరోసా ఇస్తూ.. రుణామాఫీ చేశామని గొప్పలు చెప్పుకున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.'మొదటి బడ్జెట్‌లో పెట్టినట్లుగా ఎకరాకు రూ.15 వేల చొప్పున రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో పెట్టినవి కూడా అమలు చేయకపోవడం సిగ్గుచేటు అని వ్యాఖ్యానించారు. ఎన్నికలు ఉన్నప్పుడు మాత్రమే రైతుభరోసా, పంటల బోనస్ ఇస్తున్నారని విమర్శించారు.

రెండు బడ్జెట్లలో పెట్టిన పంటల బీమా ఈ బడ్జెట్‌లో మాయమైందని అన్నారు. రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని కూడా రెండు బడ్జెట్‌లలో పెట్టారని, కానీ ఒక్కసారి కూడా ఇవ్వలేదని చెప్పారు. జాబ్ క్యాలెండర్ త్వరలోనే ప్రారంభిస్తామని గత బడ్జెట్‌లో చెప్పారని, ఈసారి బడ్జెట్‌లో ఆ ప్రస్తావనే లేదని హరీశ్‌రావు దుయ్యబట్టారు. ఈ ప్రభుత్వం ఎక్సైజ్ ఆదాయాన్ని వచ్చే ఏడాదికల్లా రూ.12 వేల కోట్లు పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రస్తుతం 34 వేల కోట్లుగా ఉన్న ఎక్సైజ్ ఆదాయాన్ని రూ.46 వేల కోట్లకు ఎట్లా పెంచుతారని, ఊరూరుకు బార్లు ఓపెన్ చేస్తారా..? అని నిలదీశారు. దాంతో ఎక్సైజ్ మంత్రి జూపల్లి కలుగజేసుకుని కాంగ్రెస్ హయాంలో రూ.12 వేల కోట్లుగా ఎక్సైజ్ ఆదాయాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.36 వేల కోట్లు పెంచిందని అన్నారు. జూపల్లి కలుగజేసుకోవడంపై హరీష్‌రావు అసహనం వ్యక్తంచేశారు. తన ప్రశ్నకు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కగారు సమాధానం చెప్పాలని అన్నారు. తాను బడ్జెట్‌పై ప్రశ్నలు అడుగుతున్నానని, ఎక్సైజ్ శాఖకు సంబంధించిన సబ్జెక్టుపై కాదని చెప్పారు. ఈ సందర్భంగా తలసాని జోక్యం చేసుకుని ప్రభుత్వ తీరును విమర్శించారు.


## బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సామాన్య ప్రజలకు తెలియజేయునది ఏమనగా, దిగువ పేర్కొన్న ఆస్తికి సంపూర్ణ యజమాని అయిన నా క్లయింట్ శ్రీ గొల్లూరి యుగంధర్ , తండ్రి చెన్నయ్య, సదరు ఆస్తిని తనఖా పెట్టి, బ్యాంకులు/ఆర్థిక సంస్థల నుండి రుణం పొందాలనుకుంటున్నారు. ఒకవేళ ఎవరికైనా సదరు ఆస్తిపై ఏవైనా అభ్యంతరాలు/హక్కులు/ ఆనక్తులు/ వివాదాలు ఉన్నట్లయితే, ఈ ప్రకటన వెలువడిన తేదీ – నుండి 7 రోజులలోపు దిగువ సంతకం చేసిన వారికి తెలియజేయగలరు. అలా చేయని పక్షంలో తదుపరి ఎటువంటి వాదనలు/అభ్యంతరాలు స్వీకరించబడవు మరియు నా క్లయింట్ బ్యాంకులు/ఆర్థిక సంస్థలకు అనుకూలంగా సదరు ఆస్తిని తనఖా పెట్టి లావాదేవీని పూర్తి చేస్తారు.

ప్రాపర్టీ షెడ్యూల్

S.R.0 నల్గొండ కింద డోర్ నంబర్ 4-11-537/రూ14, పిటిన్ నంబర్ 1042107341, వార్డ్ నంబర్ 4, బ్లాక్ నంబర్ 11, సూర్యవంశీ కాలనీ సమీపంలో, నల్గొండ పట్టణం మరియు మునిసిపాలిటీ, నల్గొండ మండలం మరియు జిల్లా, నివాస గృహం. నల్గొండ, 106.00 చదరపు గజాల విస్తీర్ణం = 88.62 చదరపు మీటర్లు మరియు 310 చదరపు అడుగుల పునాది ప్రాంతం. దీని సరిహద్దులు: ఉత్తరం: 15.0" వెడల్పు రోడ్డు, దక్షిణం: గంట పరమేష్, తూర్పు: చింతల లక్ష్మణ్ ఇల్లు, పశ్చిమం: మమత ఇల్లు

పి.యాదయ్య – అడ్వొకేట్
#8-1-373, రైల్వే స్టేషన్ రోడ్,
క్రాంతి నగర్ కాలనీ, నల్లగొండ – 508001
మొబైల్: 7893922474

# సంపాదకీయం

## క్షయతో మూడు నిముషాలకో ఇద్దరు మృతి

ఒకప్పుడు క్షయవ్యాధి సోకితే మరణం తప్పేది కాదు. కానీ ఆధునిక ప్రపంచంలో వైద్యశాస్త్రం అభివృద్ధి చెందడం, సకాలంలో వ్యాధిని గుర్తించి, మందులు ఇవ్వడం వల్ల, చికిత్స చేయడం వల్ల క్షయను అరికట్టడం సాధ్యమయ్యింది. అయినా నేటికీ మూడు నిముషాలకో ఇద్దరు క్షయవ్యాధితో మరణిస్తున్నారన్న గణాంకాలు చూస్తే భయమేస్తోంది. ఇది కేవలం నిర్లక్ష్యంతో పాటు, సకాలంలో వైద్యం చేయించుకోక పోవడం వంటి కారణాలని వైద్యులు చెబుతున్నారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం ప్రతి సంవత్సరం మార్చి 24న పాటిస్తారు. టీబీ వ్యాధిపై అవగాహన పెంచడం, దాని నిర్మూలనకు కృషి చేయడం దీని ముఖ్య ఉద్దేశ్యం. 1882లో డా. రాబర్ట్ కోచ్ టీబీ బాసిల్లస్ క్షయ వ్యాధి కారకంను కనుగొన్న రోజుగా దీనిని జరుపుకుంటారు. 1882, మార్చి 24న డా. రాబర్ట్ కోచ్ అనే శాస్త్రవేత్త క్షయ వ్యాధికారక సూక్ష్మక్రిములను (మైకోబ్యాక్టీరియమ్ టూబరిక్లోసిన్) మొదటిసారిగా కనుగొన్నాడు. 1982లో అంతర్జాతీయ క్షయ, ఊపిరితిత్తుల వ్యాధుల వ్యతిరేక యూనియన్, రాబర్ట్ కోచ్ క్షయ వ్యాధికారక సూక్ష్మక్రిములను కనుగొని 100 సంవత్సరాలైన సందర్భంగా మార్చి 24న ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం జరుపుకోవాలని ప్రతిపాదించింది. భయంకరమైన అంటువ్యాధైన టీబీ దేశంలో ప్రతి సెకనుకు ఒక్కరికి సోకుతున్నదని, ప్రతిరోజు దేశవ్యాప్తంగా 1000మంది క్షయ వ్యాధితో మరణిస్తున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. భారత ప్రభుత్వం 1962ను క్షయవ్యాధి నివారణకు ప్రత్యేకమైన చర్యలను తీసుకోవడం ప్రారంభించింది. క్షయవ్యాధి అనేది మైకోబాక్టీరియం ట్యూబర్‌క్యులోసిస్ అనే బ్యాక్టీరియా వల్ల కలిగే అంటువ్యాధి. ఇది ప్రధానంగా ఊపిరితిత్తులపై దాడి చేస్తుంది. దగ్గు, తుమ్ముల ద్వారా గాలిలో వ్యాపిస్తుంది. 2 వారాల కంటే ఎక్కువ కాలం దగ్గు, జ్వరం, రాత్రి చెమటలు మరియు బరువు తగ్గడం వంటివి దీని ప్రధాన లక్షణాలు. 6-9 నెలల పాటు డాక్టర్ పర్యవేక్షణలో మందులు వాడితే ఇది పూర్తిగా నయమవుతుంది. ఈ వ్యాధి ప్రధానంగా ఊపిరితిత్తులపై ప్రభావం చూపిస్తుంది. కానీ మెదడు, మూత్రపిండాలు మరియు వెన్నెముక వంటి శరీరంలోని ఇతర భాగాలపై కూడా ఇది ప్రభావం చూపిస్తుంది. క్రియాశీల పల్మనరీ ఇన్ఫెక్షన్ ఉన్న వ్యక్తులే ఈ వ్యవధి వ్యాప్తికి మూలం. నిజానికి ప్రస్తుతం క్షయకు అత్యాధునిక చికిత్సలు, మందులు అందుబాటులో ఉన్నాయి. కానీ ప్రజలు క్షయ గురించి ఇంకా అవగాహన కలిగించకోవడం లేదని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిని గుర్తించి సకాలంలో వైద్యం చేయించుకుంటే అటు వ్యక్తికే గాకుండా, సమాజా ఆరోగ్యానికి కూడా దోహదపడ్డవారు అవుతారు. 2016లో 10 లక్షల మంది చిన్నారులకు టీబీ సోకగా 2.5 లక్షల మంది పసివాళ్లు ప్రాణాలు కోల్పోయారంటే నమ్మశక్యం కాని విషయం. ప్రపంచం లోనే వందలో 4వ వంతు జనాభాలో క్షయ బ్యాక్టీరియా ఉందంటే ఈ వ్యాధి ప్రభావం ఏ మేర వ్యాపించి ఉందో అర్థం చేసు కోవచ్చు. టిబి వ్యాధిగ్రస్తులు మిగతా దేశాలతో పోలిస్తే భారత్‌లోనే ఎక్కువని గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఆధునిక కాలంలోనూ భారత్ లో విస్తరిస్తున్న అనేక వ్యాధుల్లో ఈ క్షయ వ్యాధి ఒకటి. ఈ వ్యాధి ప్రధానంగా ఊపిరితిత్తులకు సంబంధించినదే అయిన చర్మం నుంచి మెదడు వరకు శరీరంలోని ఏ భాగానికైనా వచ్చే అవకాశం ఉంది. క్షయ వ్యాధి ముఖ్యంగా శ్వాసకోశాన్ని దెబ్బ తీస్తుంది. ఈ వ్యాధి బారినపడి ఇప్పటికీ ప్రతి సంవత్సరం అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ వ్యాధి సోకిన వ్యక్తి నుంచి గాలిలోకి విడుదలయ్యే సూక్ష్మ చుక్కల ద్వారా ఒక వ్యక్తి నుంచి మరొక వ్యక్తికి సులభంగా వ్యాపిస్తుంది.క్షయ వ్యాధి సోకిన వారిలో దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, రక్తంతో కూడిన దగ్గు, రాత్రిపూట చెమటలు పడుతుండడం మరియు కఫంలో రక్తం వంటి లక్షణాలు 2 వారాలకు మించి ఉంటాయి. ఎల్లప్పుడూ అలసిపోయినట్లు అనిపించడమే కాక, నొప్పి మరియు ప్రభావిత ప్రాంతాల్లో వాపు వస్తుంది. వ్యాధిగ్రస్తుల్లో శ్వాస ఆడకపోవడం, ఛాతి నొప్పి వంటి సమస్యలు కూడా సంభవిస్తాయి. ఇలాంటి లక్షణాలు ఉన్నవారు వెంటనే వైద్యులను సంప్రదించి తుగ వైద్యసూచనలు పాటించాలి. లేకుండే ప్రాణాంతకంగా మారుతుందని హెచ్చరిస్తున్నారు. పోషకాహారలోపం మరియు సిలికోసిస్ ఉన్నవారి లోనూ ఈ వ్యాధి సోకుతుంది. ప్రజల నిర్లక్ష్యం కారణంగా ప్రపంచంలోని మొత్తం కొత్త టీబీ కేసుల్లో మూడింట రెండు వంతులు ఎనిమిది దేశాల్లో ఉన్నాయి, భారత్ అగ్రస్థానంలో ఉంది. క్షయ నివారణ మరియు నివారించదగినదని వైద్యులు అంటున్నారు. వ్యాధి ఉన్న వ్యక్తి యొక్క అంటువ్యాధి అతను లేదా ఆమె గాలిలోకి విడుదల చేసే ట్యూబర్‌కిల్ బాసిల్లి సంఖ్యకు నేరుగా సంబంధం కలిగి ఉంటుంది. అనేక ట్యూబర్‌కిల్ బాసిల్లిని బహిష్కరించే వ్యక్తులు తక్కువ లేదా బాసిల్లిని బహిష్కరించే రోగుల కంటే ఎక్కువ అంటువ్యాధి కలిగి ఉంటారు.సకాలంలో వ్యాధిని గుర్తించి చికిత్స తీసుకుంటే, సక్రమంగా మందులు వాడితే వ్యాధిని అదుపు చేయవచ్చని అంటున్నారు. జీవనశైలి మార్పులు కూడా ఈ కాలంలో వ్యాధిని నిర్మూలిం చడంలో సహాయపడతాయి. క్షయ అనేది చికిత్స చేయగల మరియు నయం చేయగల వ్యాధి. సమయానికి మందులను తీసుకోవడం వల్ల రక్తంలో ఔషధం యొక్క ఖచ్చితమైన ఏకాగ్రత స్థాయిని కొనసాగించవచ్చు. వ్యాధికారక క్రిములను చంపడానికి ఇది చాలా అవసరం. చాలా మంది రోగులు చికిత్స కొనసాగుతుండగా మెరుగైన పరిస్థితి కనిపించడంతో, అటువంటి రోగులు కొన్నిసార్లు చికిత్స చేస్తున్న వైద్యుడిని సంప్రదించకుండా వారి స్వంత చికిత్సను ఆపడానికి ఆకర్షితులవుతారు. ఇది హానికరం మరియు మల్టీ డ్రగ్ రెసిస్టెంట్ క్షయవ్యాధి అభివృద్ధికి దారితీస్తుందని హెచ్చరిస్తున్నారు. చికిత్స సమయంలో ధూమపానం మరియు మద్యపానం చేయవద్దు. మీరు మందులు తీసుకునేటప్పుడు ధూమపానం చేస్తే, అది మీ చికిత్సను ప్రభావితం చేయవచ్చని కూడా వైద్యులు హెచ్చరిస్తున్నారు. చికిత్సకు కొన్ని మందులు కాలేయానికి హాని చేస్తాయి.

## మాజీ పార్లమెంటు సభ్యులు రంజిత్ రెడ్డి మాతృమూర్తి చంద్రకళమ్మ పార్థివ దేహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించిన

### ఎమ్మెల్యే పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ

శేరిలింగంపల్లి .మార్చి 23: (విజన్ ఆంధ్ర) చేవెళ్ల మాజీ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ జి. రంజిత్ రెడ్డి మాతృమూర్తి జి. చంద్రకళమ్మ మృతి చెందిన విషయం తెలియగానే జూబ్లీహిల్స్ లోని వారి నివాసానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ తాజా మాజీ కార్పొరేటర్లు నార్నె శ్రీనివాసరావు ఉప్పలపాటి శ్రీకాంత్ సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి గంధం రాములు ఎర్రగడ్డ శ్రీనివాస్ యాదవ్ తో కలిసి వెళ్లి ఆమె పార్థీవ దేహానికి పూలమాల వేసి , ఘన నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన పిఏసి చైర్మన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రకళమ్మ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన పీఏసీ చైర్మన్ . చంద్రకళమ్మ మృతి చెందడం చాలా బాధకరమైన విషయం అని, ఆమె మరణం తీరని లోటు అని, వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుణ్ణి



మనసారా ప్రార్థిస్తున్నాను అని ,వారికి సద్గతి ప్రాప్తించాలని, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని మనసారా ఆ భగవంతున్ని ప్రార్థిస్తూన్నాను అని తెలిపారు

## ఎస్సెస్సీ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

### నిబంధనల అమలుపై నిశిత పరిశీలన

### కాపీయింగ్ కు ఆస్కారం ఉండకూడదని ఆదేశం



నిజామాబాద్, మార్చి 23 :(విజన్ ఆంధ్ర )పదవ తరగతి పరీక్షా కేంద్రాలను కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా కేంద్రంలోని మానిక్ భవన్ పాఠశాలతో పాటు నలంద హైస్కూల్ ఎగ్జామ్ సెంటర్లను సందర్శించి పరీక్షల నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు. విద్యార్థుల హాజరు, సిబ్బంది హాజరు గురించి ఆరా తీశారు. నిబంధనలకు అనుగుణంగానే నిర్ణీత సమయంలో ప్రశ్న పత్రాలను తెరిచారా? అని ఆరా తీశారు. తప్పనిసరిగా సి.సి కెమెరా రికార్డింగ్ నడుమ ప్రశ్న పత్రాల బండిల్ సీళ్లు తెరవాలని సూచించారు. ఈ మేరకు నిబంధనలు పాటించారా లేదా అని సి.సి ఫుటేజీల పరిశీలన ద్వారా నిర్ధారణ చేసుకున్నారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీటి వసతి, ఆరోగ్య కార్యకర్త అందుబాటులో ఉన్నారా లేదా అని గమనించారు. ఎగ్జామ్ హాల్లోకి సిబ్బంది ఎవరైనా సెల్ ఫోన్లతో వచ్చారా అని కలెక్టర్ నిశిత పరిశీలన చేశారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సజావుగా పరీక్షలు జరిపించాలని సూచించారు. ఎక్కడ కూడా కాపీయింగ్ కు ఆస్కారం ఉండకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, కాపీయింగ్ కు ఆస్కారం కల్పిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేశారు. పరీక్షలు ముగిసేంత వరకు అప్రమత్తతతో పకడ్బందీగా విధులు నిర్వహించాలని సూచించారు. ప్రశ్న పత్రాలను తప్పనిసరిగా తగిన పోలీసు బందోబస్తు మధ్య కేంద్రాలకు తరలించాలని, ఎలాంటి తప్పిదాలకు అవకాశం ఇవ్వకుండా పూర్తి పారదర్శకంగా, పక్కాగా పరీక్షలు జరిపించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు జె.శంకర్, టి.శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## ఇచ్చిన ప్రతి ఒక్క హామీ నెరవేర్చే వరకు బిజెపి పోరాటం ఆగదు

### బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు

శేరిలింగంపల్లి .మార్చి 23: (విజన్ ఆంధ్ర)అవినీతి,అరాచక ,కమిషన్ల పాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు నిరసనగా .. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు తో అసెంబ్లీ ముట్టడికి ప్రయత్నించిన బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్ అరెస్ట్ చేసిన పోలీసులు6 గ్యారంటీలు,66 హామీలతో గద్దెనెక్కి,ఇచ్చిన హామీలను మరచి మాయమాటలతో కాలం వెళ్లదీస్తూ ప్రజలను మోసం చేస్తుందిఇచ్చిన ప్రతి ఒక్క హామీ నెరవేర్చే వరకు బీజేపీ పోరాటం ఆగదు,రాబోయే రోజుల్లో మరింత గట్టిగా ప్రజల తరపున ఉద్యమిస్తాం...బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జ్ రవికుమార్ యాదవ్ఈరోజు గడిచిన 2 సంవత్సరాలు గా ప్రజలను మోసగిస్తూ, అవినీతి, అరాచక, కమిషన్ల పాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు నిరసనగా తెలంగాణ బిజెపి రాష్ట్ర కార్యాలయం పిలుపుమేరకు నిర్వహించిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు తో కలిసి అసెంబ్లీ ముట్టడికి ప్రయత్నించిన బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్ మరియు బీజేపీ శ్రేణులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ తరలించిన పోలీసులు,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గడిచిన 2 సంవత్సరాలు గా ప్రజలను మోసగిస్తూ, అవినీతి, అరాచక, కమిషన్ల పాలన సాగిస్తుందని,



ప్రజల తరపున ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదన్నారు, 6 గ్యారంటీలు,66 హామీలతో గద్దెనెక్కి, ఇప్పుడు ఇచ్చిన హామీలను మరచి మాయమాటలతో కాలం వెళ్లదీస్తూ ప్రజలను మోసం చేస్తుందని తెలియజేశారు,తెలంగాణ అమర వీరుల కుటుంబాలకు 25 వేల పింఛను, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, 250 గజాల ఇళ్ల స్థలం పంపిణీ, ఆడపిల్లల పెళ్లికి రూ.లక్షతో పాటు 10 గ్రాముల బంగారం,మహిళలకు ప్రతి నెల 2500,.ప్రతి ఆటో డ్రైవర్ కు సంవత్సరానికి 12000 సాయం,కొత్త రేషన్ కార్డులు,పెన్షన్లు,బీసీ భవన్ల నిర్మాణం, ఇళ్లు లేనివారికి ఇంటి స్థలం మరియు 5 లక్షలు,.విద్యార్థులకు 5 లక్షల విద్య భరోసా కార్డ్ ,18 ఏళ్లు పైబడిన ప్రతి విద్యార్థిని కి స్కూటీ, నిరుద్యోగుల కోసం యూత్ కమిషన్.. రూ. 10 లక్షలు వడ్డీ లేని రుణం, నిరుద్యోగ యువతకు నెలకు రూ. 4 వేల నిరుద్యోగ భృతి,ప్రతి జిల్లాకు రెసిడెన్షియల్ స్పోర్ట్స్ స్కూల్, బస్తీ పబ్లిక్ స్కూల్స్, 4 ట్రిపుల్ ఐటీ లు, మెగా డీఎస్సీ ,జాబ్ క్యాలెండర్ ద్వారా రూ.2 లక్షల ఉద్యోగాల భర్తీ,.దివ్యాంగుల నెలవారీ పెన్షన్ రూ. 6000 వేలకు, ఆసరా పెన్షన్లు 4000 వేలకు పెంపు ,అంగన్వాడీ టీచర్లకు నెలకు రూ. 18 వేల వేతనం,.ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూ. 12 లక్షల ఆర్థిక సాయం, మధ్యాహ్న భోజన కార్మికుల వేతనం రూ. 10 వేలకు పెంపు,.మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు రూ. 5 లక్షలు,రాష్ట్ర వ్యాప్తంగా ఆస్తి పన్ను, ఇంటి పన్ను పై ఉన్న బకాయిలు రద్దు ఇలా ఎన్నో హామీలు ఇచ్చి ఏది నెరవేర్చలేదని ,మీకు గుర్తు లేకపోతే మీ మేనిఫెస్టో ఒకసారి చూసుకోవాలని హితవు పలికారు, ఇప్పటికైనా మేలుకొని ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, లేనిపక్షంలో ప్రజల తరపున తీవ్రంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మహిపాల్ రెడ్డి, ఉపాధ్యక్షులు రాధాకృష్ణ యాదవ్, టాక్ సభ్యులు బుచ్చి రెడ్డి, సీనియర్ నాయకులు గోపాల్ రావు, శ్రీనివాస్ యాదవ్, భరత్ , పద్మ, మేరీ,విష్ణు దత్, రాజేందర్ రెడ్డి,అమర్ యాదవ్,రాము యాదవ్, సాయి కుమార్ పటేల్ మరియు ఇతర బీజేపీ నాయకులు,కార్యకర్తలు , తదితరులు పాల్గొన్నారు.

## గోపనపల్లిలో అక్రమ నీటి తరలింపు తీవ్ర తాగునీటి సంక్షోభం, ఎమ్మార్వోకు గ్రామస్థుల ఫిర్యాదు



శేరిలింగంపల్లి. మార్చి 23: (విజన్ ఆంధ్ర)శేరిలింగంపల్లి మండలం పరిధిలోని గోపనపల్లి గ్రామంలో భూగర్భ జలాల అక్రమ వినియోగం, ట్యాంకర్ల ద్వారా నీటి తరలింపుల కారణంగా తీవ్ర తాగునీటి సంక్షోభం నెలకొంది. ఏళ్ల తరబడి కొనసాగుతున్న ఈ సమస్యపై గ్రామస్థులు పలుమార్లు అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ పరిస్థితి మరింత విషమించిందని తెలిపారు. గ్రామ పరిధిలో పెద్దఎత్తున బోర్లు ఏర్పాటు చేసి ట్యాంకర్ల ద్వారా నీటిని వాణిజ్య అవసరాల కోసం తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. దీని ప్రభావంతో భూగర్భ జల మట్టాలు గణనీయంగా పడిపోయి బోర్లు ఎండిపోయాయి. ప్రస్తుతం 1200 నుంచి 2000 ఫీట్లు బోర్లు వేసినా నీరు అందని పరిస్థితి నెలకొంది. ఫలితంగా గ్రామ ప్రజలు రోజువారీ అవసరాలకు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై గతంలో పలుమార్లు గ్రామస్థులు ట్యాంకర్లను అడ్డుకుని నిరసనలు వ్యక్తం చేసినప్పటికీ తాత్కాలిక చర్యలకే పరిమితమైందని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితిపై సోమవారం (23-03-2026) గోపనపల్లి గ్రామస్థులు శేరిలింగంపల్లి ఎమ్మార్వో మహిపాల్ రెడ్డిని కలిసి ఫిర్యాదు చేసి అక్రమ నీటి తరలింపును అరికట్టడంతో పాటు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మార్వో మహిపాల్ రెడ్డి విచారణ జరిపి పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రాజు నాయక్, మూలగిరి శ్రీనివాస్, సురేందర్, శివకుమార్, వేణు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## షహీద్ భగత్ సింగ్ ఆశయ స్ఫూర్తితో శాంతి కోసం పోరాడుదాం

**యుద్ధం వలన ప్రజలపై భారాలకు సిద్ధమైన కేంద్ర ప్రభుత్వం**

**భగత్ సింగ్,రాజగురు, సుఖదేవ్ ల వర్ధంతి కార్యక్రమంలో ఏఐఎఫ్ డివై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనం సుధాకర్**

శేరిలింగంపల్లి. మార్చి 23: (విజన్ ఆంధ్ర) షాహిద్ భగత్ సింగ్ రాజగురు సుఖదేవుల 95వ వర్ధంతి కార్యక్రమాన్ని నేడు ఏఐఎఫ్ డివై ఆధ్వర్యంలో మియాపూర్ క్రాస్ రోడ్డు వద్ద గల తాండ్ర కుమార్ విగ్రహం దగ్గర ఘనంగా నిర్వహించారు. హాజరైన నాయకులు కూడా ముందుగా భగత్ సింగ్ రాజగురు సుఖదేవ్ ల చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏఐఎఫ్ డివై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనం సుధాకర్ మాట్లాడుతూ... ప్రస్తుతం ఆయా దేశాల మధ్య మతం పేరుతో ఆధిపత్యం పేరుతో వనరుల పేరుతో జరుగుతున్న యుద్ధం వలన లక్షలాదిమంది అమాయక ప్రజలు బలి అవుతున్నారని ఆరోపించారు. అమెరికా సామ్రాజ్యవాదం తన ఆధిపత్య భావజాలాన్ని ఇతర దేశాల పైన చాటుకోవడానికి బలహీన దేశాల యుద్ధాన్ని ప్రేరేపించి తన పబ్బం గడుపుకుంటుందని అన్నారు. ఇరాక్ పై అమెరికా సహకారంతో ఇజ్రాయిల్ చేస్తున్న యావత్ దేశాలలో నివాసాలు ఉంటున్న ప్రజల పైన అనేక ఆర్థిక బారాలు పడనున్నయని అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న యుద్ధం వలన భారత ప్రభుత్వం యుద్ధనీతిని సమర్థించే విధంగా తమ చర్యలు ఉండడం వలన మనదేశంలో ప్రజల పైన గ్యాస్ పెట్రోల్ డీజిల్ తదితర నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశానంటే రోజులు వచ్చాయని ఇది ప్రజలను ఆర్థిక బారాల వైపు నెట్టే ప్రక్రియగా ఉందని దీని అందరు ఖండించాలని అన్నారు.షహిద్ భగత్ సింగ్ అతి చిన్న వయసులో రాజగురు సుకుదేవులతో కలిసి కుల మత ప్రాంతీయ ఆర్థిక అసమానతలు లేని భారత సమాజం కోసం పోరాడి ప్రాణాలర్పించారని అన్నారు. అతి చిన్న వయసులో సామ్రాజ్యవాద విధానాలపై ఆనాడే గర్జించారని అది బ్రిటిష్ సామ్రాజ్యవాదమైన నేటి అమెరికా సామ్రాజ్యవాదమైన ఆయా దేశాల మీద ఆధిపత్యం చేసే విధానాన్ని




ఖండించారని ఆ వెలుగులో సామ్రాజ్యవాద యుద్ధనీతిని ఖండిస్తూ శాంతి కోసం ప్రతి యువత పాటుపడాలని అలాగే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల హామీల అమలులో ఉద్యోగ ఉపాధి కల్పనకై విద్య వైద్యం ప్రజలకు ఉచితంగా ఇచ్చేవరకు షహీద్ భగత్ సింగ్ ఆశ స్ఫూర్తితో యువత పోరాడాలని అప్పుడే వారికి అర్పించే ఘనమైన నివాళి అని అన్నారు. అనంతరం ఏఐఎఫ్ డిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పల్లె మురళి మాట్లాడుతూ.. నాడు భగత్ సింగ్ రాజగురు సుఖదేవ్ లు తెల్ల దొరలకు వ్యతిరేకంగా ప్రాణాలర్పించి స్వాతంత్ర ఉద్యమానికి స్ఫూర్తిగా ఉన్నారని అనేకమంది త్యాగదనుల త్యాగంతో స్వాతంత్ర సాధించుకుంటే నేడు కార్పొరేట్ పెట్టుబడిదారులు దేశాన్ని దోచుకొని తింటున్నారని విద్యా వైద్యం కూడు గూడు రాజ్యాంగ హక్కుల నుంచి దూరం చేశారని ఆరోపించారు. భగత్ సింగ్ కన్న కలలు నిజం అయ్యేంతవరకు ప్రజలు పోరాటాలు నిర్వహించాలని అన్నారు. ఏఐఎఫ్ డివై గ్రేటర్ హైదరాబాద్ కన్వీనర్ టడి మధుసూదన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈ దశరథ్ నాయక్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎండి సుల్తానా బేగం రాష్ట్ర కమిటీ సభ్యులు డి శ్రీనివాసులు,కే షరీఫ్, సభ్యులు రంగస్వామి,దేవనూర్ నర్సింహా, ఆకుల రమేష్, ఎస్ కే ఇక్రాన్ డి నర్సింహా,.ఏఐఎఫ్ డబ్ల్యు నాయకురాలు జి శివాని, లలిత.ఎల్లమ్మ పార్టీ నాయకులు శంకర్ .. తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ

### అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి : కలెక్టర్

నిజామాబాద్, మార్చి 23 :( విజన్ ఆంధ్ర) ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అర్జీలకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను వెంటదివెంట పరిష్కరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 140 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి



వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ఇంచార్జి అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, డీఆర్డీఓ సాయాగౌడ్, ఆర్డీఓ రాజేంద్ర కుమార్, నిజామాబాద్ ఏసీపీ ప్రకాష్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వామపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో ప్రదర్శన



ఖమ్మం మార్చ్ 23 (విజన్ ఆంధ్ర) సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు ఇండియా అమెరికా వాణిజ్య ఒప్పందం రైతాంగానికి ప్రమాదకరంమైనది దేశద్రోహరమైనది అని ఇచ్చిన పిలుపులో భాగంగా ఈరోజు ఖమ్మం లో నాలుగు వామపక్ష రైతు సంఘాలు ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించి భగత్ సింగ్ విగ్రహానికి ఐక్య రైతు సంఘం రాష్ట్ర కోశాధికారి ఆవుల వెంకటేశ్వర్లు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు పొన్నం వెంకటేశ్వర పూలమాలవేసి నివాళులర్పించి తధానంతరం సభ నిర్వహించడం జరిగింది ఈ సభ కు అఖిలభారత ఐక్య రైతు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు మలీదు నాగేశ్వరావుతో పాటు బొంతు రాంబాబు దొండపాటి రమేష్ ఎస్కె కాసిం వామపక్ష రైతు సంఘాల నాయకులు అధ్యక్షత వహించినారు ఈ సభలో ఐక్య రైతు సంఘం ఖమ్మం జిల్లా కార్యదర్శి కోలేటి నాగేశ్వరరావు తోపాటు పున్నం వెంకటేశ్వరరావు తాటి వెంకటేశ్వర్లు వై ప్రకాష్ తదితరులు ప్రసంగించినారు ఈ కార్యక్రమంలో ఐక్య రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కమ్మ కోమటి నాగేశ్వరరావు గూగుల్ తేజ నాయక్ సహాయ కార్యదర్శి పాశం అప్పారావు కుర్ర వెంకన్న జిల్లా కోశాధికారి కేలోతు లక్ష్మణ్ పులకని సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు

# ఆహార నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి

**టళ్లు, హాస్టళ్లు, విద్యాసంస్థల్లో తనిఖీలు ముమ్మరం చేయాలి**

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు**

**జిల్లాలో గ్యాస్ సిలిండర్ల కొరత లేదు.. ప్రజలు ఆందోళన చెందవద్దు**

**జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



వనపర్తి, విజన్ ఆంధ్ర ప్రతినిధి జిల్లాలోని హోటళ్లు, రెస్టారెంట్లు, సూపర్ మార్కెట్ లతో పాటు అన్ని విద్యాలయాలు, సంక్షేమ హాస్టళ్లలో ఆహార నాణ్యత పై నిరంతర పర్యవేక్షణ ఉంచాలని, తరచుగా ఆహార నమునాలను సేకరించి నాణ్యత ప్రమాణాలు పరిశీలించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ కరుణాకర్ ను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి హాల్లో జిల్లాలో ఆహార పదార్థాల నాణ్యత, సిలిండర్ల సరఫరా పై అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. రానున్న వర్షాకాలం సీజన్లో విద్యార్థులు, ప్రజలు రోగాల బారిన పడకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, జిల్లాలోని అన్ని సంక్షేమ వసతి గృహాలు, కేజీబీవీలు, పాఠశాలల్లో ఆహార నిల్వలు, వండిన ఆహార పదార్థాలు నమూనాలను ఎప్పటికప్పుడు సేకరించి ల్యాబ్ కు పంపించి నాణ్యత పరీక్షలు నిర్వహించాలని ఫుడ్ సేఫ్టీ అధికారిని ఆదేశించారు. జిల్లాలోని అన్ని హోటళ్లు, రెస్టారెంట్ లు, అంగన్వాడీ కేంద్రాల్లో ఆహార పదార్థాల నమూనాలు తరచుగా సేకరించి నాణ్యత ప్రమాణాలు పరిశీలించాలని సూచించారు. ఆహార పదార్థాలు సిద్ధం చేసే అన్ని అంగన్వాడీ కేంద్రాలు, సంక్షేమ హాస్టళ్లు, హోటళ్లు, రెస్టారెంట్ లు ఖీూజూూ× లో ఆన్లైన్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. దీనికొరకు ఖీూజుూ వెబ్సైట్ కి లాగిన్ అయి ఆన్లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు అన్నారు. సిలిండర్ గ్యాస్ ల పై సమీక్ష నిర్వహిస్తూ పశ్చిమాసియాలో జరుగుచున్న యుద్ధాల వల్ల క్రూడ్ ఆయిల్, గ్యాస్ సరఫరాలో ఇబ్బందులు ఉన్నప్పటికి ప్రభుత్వ ముందస్తు చొరవ వల్ల గృహావసరాలకు వాడే సిలిండర్ గ్యాస్ సరఫరాలో ఎలాంటి సమస్య లేదని, కేవలం వాణిజ్య సిలిండర్ల సరఫరాలో కొంత కోత ఉన్నట్లు తెలిపారు. గృహావసరాలకు ఒకసారి సిలిండర్ తీసుకున్నాక పట్టణ ప్రాంతంలో అయితే 25 రోజులు, గ్రామీణ ప్రాంతంలో అయితే 45 రోజుల తర్వాత తిరిగి బుక్ చేసుకోవచ్చని, ప్రజలు అనవసర ఆందోళనతో ఒక్కసారిగా అవసరం లేకున్న బుక్ చేసుకుంటూ ఇబ్బందులు పడవద్దని తెలియజేశారు. అన్ని విద్యాలయాలు, హాస్టళ్లు, కేజీబీవీలు, ఆసుపత్రులకు గ్యాస్ సిలిండర్ సమస్యలు లేకుండా సరఫరా చేయడం జరుగుతుందని తెలియజేశారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఎన్ ఖీమ్యా నాయక్, జడ్పీ సి ఈ ఓ యాదయ్య, జిల్లా సివిల్ సప్లై అధికారి కాశి విశ్వనాథ్, ఆర్డీఓ సుబ్రమణ్యం, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ కరుణాకర్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల మార్చి 23 (విజన్ ఆంధ్ర)స్త్రీనిధి రుణాలను తీసుకున్న ప్రతి ఒక్కరూ ఉపాధి అవకాశాలతో ఆర్థికంగా ఎదిగి రుణాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పిలుపునిచ్చారు.స్త్రీనిధి రుణాలు రూ.3 లక్షల చొప్పున పొంది ఎలక్ట్రికల్ ఆటోలను కొనుగోలు చేసిన లబ్ధిదారులు సోమవారం కలెక్టరేట్ ఆవరణలో వాటిని జిల్లా కలెక్టర్ సమక్షంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లిస్తూ ప్రభుత్వానికి సహకరించాలన్నారు. ఆటోలను కొనుగోలు చేసిన ఉండవెల్లి మండలం, చిన్న ఆముదాలపాడు గ్రామానికి చెందిన సులోచన, చిలుకమ్మను ఈ సందర్భంగా కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏపిడి శ్రీనివాస్, డిపిఎం సలోమి, ఏపిఎం శోభారాణి, తదితరులు పాల్గొన్నారు



# ప్రజావాణి ఫిర్యాదులపై అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గద్వాల మార్చి 23 (విజన్ ఆంధ్ర)ప్రజావాణికి ప్రతి వారం పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయని పరిష్కరించకుండా అలసత్వం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ హెచ్చరించారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా ఐడిఓసీ సమావేశపు మందిరంలో అదనపు కలెక్టర్లు, ఆర్డీవో తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వివిధ శాఖలకు సంబంధించి ప్రజల నుంచి మొత్తం 56 అర్జీలు వచ్చాయన్నారు.ప్రజావాణి అనంతరం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించకుండా పెండింగ్ లో ఎందుకు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టరేట్లో జరిగిన ప్రజావాణికి సంబంధించి 435 దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉందన్నారు. దరఖాస్తుదారులు అవసరమైన సందర్భాల్లో తమ అర్జీలకు సంబంధించిన రికార్డులు, ఇతర పత్రాలు తీసుకురాకుండా వస్తే ఆ సమస్యకు పరిష్కారం లభించదని పేర్కొన్నారు. ఆయా మండలాల్లోనూ వివిధ శాఖలకు సంబంధించి పెద్ద సంఖ్యలో దరఖాస్తులు అపరిష్కృతంగా ఉన్నాయని, ముఖ్యంగా రెవిన్యూ శాఖలో భూ సంబంధ సమస్యలపై వచ్చిన వందలాది అర్జీలను పరిష్కరించాల్సి ఉందన్నారు. ప్రతి బుధవారం ఆయా శాఖల జిల్లా అధికారులు తమ కింది స్థాయి అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి పెండింగ్ లో ఉన్న అర్జీలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. మండల స్థాయి అధికారులు సైతం తమ పరిధిలో ప్రజావాణి కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించి వచ్చిన అర్జీలను పరిష్కరిస్తే చిన్న చిన్న సమస్యలకే ప్రజలు కలెక్టరేట్ వరకు రావాల్సిన అవసరం ఉండదన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలని, పెండింగ్ ఫైల్స్ క్లియరెన్స్ పై స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ చాలా శాఖల అధికారులు పూర్తిస్థాయిలో అమలు చేయలేదని, వారంలోగా షెడ్యూల్ ప్రకారం పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయా కార్యాలయాల గదుల్లో అనవసరమైన ఫర్నిచర్, ఫైల్స్ కనిపిస్తే సంబంధిత అధికారులపై వేటు తప్పదన్నారు. ప్రభుత్వ అధికారులు సమయపాలన పాటించాలని, ప్రతి కార్యాలయం వద్ద బయోమెట్రిక్ యంత్రాల ద్వారా హాజరు నమోదు చేయాలన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా పలు రంగాల్లో వెనుకబడిందని, జిల్లా పరిపాలన యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేస్తేనే మన జిల్లా ఆయా రంగాల్లో రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల విద్యాలయాలు, వసతి గృహాలు, ఆసుపత్రులను తమ పరిధిలోని మండలాల ప్రత్యేక అధికారులు, తహసిల్దార్లు, ఎంపీడీవోలు తరచు సందర్శిస్తూ అక్కడి పనితీరు మెరుగుపడేందుకు సహకరించాలన్నారు. ఈ అధికారులు ప్రతి శుక్రవారం విద్యార్థులతోపాటు గురుకుల విద్యాలయాల్లో భోజనం చేయాలని, పంచాయతీ కార్యదర్శులు తమ పరిధిలోని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం చేయాలని ఆదేశించారు. ప్రతి బుధవారం 11:00 గంటలకు పంచాయతీ కార్యదర్శులు వారి గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాలను సందర్శించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కోర్టుల ద్వారానే భూవివాదాలు పరిష్కరించుకోవాలి

**జిల్లా ఎస్పీ సునిత రెడ్డి**

**న్యాయం, పారదర్శకత లక్ష్యంగా 'ప్రజావాణి' నిర్వహణ**

**సోమవారం కార్యక్రమానికి పోటెత్తిన బాధితులు.. 12 ఫిర్యాదుల స్వీకరణ**

**బాధితులతో ముఖాముఖి మాట్లాడి సమస్యల అడిగి తెలుసుకున్న ఎస్పీ**



వనపర్తి, విజన్ ఆంధ్ర ప్రతినిధి : వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుండి 12 మంది పిర్యాదుదారులు వివిధ సమస్యలపై నేరుగా జిల్లా ఎస్పీ సునిత రెడ్డికి ఫిర్యాదులు అందించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదును చట్టబద్ధంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యంగా భూ సంబంధిత వివాదాలు సివిల్ స్వభావం కలిగినవిగా ఉండడంతో, వాటిని కోర్టుల ద్వారా పరిష్కరించుకోవడం ఉత్తమమని సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ.. ప్రజలు తమ సమస్యలను చట్టబద్ధ మార్గాల్లో పరిష్కరించుకోవడం చాలా ముఖ్యం భూవివాదాలు వంటి అంశాలు పోలీసు పరిధికి మించినవి. అలాంటి సమస్యల కోసం కోర్టును ఆశ్రయించడం ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుంది. పోలీసుశాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అండగా ఉంటుంది. ఎవరైనా మోసపూరిత చర్యలకు గురైతే వెంటనే పోలీసులను సంప్రదించాలి. ప్రజల భద్రత, న్యాయం మా ప్రధాన కర్తవ్యమని ప్రజల సమస్యల పరిష్కారంలో పారదర్శకత, వేగం, న్యాయం లక్ష్యంగా పోలీసుశాఖ ప్రజావాణి కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.

# స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలి

## పోలీస్ కమిషనర్ సాయి చైతన్య



నిజాంబాద్ మార్చి 23:( విజన్ ఆంధ్ర ) మన దేశ స్వాతంత్రం కోసం పోరాడి తమ ప్రాణాలను సైతం నవ్వుతూ వదులుకున్న ఎందరో మహనీయుల త్యాగాలను భారతీయులందరూ ప్రతినిత్యము స్మరించుకోవాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఐపీఎస్ అన్నారు. మార్చ్ 23 నవ యువకులైన దేశభక్తులు భగత్ సింగ్ రాజ్ గురు సుఖదేవ్ ల ప్రాణత్యాగానికి గుర్తుగా సమర్పణ దివస్ కార్యక్రమాన్ని కేంద్ర యువజన క్రీడా మంత్రిత్వ శాఖ మేరా యువ భారత్ ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం పాలిటెక్నిక్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ కులాలు, మతాలు ప్రాంతాలు వేరువేరుగా ఉన్నప్పటికీ భారతీయులందరూ ఒకే తల్లి బిడ్డల్లాగా కలిసి ఉండటమే మన స్వతంత్ర సమరయోధుల యొక్క జీవిత ఆశయమని గుర్తు చేశారు, ప్రాణ త్యాగానికి మించిన గొప్ప త్యాగం ఇంకేది ఉండదని అలాంటిది వేలాదిమంది స్వాతంత్ర సమరయోధులు తమ ప్రాణాలను ఈ దేశం కోసం వదిలిపెట్టారని ఆయన తెలిపారు. నవ యువకులుగా ఉన్న అతిపిన్న వయసు గల యువకులు భగత్ సింగ్ మరియు అతని స్నేహితులు రాజ్ గురు, సుఖదేవ్ ఒరేయ్ కొయ్యలను సైతం నవ్వుతూ ముద్దాడి మెడలో వేసుకున్నారని తమ చివరి కోరిక ఏమిటి అంటే భారతమాతకు జై అని కలిసి నినదించాలని అన్నట్టుగా మనకు చరిత్ర పుస్తకాలు చెబుతున్నారన్నారు. ఇటువంటి మహనీయుల స్ఫూర్తిగాతలను మనందరం తప్పకుండా చదవాలని దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసిన మహనీయులను స్మరించుకోవాలని ఆయన సూచించారు. జిల్లా యువజన అధికారిని శైలి బెల్లాల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం యువత కోసం ఎన్నో విశేషమైన కార్యక్రమాలను రూపొందిస్తున్నదని అందులో భాగంగానే జాతీయ స్థాయిలో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నదని అందులో యువతీ యువకులందరూ ఉత్సాహంగా పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అనురాధ, కళాశాల సిబ్బంది మరియు యువతి యువకులు పాల్గొన్నారు.

# బాసర ట్రిపుల్ ఐటీలో తాజా పరిస్థితిపై మంత్రి జూపల్లి సమీక్ష



నిర్మల్ జిల్లా, మార్చి 23,(విజన్ ఆంధ్రా);: బాసర ట్రిపుల్ ఐటీ(ఆర్జీయూకేటీ)లో నెలకొన్న పరిస్థితులు, విద్యార్థుల నిరసనలు, తదనంతరం సెలవులు ప్రకటించడం, తదితర అంశాలపై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం హైదరాబాద్లో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. క్యాంపస్లో ప్రస్తుత స్థితిగతులను, విద్యార్థుల ఆందోళనల వెనుక ఉన్న కారణాలను బాసర ట్రిపుల్ ఐటీ వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్, ఓఎస్డీ మురళీ దర్శన్ మంత్రికి వివరించారు.క్యాంపస్లో విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో శాంతిభద్రతల దృష్ట్యా, ముందస్తు జాగ్రత్తగా సెలవులు ప్రకటించాల్సి వచ్చిందని వీసీ గోవర్ధన్ మంత్రికి తెలిపారు. విద్యార్థుల ప్రధాన డిమాండ్లు, సెలవుల ప్రకటనకు దారితీసిన పరిణామాలను ఈ సందర్భంగా మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. విద్యార్థులు ఎంతో ప్రతిభావంతులని, కేవలం ఆవేశంతో ఆందోళనలు చేస్తూ తమ ఉజ్వల భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని హితవు పలికారు. సమస్యలు ఏవైనా ఉంటే చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని, విద్యార్థుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. క్యాంపస్లో మౌలిక వసతులు, విద్యా ప్రమాణాల మెరుగుదల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఆయన అధికారులకు తేల్చి చెప్పారు. త్వరలోనే క్యాంపస్లో సాధారణ పరిస్థితులు నెలకొనేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు భరోసా కల్పించాలని వీసీని మంత్రి ఆదేశించారు. అసెంబ్లీ సమావేశాల తర్వాత ట్రిపుల్ ఐటిని సందర్శించి, విద్యార్థులతో చర్చిస్తానని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు.

# విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కొరకై అనుక్షణం అతని (కె పీ) ఆరాటం

**నవోదయ లో సీట్లు సాధించిన సాయి ఎక్సలెంట్ పాఠశాల ఆణిముత్యాలు ఎస్. నిసి షారోన్ , బీ విష్ణు.**

## హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు .



జూలూరుపాడు మార్చి 23 (విజన్ ఆంధ్ర) గ్రామీణ ప్రాంత విద్యార్థులు పట్టుదలతో కృషి చేస్తే జాతీయ స్థాయిలో అద్భుతాలు సాధించవచ్చని జూలూరుపాడు మండల కేంద్రంలోని సాయి ఎక్సలెంట్ పాఠశాల విద్యార్థులు నిరూపించారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే అత్యంత ప్రతిష్టాత్మకమైన జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్షల్లో 2026 - 2027 విద్యా సంవత్సరానికి గాను సాయి ఎక్సలెంట్ పాఠశాలకు చెందిన ఎా. నిస్సీ షారోన్, దీ. విష్ణు లు ఉత్తమ ప్రతిభ కనబరిచి 6వ తరగతి ప్రవేశానికి ఎంపికయ్యారు. విద్యార్థులు సీటు సాధించడానికి సాయి ఎక్సలెంట్ పాఠశాల ఉపాధ్యాయుల కృషి చాలా గొప్పదని చెప్పొచ్చు. గ్రామీణ ప్రాంతంలో కూడా విద్యార్థులను ప్రతిభవంతులను చేసి ఆణిముత్యాలను వెలికి తీయడంలో సాయి ఎక్సలెంట్ పాఠశాలకే సాధ్యమనడంలో సందేహం ఏమీ లేదని నిరూపించుకున్నారు. విద్యార్థులు నవోదయలో సీటు సాధించడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ ఆరెబోయిన కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ గత 10 సంవత్సరాలుగా ప్రతి విద్యా సంవత్సరంలో కూడా నవోదయ, ఏకలవ్య, మోడల్ స్కూల్, గురుకులాలలో సీట్లు సాధించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి పట్ల ప్రత్యేక శ్రద్ధ , అర్హత అనుభవం కలిగిన ఉపాధ్యాయులచే విద్య బోధన అందించడం జరుగుతుందన్నారు. పల్లె పల్లెకు పట్టణ స్థాయి విద్యను అందించాలనే ఉద్దేశంతోనే ఈ ఏడాది విద్యా సంవత్సరం నుంచి పాఠశాలలో డిజిటల్ క్లాసెస్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జూలూరుపాడు, చండ్రు గొండ, సుజాతనగర్ మండలాల ప్రజలు తమ పిల్లల ఉజ్వల భవిష్యత్తు కొరకై ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

# రైతు భరోసా నిధుల విడుదల నర్మెట్టలో అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం

సిద్దిపేట జిల్లా ప్రతినిధి ,విజన్ఆంధ్ర ,మార్చి 23: నర్మెట్టలో నిర్వహించిన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి రాష్ట్ర రైతాంగానికి పెట్టుబడి సాయం "రైతు భరోసా" నిధులను విడుదల చేశారు. ఈ సందర్భంగా బటన్ నొక్కి నిధులను విడుదల చేస్తూ రేపటి నుంచే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని,వచ్చే 45 రోజుల్లోగా మొత్తం 9 వేల కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో చేరుతాయని తెలిపారు. ఈకార్యక్రమంలో భాగంగా కేవలం 17 నెలల్లో నిర్మించిన ఆయిల్ పామ్ కర్మాగారాన్ని ప్రారంభించి రైతులకుఅంకితమిచ్చారు. అదేవిధంగా జిల్లాలో రూ.775 కోట్ల విలువ చేసే వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు మరికొన్ని కొత్త పనులకు శంకుస్థాపనచేశారు. ప్రజాపాలన-రైతు ఉత్సవాల్లో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు,దామోదర రాజనర్సింహ,పొన్నం ప్రభాకర్,పొంగులేటి శ్రీనివాస రెడ్డి,వివేక్ వెంకటస్వామి,ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి,ఎంపీలు వేం నరేందర్ రెడ్డి,రఘునందన్ రావు తదితర ప్రజాప్రతినిధులు మరియుఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ వ్యవసాయం లాభసాటిగా మారాలంటే పంటల మార్పిడి విధానం అవసరమనితెలిపారు. రైతుల్లోచైతన్యంతీసుకురావాలని,పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్లో ఎగుమతులకు ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందని పేర్కొన్నారు. పశ్చిమ ఆసియా దేశాల్లో జరుగుతున్న యుద్ధ పరిస్థితుల కారణంగా రాబోయే రోజుల్లో యూరియా,గ్యాస్ కొరత తలెత్తే అవకాశం ఉందని పేర్కొంటూ సంబంధిత యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. తెలంగాణలోని రామగుండం యూరియా రాష్ట్రానికే కేటాయించాలని కేంద్రాన్ని కోరుతామని తెలిపారు. అలాగే నానో యూరియా వినియోగాన్ని పెంచాలనిసూచించారు. రాష్ట్రంలో ప్రాంతాల వారిగా వేర్వేరు పంటలు పండుతున్నాయని,సారవంతమైన భూములు ఉన్నాయని,వ్యవసాయ సాంకేతిక నైపుణ్యాన్ని రైతులకు అందుబాటులోకి తేవాలనిపేర్కొన్నారు. రైతులకు మరింత లాభం వచ్చే విధంగా వ్యవసాయ రంగంలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఏడాది రాష్ట్రంలో భారీ స్థాయిలో వడ్ల కొనుగోలు జరిగిందని,సన్నబియ్యం పంపిణీతో పాటు అంతర్జాతీయ మార్కెట్కు ఎగుమతులు చేసినప్పటికీ నిల్వలుమిగిలిఉన్నాయనితెలిపారు. చిన్న రాష్ట్రమైనప్పటికీ ఆహార ధాన్యాల ఉత్పత్తిలో రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచిందనిపేర్కొన్నారు. ఆయిల్ పామ్ సాగును ప్రస్తుతం 3 లక్షల ఎకరాల నుంచి 10 లక్షల ఎకరాలకు విస్తరించినా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు. ఆయిల్ పామ్ వంటి పరిశ్రమలు ఏర్పడితే వ్యవసాయం లాభసాటిగా మారి రైతుల జీవన ప్రమాణాలుమెరుగుపడతాయనితెలిపారు. నిజామాబాద్ జిల్లా అంకాపూర్ గ్రామాన్ని రాష్ట్రంలోని గ్రామపంచాయతీలు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. లాభసాటి పంటల సాగుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. నర్మెట్టలో ఏర్పాటు చేసినట్లుగానే కొడంగల్ నియోజకవర్గంలో కూడా పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని సంబంధిత మంత్రులకుసూచించారు. గత ప్రభుత్వంతో పోలిస్తే ప్రస్తుత ప్రభుత్వం రైతు సంక్షేమంపై అధికంగా ఖర్చు చేస్తోందని పేర్కొంటూ ఉచిత కరెంట్,గిట్టుబాటు ధరలు,సన్నవడ్లకు బోనస్,రుణమాఫీ,రైతు భరోసా,బీమా,పంట నష్టపరిహారం వంటి పథకాల ద్వారా రూ.1.30 లక్షల కోట్లను ఖర్చు చేసినట్లు తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాల్లో రాజకీయ పార్టీల మధ్య సమన్వయం అవసరమని,ప్రభుత్వం ఏ నియోజకవర్గాల పట్ల వివక్ష చూపదని స్పష్టం చేశారు. నర్మెట్టలో జరిగిన ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా 1600 రైతు వేదికల ద్వారా రైతులు వీక్షించారు.

## ప్రజాకవి లెనిన్ శ్రీనివాస్ కు స్వర్ణనంది ఉగాది పురస్కారం





ఖమ్మం, మార్చ్ 23 విజన్ ఆంధ్ర)ఈరోజు ఖమ్మం లో రామగిరి పంక్షన్ హాల్ నందు మొగిలి మరియు నాగసాయి ఏంటర్ టైన్ మెంట్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది స్వర్ణనంది అవార్ధుల ప్రధానోత్సవం లో వికాస వేదిక సాహిత్య సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రజాకవి లెనిన్ శ్రీనివాస్ సాహిత్య రంగంలో చేస్తున్న విశిష్ట సేవలకు గాను గుర్తింపుగా మొగిలి గుణకర్, నాగసాయి లు సాహిత్య, వ్యాపార, కళారంగ, సినిమా ప్రముఖుల చేతుల మీదుగా సత్కరించిన వారిలో మంత్రిప్రగధ శ్రీనివాస రావు, నామవరపు కాంతే శ్వర్ రావు, కర్తనందం, కర్నాటి శంకార్ రావు, పొనుగోటి ప్రసాద రావు, తులసి దాసు లు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మొగిలి మాట్లాడుతూ సాహిత్యం ఖమ్మం కేంద్రం గా అనేక మంది వర్ధమాన కవులను ప్రోత్సాహిస్తూ మంచి పుస్తకాలు ప్రచురిస్తూ ఎంతో మంది ప్రముఖులను ఆహ్వానించడం ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఎన్నో సత్కారాలు పురస్కారాలు ప్రశంసలు పొందిన లెనిన్ శ్రీనివాస్ ను సత్కరించుకోవడం ఆనందం గా ఉందన్నారు.

## రన్ ఫర్ జీసస్ పోస్టర్ ఆవిష్కరణ

కల్లూరు,మార్చి 23 (విజన్ ఆంధ్ర)మండల ఐక్య క్రైస్తవ సమైక్య, అసోసియేషన్ ఆఫ్ ఇండిపెండెంట్ క్రిస్టియన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రన్ ఫర్ జీసస్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఎఐసిసి రాష్ట్ర అధ్యక్షులు రెవరెండ్ ఏనోష్ కుమార్ సోమవారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం కల్లూరులోని టిజిఎం వర్షిప్ సెంటర్‌లో మండల అధ్యక్షులు తేళ్ల ఎబినేజర్ అధ్యక్షతన జరిగింది,ఈ సందర్భంగా సత్తుపల్లి నియోజకవర్గానికి చెందిన క్రైస్తవ నాయకులు సమావేశమై రన్ ఫర్ జీసస్ కార్యక్రమం విజయవంతానికి చర్చలు జరిపారు. ముఖ్య అతిథిగా హాజరైన రెవరెండ్ ఏనోష్ కుమార్ మాట్లాడుతూఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం యేసుక్రీస్తు సిలువ వేయబడిన త్యాగం,మరణం మరియు పునరుత్థానం సందేశాన్ని ప్రజల్లో విస్తృతంగా చాటడం అని తెలిపారు.సమాజంలో ప్రేమ, శాంతి,సేవా భావం పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు ముఖ్యపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.ఏప్రిల్ 4వ తేదీన నిర్వహించనున్న ఈ ర్యాలీ కల్లూరు ఎన్ఎస్పి క్రాస్ రోడ్ నుండి నూతన బస్టాండ్ వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ ర్యాలీలో క్రైస్తవులు మాత్రమే కాకుండా అన్ని మతాల ప్రజలు పాల్గొని ఐక్యతను చాటాలని ఆయన పిలుపునిచ్చారు. విశ్వాసం, సోదరభావం, సమైక్యతకు ప్రతీకగా ఈ కార్యక్రమం నిలవాలని ఆకాంక్షించారు.ఈ సమావేశంలో దాసరి డేవిడ్ రాజు, పి.డి దాసు, కెనడి రాజు, టి. సంజీవరావు, తేళ్ల ఎబినేజర్, కోట దేవదానం, మోదుగు ఓనేసిమ్, దయాకర్, వైస్ ప్రెసిడెంట్ సుందర్ రాజు, జాన్ పరంజ్యోతి, రాయల తిమోతి, జీవన్ కుమార్, కట్టా మహేష్, దైవ సేవకులు పాల్గొన్నారు .

## తులసి దాసు కు స్వర్ణనంది పురస్కారం



ఖమ్మం, మార్చ్ 23 ఖమ్మం లోని బైపాసు రోడ్డు రామగిరి పంక్షన్ హాల్ నందు ఖమ్మం నగరానికి చెందిన ఆధ్యాత్మిక వాది, కవి తులసిదాస్ ను స్వర్ణనంది పురస్కారం తో మొగిలి మరియు నాగసాయి ఏంటర్ టైన్మెంట్ సంస్థ ప్రముఖుల చేతులతో ఘనంగా సత్కరిస్తూ వారు సాహిత్యం తోపాటు అనేక గ్రశీదాలను ఉచితంగా పంచడం, సమాజాన్ని సన్మార్గంలో నడిపించే అనేక కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించడం ఆయన ప్రత్యేకత గాకొనియాడినారుపాలకుర్తి కృష్ణ, మొగిలి గుణకర్, లెనిన్ శ్రీనివాస్, కర్నాటి శంకర్ రావు, పొనుగోటి ప్రసాదరావు, ఇంకా మరికొంత మంది ప్రముఖుల చే సత్కరించారు.ఈ సందర్భంగా సాహితీ వేత్తలు, ఆధ్యాత్మిక వేత్తలు ఆయనకు అభినందనలు తెలిపారు.

## ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన అదనపు కలెక్టర్ శ్రీజ



ఖమ్మం, మార్చి -23 (విజన్ ఆంధ్ర)ప్రజా వినతులను సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ జిల్లా అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రజల అర్జీలను స్వీకరించారు.సత్తుపల్లి మండలం కాకర్లపల్లి గ్రామానికి చెందిన నడ్డి చందు తనకు లంగ్ క్యాన్సర్ వచ్చిందని, వైద్య చికిత్స నిమిత్తం సిఎంఆర్ఎఫ్ నుంచి నిధులు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, డిఎంహెచ్ఓ కు రాస్తూ తగుచర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు.కామేపల్లి మండలం సాతానిగూడెం గ్రామానికి చెందిన డి. చిన్న వెంకయ్య సర్వే నెంబర్ 175/ఘ లో వారసత్వ భూమి 17 ఎకరాల 30 గుంటల భూమి ఉందని, అందులో 7 ఎకరాల 3 గుంటల భూమి కొందరు ఆక్రమించుకున్నారని, దీనిని విచారించి, వారసత్వ హక్కులను పరిశీలించి తమ భూమిని ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తగుచర్యలు తీసుకోవాలని కామేపల్లి తహసీల్దార్ ను ఆదేశించారు.
తిరుమలాయపాలెం మండలం గోపయిగూడెం గ్రామానికి చెందిన షేక్ పెంటు సాహెబ్ తనకు వికలాంగుల ఫించన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పీడీ డీఆర్డిఓ కు రాస్తూ తగుచర్యలు తీసుకోవాలని అన్నారు.

# రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్టా గ్రామంలో 300 కోట్ల రూపాయలతో నిర్మించిన టిజీ ఆయిల్ ఫెడ్ వారి ఆయిల్ఫామ్ప్రారంభోత్సవం

సిద్దిపేట జిల్లా ప్రతినిధి మార్చ్ 23 సిద్దిపేట జిల్లా కేంద్రంలో గల ఆయిల్ ఫామ్ కర్మాగారాన్ని ప్రారంభించి, ప్రజపాలనలో రైతు ఉత్సవాల్లో భాగంగా వ్యవసాయ మరియు వ్యవసాయ అనుబందరంగాలు, వ్యవసాయ యంత్రికికరణ పై ఏర్పాటు చేసిన 150 స్టాళ్లను సందర్చించి, నూతనంగా 50 కోట్ల రూపాయలతో అయిల్ ఫామ్ రిఫైనరి నిర్మానానికి శంకుస్థాపన చేశారు. అనంతరం సభా వేదిక సమీపంలోసిద్దిపేటనియోజకవర్గంలోని సిద్దిపేటమున్సిపాలిటీలో 141.34 కోట్ల రూపాయలతో ఖ×ణఖీ అధ్వర్యంలో నీటి సరఫరా ప్రాజెక్టులు & భూగర్భ డ్రైనేజీ ప్రాజెక్టులకు శంకుస్థాపన, సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సన్ పల్లి గ్రామంలో 78 కోట్ల రూపాయలతో నూతనంగా నిర్మించిన జిల్లా జైలు భవనాన్ని, సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్పల్లి గ్రామంలో 15 కోట్ల రూపాయలతో నూతనంగా నిర్మించిన 50 పడకల సమీకృత ఆయుష్ ఆసుపత్రిని, 3.60 కోట్ల రూపాయలతో ఎన్సాన్ పల్లి లో నూతనంగా ఏర్పాటు చేసిన సెంట్రల్ మెడిసిన్ స్టోర్ ను, నంగునూరు మండలం గట్ల మల్యాల లో 1.43 కోట్ల రూపాయల తో నూతనంగా నిర్మించిన పిహెచ్సి భవనాన్ని, సిద్దిపేట పట్టణంలోనీ ఎన్జీవోస్ కాలని లో 1.43 కోట్ల రూపాయలతో నూతనంగా నిర్మించిన యూపీహెచ్సీ భవనాన్ని ప్రారంభించారు.గజ్వేల్ నియోజకవర్గంలోని కొండపాక మండల కేంద్రంలో 200 కోట్ల రూపాయలతో ఏర్పాటు చేస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కి శంకుస్థాపన చేశారు. మర్కుక్ మండల కేంద్రంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ లో 16.62 కోట్ల రూపాయలతో మౌలిక సదుపాయాలు అదనపు భవనాలకు శంకుస్థాపన చేశారు. జగదేవ్ పూర్ మండల కేంద్రంలో 9.65 కోట్ల తో నిర్మించిన సమీకృత మండల కార్యాలయాల సముదాయం (ఐవోసీ) ని ప్రారంభించఅనంతరం సభా వేదికపై రైతుల ఖాతాలో రైతు భరోస నిధులు విడుదఈ సందర్బంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా, సిద్దిపేట లో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరి ప్రాంభించడంతో పాటు రైతు భరోసా దాదాపు 3600 కోట్ల రూపాయలు 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందని తెలిపారు. వ్యవసాయ పండుగ దినాన ఉగాది పండుగ సందర్భంగా ఆడబిడ్డలకు ఇచ్చిన చీర సారె లతో వచ్చిన ఆడబిడ్డలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎద్దేడ్చిన ఎవుసం రైతేడ్చిన రాజ్యం సుభిక్షంగా ఉండదని, ప్రజాపాలన ఎన్ని ఇబ్బందులు ఎదురైనా రైతులకు అందించాల్సిన ఉచిత విద్యుత్, పంట చివరి గింజ వరకూ గిట్టుబాటు ధరతో కొనుగోలు చేయడమే కాకుండా , బోనస్ కూడా ఇచ్చి రైతుల కళ్ళల్లో ఆనందం నింపాలని ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్ఇదే వేదిక నుండి దాదాపుగా 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో 3600 కోట్ల రైతు బరోసా నిధులు విడుదల చేసానని, రేపటి నుండే అవి రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి అని తెలిపారు. ఆర్ధిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, మిగిలిన 5400 కోట్లు 80 రోజుల్లో, మరో 2700 కోట్లు అ తరువాత 20 రోజుల్లో 2700 దాదాపుగా 45 రోజుల్లో 9000 కోట్ల 70 లక్షల ఖాతాల్లో వేసి రైతుల కళ్ళల్లో ఆనందం నింపుతామని స్పష్టం చప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 28 నెలలలో ప్రతి నెల 5500 కోట్ల రూపాయలు రైతుల సంక్షేమం కోసం ఖర్చు చేస్తున్నామని. 24 గంటల ఉచిత కరెంటు, బోనస్, రైతు బరోసా, రైతుభీమా లాంటి పథకాలకు కేటాయించామని, అకాల వర్షాలతో ఇసుకమేటలతో , వడగండ్ల వానలతో నష్టపోయిన రైతులకు ప్రతి ఎకరాకు రూ 10 వేల రూపాయల చొప్పున ఇప్పటి వరకు లక్షా 30 నుండి లక్ష 40 వేల రూపాయల వరకు ఖర్చు చేశామని వెల్లడగత సంవత్సరం తెలంగాణలో 2 కోట్ల 58 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం పండించి దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో రాష్ట్రం నిలిచిందన్నారు. చైతన్యం కలిగిన నిజామాబాద్, మెదక్ జిల్లాల రైతులు నిజాం సర్కార్ ఉన్నపుడే నిజాం చక్కెర కర్మాగారాన్ని కట్టారని, కమర్షియల్ పంటలైన చెరుకు, సోయా, మొక్కజొన్న, పసుపు పంటలు పండించారని, ఆనాడు పసుపు అమ్మితే తులం బంగారం వచ్చేదని ఇప్పుడు ఆ పరిస్థితి లేదని అన్నారు. వ్యవసాయంలో మార్పులు రావాలని, పామ్ ఆయిల్ ఫ్యాక్టరీని దాదాపు 300 కోట్లతో ప్రారంభించుకున్నామని, ఈ నాడు ఆయిల్ ఫామ్ పంట 3 లక్షల ఎకరాలకు చేరిందని, భవిష్యత్తులో 10 ఎకరాల్లో పంట సాగు చేసిన ప్రభుత్వం గిట్టుబాటు ధరతో కొంటుందని హామీ ఇచ్చవ్యవసాయం, పాడి పరిశ్రమ గణనీయంగా ఉండేదని, ఇప్పుడు కాలం మారిందని, ఇతర రాష్ట్రం, దేశాల నుండిఆహార ఉత్పత్తులు దిగుమతి చేసుకుంటున్నారని, అది సరి కాదని, కష్టం తక్కువగా ఉన్న వరిని పండిస్తే భారత దేశంతొ



పాటు ప్రపంచంలోని ఇతర దేశాలకు ఎగుమతి చేసిన ఇంకా మిగిలిపోయే పరిస్థితి ఉందని, ఇప్పటికే 71 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, ఇంకా ధాన్యం నిలువ ఉందని, రైతులు పంట మార్పిడి చేసుకోవాలని, మిల్లెట్స్ కూరగాయలు, ఆకు కూరలు, ఇతర పంటలు పండించాలని, ఆ దిశగా రైతులనుప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, ఇందుకు అవసరమైన పంట మార్పిడి ద్వారా లాభసాటి ధరలు అందేలా చర్యలు చేపట్టాలని మంత్రులు తుమ్మల నాగేశ్వర రావును కోరారు. సిద్దిపేటలో కట్టినట్లే కొడంగల్ నియోజక వర్గంలో కూడా ఆయిల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని మంత్రులు దామోదర, తుమ్మల కోరారు. రాష్ట్రంలోని 12,728 గ్రామపంచాయతీలు ఒక అంకాపూర్ లా వ్యవసాయంలో అభివృద్ధి చెంది ప్రతి రైతు ఇంటికి ఓ కార్ కొనుకున్నెల మార్చాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందని అన్నారు. దిగుమతి చేసుకునే అవసరం లేకుండా ఇక్కడే లాభసాటి ఆర్గానిక్ పంటలు పండించాలని. తెలంగాణలో సారవంతమైన భూమి ఉందని, వ్యవసాయంలో సాంకేతిక స్థాయిలో పని చేసి కష్ట పడాల్సిన అవసరం ఉందని. ప్రభుత్వాలు రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించి అవగాహన కల్పించాలని, పంట పండించడానికి అవకాశం ఇచ్చి, రైతులు పండించిన పంటలను అమ్మడానికి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం మాత్రమే కాకుండా, అంతర్జాతీయ స్థాయిలో ఎగుమతి చేసే అవకాశం కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుని బంగారు తెలంగాణ దిశగా ముందుకు సాగాలని అన్నారు మహిళలకే అన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత తెలంగాణ ప్రభుత్వానిదేనని, ప్రతి ఆడబిడ్డ ఉచితంగా ఆర్టీసీలో ప్రయాణం చేస్తున్నారని, ఇందుకు 9 వేల కోట్లు ఖర్చు చేశామని, ప్రతి నెల ఉచిత ప్రయాణం కోసం 350 కోట్ల రూపాయలు చెల్లిస్తున్నామని తెలిపారు, అదేవిధంగా 1000 బస్సులకు కొని ఆ బస్సులకు ఆర్టీసీకి స్వయం సహాయక సంఘా మహిళల ద్వారా అద్దెకు ఇవ్వడం ద్వారా యజమానులను చేశామని, సంఘా మహిళలకు పెట్రోల్ బంకులు ఇవ్వడం జరిగిందని, 67 లక్షల మంది స్వయం సహాయక సంఘాల మహిళలు ఉన్నారని, 2034 నాటికి కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేసేల సంఘం బాధ్యత తీసుకోవాలని తెలిపారు. పట్టణాలలో కూడా మహిళల సంఘాలను పెంచాలనిపిలుపునిచ్చారు. 57 వేల బ్యాంకు లింకేజీ ద్వారా 1350 కోట్లు ప్రభుత్వం కట్టిందని తెలిపారు. సోలార్ విద్యుత్ అంటే అదాని, అంబానీ లే ఉండేవారని, నేడు వారికి సమానంగా మా ఆడబిడ్డలు ఎదిగారని అన్నా శిల్పారామంలో పక్కన 106 స్టాల్స్ ఏర్పాటు చేసి ప్రపంచానికి ప్రదర్శించి అమ్మేలా ఇందిరా మహిళా శక్తి సెంటర్లుఆడబిడ్డలకు అందించాం. ఆడబిడ్డలు ఉత్పత్తి చేసిన వస్తువులకు అమెజాన్ లాంటిద్వారాఅంతర్జాతీయ స్టాయిలోఅమ్మకాలుజరుగుతున్నాయని. ఆడ బిడ్డలు ఆర్థికంగా, ఆత్మగౌరవంతో స్వయం శక్తితో నిలబడాలని, దేశ ఆర్ధిక వ్యవస్థ లో ఆడ బిడ్డల ఎదుగుదల అవసరమని తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలని, రాష్ట్రం 2034 నాటికి వన్ బిలియన్ డాలర్ ఎకనామిగా ఎదుగుతుందని, దేశ ఆర్థిక వ్యవస్థలో ఆడబిడ్డకు అర్ధ భాగం వచ్చినప్పుడే దేశ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని అందుకు సంపూర్ణ సహకారం అందిస్తామని అన్నారు. ఈ విద్యా సంవత్సరం నుండి నర్సరీని నుండి అన్ని ప్రభుత్వ స్కూళ్లలో ప్రతి రోజు ఒకరోజు పాలు మరో రోజు రాగి జావా, వారం రోజుల్లో మంచి ఆహారాన్ని అందిస్తామని, ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లను తీర్చిదిద్దుతామని తెలిపారు. ప్రైవేట్ స్కూళ్లలో కన్నా ప్రైవేట్ స్కూల్లోలలో ఎక్కువగా చదువుకున్న వారు ఉన్నారని, ఈ రోజు మంచి స్థానంలో ఉన్న వారు అందరూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న వారేనని గుర్తు చేశారు. రాష్ట్రంలోని దాదాపు 18 వేల పాఠశాలను ప్రక్షాళన చేస్తున్నామని, అందుకునే విద్యా శాఖ నా దగ్గరే ఉందని అన్నారు. సాంకేతిక నైపుణ్యం పెంచుకోవాలని, గతకాలానికి భిన్నంగా కులాలకు అతీతంగా వృత్తి పనులు చేస్తున్నారని, అందుకు శిక్షణ అవసరమని, ఏ టీ సి లో చదువుకునే ప్రతి విద్యార్థికి 2000 స్కాలర్షిప్ ఇస్తామని, ట్యాలెంట్ ఉంటే ఏదైనా సాధించగలమని, సాంకేతిక నైపుణ్యం ఉన్న విద్యపై దృష్టి పెట్టాలని, ఇవే మన భవిష్యత్తు మారుస్తాయని అన్నారు. ఇజ్రాయల్ ఇరాన్ యుద్ధం జరుగుతుంది, యుద్ధం కొనసాగితే యూరియా కొరత ఏర్పడే అవకాశం ఉందని ఇబ్బంది లేకుండా రామగుండం ఫ్యాక్టరి ద్వారా, కేంద్ర ప్రభుత్వం ద్వారా అధికంగా యూరియాతెపించుకోవాలని, అభివృద్ధి కోసం అంకితమై ప్రజలు, రైతుల 3500 చొప్పున ఇందిరమ్మ ఇండ్లు సిద్దిపేట , గజ్వేల్, సిరిసిల్ల నియోజక వర్గంలో మొత్తం 10500 మంజూరు చేశామని తెలిపారు. కొడంగల్ నియోజకవర్గంలో ఇంత పెద్ద మొత్తంలో అభివృద్ధి పనులు చేపట్టలేదని అన్నారు. 119 శాసన సభ నియోజక వర్గాలకు సమాన ప్రాతినిధ్యం ఇస్తెలిపావ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ, వ్యవసాయంలో రైతన్న, నేతన్నలకు ఎన్ని కష్టాలు వచ్చినా సమర్ధవంతంగా ఎదురుకుని, రైతాంగానికి మొదటి సంవత్సరంలోనే ఒకే సారి 21 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేసిన ఏకైక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని అన్నారు. రైతుభరోసా 9 వేల కోట్లు 9 రోజుల్లో జమ చేశారని, సన్నబియ్యం పండించిన రైతులకు బోనస్ ఇచ్చారని, రైతు ఏ పంటనుపండించుకోవాలన్న దానికి బోనస్ ఇచ్చే ఆలోచన ఉందని అన్నారు., 50 వేల కోట్లతో రిఫైందరీ కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 9రోజునే 9 వేల కోట్ల రైతు బరోసా కూడా మంజూరు చేశారని తెలిపారు. ఎన్ని పంటలు పండించిన ఏం ఎస్ పి ఇప్పించిన ప్రభుత్వం, ప్రపంచంలో యుద్ధ వాతావరణం ఉన్నప్పటికీ రాష్ట్రంలో ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తున్న ప్రభుత్వం. ఒక పంట కాలానికిఅవసరమైన దాదాపు 50 వేల కోట్ల మెట్రిక్ టన్నుల యూరియా తెప్పించారని అన్నారు. తెలంగాణను పామ్ ఆయిల్ పంట ను అధికంగా పండించిన రాష్ట్రంగా దేశంలో తెలంగాణ నిలిచిందని అన్నమంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, నర్మెట్ట ఆయిల్ పామ్ ఆయిల్ ప్రారంభించుకోవడంతో పాటు రిఫైందరీ శంకుస్థాపన కూడా చేశారని తెలిపారు. ఎలాంటి నష్టానైన సమర్ధవంతంగా తట్టుకోగల ఆయిల్ పామ్ పంటను సాగు చేయాలని సూచించారు. ఆయిల్ ఫామ్ పంటలో అంతర్ పంటలు కూడా సాగు చేసుకోవచ్చని తెలిపారు. రైతు రాజ్యం, రైతులకోసం పాటుపడే ప్రభుత్వం అని అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, తెలంగాణలో ప్రతి ఒక్కరికి అండదండగా ఉంటూ ప్రభుత్వం ముందుకు వెళ్తోందని అన్నారు. రైతును రాజును చేసేలా కృషి చేస్తున్న ప్రభుత్వం, భూభారతి ద్వారా అనేక సమస్యలకు పరిష్కారం చూపాం, సాదా బైనామలకు కూడా పరిష్కారం చూపిస్తాం అని, అర్హుడైన ప్రతి పేద వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారుజిల్లా ఇంచార్జ్ మంత్రి వివేక్ మాట్లాడుతూ, రైతుల పక్షాన 21 వేల కోట్లు ఖర్చు చేసి రుణమాఫీ చేశామని, 120 నియోజక వర్గాల్లో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేశామని తెలిపారు. సిద్దిపేట జిల్లాలో సమస్యల పరిష్కారానికి ప్రతేక చర్యలు తీసుకుంటామని ప్రజలకు విశ్వాసం కల్పించారని తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజా నరసింహ మాట్లాడుతూ, నాణ్యత తొ కూడిన విద్యను అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, పంట మార్పిడి తెలంగాణలో చాల అవసరమని, సుమారు 75 వేల పోస్టులు భర్తీ చేశామని, అందులో ఆరోగ్య శాఖ 10 వేల పోస్టులు, రానున్న రోజుల్లో మరో 10 వేల పోస్టులు మంజూరు చేస్తామని, సమస్యలు ఎన్ని ఉన్నా వాటిని సానుకూలంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ స్పీకర్, బాన్స్ వాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్ రావు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎంఎల్సిలు అంజిరెడ్డి, మల్క కొమురయ్య, అయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, జిల్లా కలెక్టర్ కే. హైమావతి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా 16 వందల రైతు వేదికల ద్వారా 4 లక్షల మంది రైతులు వీక్షించారు.

## ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు సాధించాలి: జిల్లా కలెక్టర్ అంకిత్




కొత్తగూడెం బ్యూరో మార్చి 24(విజన్ ఆంధ్ర)జిల్లా రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించి పంటల దిగుబడులను పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ పిలుపునిచ్చారు. సోమవారం రామవరం కృషి విజ్ఞాన కేంద్రంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో నిర్వహించిన కిసాన్ మేళా మరియు వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమాన్ని కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గాలికుంట వ్యాధి నివారణకు సంబంధించి నిర్వహిస్తున్న జాతీయ ఉచిత టీకాల కార్యక్రమంపై అవగాహన గోడపత్రికలను ఆవిష్కరించి, జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు.కిసాన్ మేళాలో వ్యవసాయం, కృషి విజ్ఞాన కేంద్రం, పశుసంవర్ధక రంగాలకు సంబంధించిన స్టాళ్లను సందర్శించిన కలెక్టర్, ఆధునిక వ్యవసాయ సాంకేతిక పద్ధతులు, నాణ్యమైన విత్తనాల వినియోగం, పంటల నిర్వహణ, యంత్రాల వినియోగం, నీటి సంరక్షణ వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులతో ప్రత్యక్షంగా ముచ్చటించి వారి సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులకు సూచనలు ఇచ్చారు.మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో శాస్త్రీయ విధానాలు అనుసరించడం అత్యవసరమని పేర్కొన్న కలెక్టర్, ఖర్చులను తగ్గిస్తూ దిగుబడులు పెంచుకునే మార్గాలను రైతులు అవలంబించాలని సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రం అందిస్తున్న శిక్షణలు, శాస్త్రవేత్తల సలహాలు, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.పంట మార్పిడి, మిశ్రమ పంటల విధానం, వాణిజ్య పంటల సాగు, పశుసంవర్ధక రంగం అనుసంధానం ద్వారా రైతుల ఆదాయం పెంపొందించుకోవచ్చని తెలిపారు.ప్రజా పాలన 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన ఈ కిసాన్ మేళా ద్వారా రైతులకు ఒకే వేదికపై ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం అందించడమే లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో మేయర్ గణేష్, డిప్యూటీ మేయర్ సిరిపురం లలిత, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, ఉద్యానవన శాఖ అధికారి కిషోర్, మత్స్య శాఖ అధికారి ఇంతియాజ్ ఖాన్, శ్రీ ఇంక్లైన్ సర్పంచ్ ఈసం ప్రవల్లిక, కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ భరత్, ఆత్మ చైర్మన్లు వీరభద్ర రావు, బుచ్చిబాబు, బోడా మంగీలాల్, తదితర అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## గడువుకంటే ముందే రికార్డు బొగ్గు డిస్పాచ్ కొత్తగూడెం ఏరియా సత్తా



కొత్తగూడెం బ్యూరో మార్చి 24(విజన్ ఆంధ్ర)కొత్తగూడెం ఏరియా లో ఆర్సిహెచ్పి ద్వారా జరిగిన బొగ్గు రవాణా నిర్దేశించిన 49.50 లక్ష టన్నుల డిస్పాచ్ లక్ష్యాన్ని, తేదీ. 22.03.2026 నాటికి మొత్తం 50.15 లక్ష టన్నుల బొగ్గు డిస్పాచ్ చేసి, నిర్దేశించిన గడువుకంటే (అనగా తేదీ. 31.03.2026) ముందుగానే లక్ష్యాన్ని సాధించిందిఈ సందర్భంగా ఏరియా జీఎం ఎం. షాలెం రాజు మాట్లాడుతూ ఈ ఘనత సాధనలో కీలక పాత్ర పోషించిన అధికారులకు, ఉద్యోగులకు హృదయపూర్వక అభినందనలు తెలిపి వారి ఆనందాన్ని వ్యక్తం చేసారు. ఇదే విధంగా భవిష్యత్తులో కూడా సమిష్టి కృషితో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జీఎం తో పాటు ఏరియా ఇంజనీర్ కే.ఎస్.ఎన్. రాజు , ఎస్.ఇ (ఈ అండ్ ఎం) అజ్మీరా శ్రీనివాస్ , ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ ఘట్టయ్య , ఇతర సంబధిత అధికారులు మరియు ఉద్యోగులు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్షా కేంద్రాలపై కలెక్టర్ అంకిత్ ఆకస్మిక తనిఖీలు



కొత్తగూడెం బ్యూరో మార్చి 24( విజన్ ఆంధ్ర)కొత్తగూడెం పట్టణంలో సోమవారం జిల్లా కలెక్టర్ అంకిత్ పదవ తరగతి వార్షిక పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సింగరేణి కాలరీస్ హై స్కూల్, సెయింట్ మేరీస్ హై స్కూల్, బాబు క్యాంపు పీఎం శ్రీ ఉన్నత పాఠశాలలను సందర్శించి పరీక్షల నిర్వహణను సమీక్షించారు.విద్యార్థులకు త్రాగునీరు, విద్యుత్, కూర్చునే సౌకర్యాలు, పరిశుభ్రత వంటి అంశాలను పరిశీలించి అవసరమైన చోట్ల వెంటనే మెరుగులు చేయాలని ఆదేశించారు. పరీక్షలు ప్రశాంతంగా, నిబంధనల ప్రకారం జరగాలని, మాల్‌ప్రాక్టీస్‌కు ఎలాంటి అవకాశం ఇవ్వకూడదని స్పష్టం చేశారు.పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా చర్యలు, సెక్షన్ 163 (బి) అమలు, పోలీసు బందోబస్తుపై కూడా సమీక్షించారు. అనవసర గుంపులు చేరకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.అన్ని కేంద్రాల్లో 100% విద్యార్థుల హాజరు నమోదైనట్లు అధికారులు తెలిపారు.

## పదవ తరగతి పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

ఉమ్మడి నల్గొండ జిల్లా బ్యూరో, మార్చ్23,విజన్ ఆంధ్రపదవ తరగతి పరీక్షలు ముగిసేవరకు కేంద్రాలలో వసతుల కల్పనలో ఎలాంటి లోపం ఉండకూడదని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు.సోమవారం అయన నల్గొండ జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల ఆవరణలో ఉన్న పదవ తరగతి పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.పరీక్షా కేంద్రాలలో అన్ని వసతులు ఎప్పటిలాగే ఉండాలని,ప్రత్యేకించి తాగునీరు,శానిటేషన్ పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని,టాయ్ లెట్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని అధికారులకు చెప్పారు.తాగునీటికి ఇబ్బంది లేకుండా కుండలలో తాగునీరు ఏర్పాటు చేయాలని అన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద గట్టి భద్రత ఏర్పాటు చేయాలని తనిఖీ పకడ్బందీగానిర్వహించాలని,పూర్తి స్థాయిలో తనిఖీ తర్వాతే విద్యార్థులను పరీక్ష కేంద్రం లోకి పంపించాలన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థుల హాజరు,తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు.పరీక్ష కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రథమ చికిత్స లో భాగంగా ఏ ఎన్ ఎం తో మాట్లాడారు.వేసవిని దృష్టిలో ఉంచుకొని ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.

## ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయం



నారాయణపేట మార్చ్ 23(విజన్ ఆంధ్ర) వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు గీత మల్టి స్పెషాలిటి హాస్పిటల్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడంతో డాక్టర్ గీత విశ్వనాధ్ దంపతులను కౌన్స్ లర్ రాఘవేంద్ర ప్రత్యేకంగా అభినందించారు సోమవారం సివిల్ లైన్ లో ఏర్పాటు చేసిన చలివెంద్రాన్ని అయన ప్రారంభించారు ఈసందర్బంగా మాట్లాడుతు ఎండలు ఎక్కువ అవుతున్నందున పేదలతోపాటు ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలి వేంద్రం ఏర్పాటు చేయడం పుణ్యసార్థకమని ప్రతి వార్డులో ప్రధాన కూడలిలో చలివెంద్రాలు ఏర్పాటు చేసేందుకు స్వచ్ఛంద సంస్థ లు మందుకు రావాలని అన్నారు అనంతరం ప్రముఖ స్త్రీ వైద్య నిపుణురాలు గీత ప్రఖ్యత ల్యాప్రో స్కోపిక్ సర్జన్ విశ్వ నాథ్ మాట్లాడుతు ఎండలు ఎక్కువ ఉన్నందున అత్యవసర పరిస్థితుల్లో తప్ప ఎక్కువ తిరగ రాదనీ దాహం వేసిన వెంటనే మంచినీరు నిమ్మరసం మజ్జిగ కొబ్బరి నీళ్లు లాంటివి తీసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో డాక్టర్ థౌసిప్ సునీల్ సిబ్బంది రామకృష్ణ చరణ్ తదితరులు పాల్గొన్నారు

## బిజ్వార్ లోఅట్టహాసంగా ప్రారంభమైనజిల్లాస్థాయిభజన పోటీలు



ఊట్కూర్, మార్చి 23 ( విజన్ ఆంధ్ర) ఊట్కూర్ మండల పరిధిలోని బిజ్వార్ లో జిల్లా స్థాయి హరినామ సంకీర్తన భజన పోటీలు ఆదివారంధర్మ జాగరణ రాష్ట్ర నిధి ప్రముఖ్ ఏడుదొడ్ల శ్రీనివాస్ రెడ్డి అట్టహాసంగా ప్రారంభించారు. నిర్వాహకులు సుధాకర్ రెడ్డి, దోరోళ్ల కృష్ణయ్య, దాసరి రామాంజనేయులు ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భజన వలన మానసిక ప్రశాంతత లభిస్తుందని, వ్యక్తి సన్మార్గంలో ప్రయాణించుటకు తోడ్పడుతుందని అన్నారు. భజన పరులు హిందుత్వం కోసం, హిందూ ధర్మం కోసం పని చేయాలని కోరారు. ప్రతి హిందువు ఇంట్లో రామాయణం, భారతం, భగవద్గీత పవిత్ర గ్రంథాలు ఉండాలని, వాటిని ఇంట్లో అందరూ చదవడం వలన ఇల్లు, ఊరు, దేశ శ్రేయస్సు కోసం పని చేసే పౌరులు తయారు అవుతారని అన్నారు. ఈ భజన పోటీలు ఈ నెల 26 వరకు జరుగుతాయని తెలిపారు. ఇప్పటి వరకు 40 టీంలు నమోదు చేసుకున్నట్లు వివరించారు. ఆసక్తి కల భజన టీంలకు చివరి రోజు వరకు పేరు నమోదు చేసుకొని పాల్గొనవచ్చని అన్నారు. గెలుపొందిన టీం లకు శ్రీరామ నవమి రోజు శ్రీ సీతా రామాంజనేయ స్వామి దేవాలయం లో ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ, పంచమ నగదు బహుమతులు అందచేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొల్లంపల్లి అంజయ్య, ఉపసర్పంచ్ గోవర్ధన్ రెడ్డి, వార్డు సభ్యులు నేదుగం రాఘవేంద్ర, చెన్నా రెడ్డి,గ్రామ పెద్దలు చాకలి వెంకటప్ప , వెంకప్ప గౌడ్, ఉప్పు ఆంజనేయులు, దాసరి రాజమూరి, దోరోళ్ల రాము, నాగిరెడ్డి, నర్సింహా రెడ్డి, మాదారం రాములు తదితరులు పాల్గొన్నారు.

## 26 నుంచి గౌస్ పాష అతం షర్ఫీ ఫాతేహా కార్యక్రమాలు



మహబూబ్ నగర్ అర్బన్ మార్చి 23 విజన్ ఆంధ్ర జిల్లా కేంద్రం బాదేషా బౌలీలోగల షామహ్మద్ గౌస్ పాష ఖాద్రీ అతం షర్ఫీ 5వ ఫాతేహ కార్యక్రమాలు ఈనెల 26 నుంచి 29 వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహక ప్రతినిధులు డాక్టర్ మహ్మద్ గయాజ్ పాష ఖాద్రీ, బుర్హాన్ మహెబూబ్ షర్ఫీ తెలిపారు. స్థానిక బర్హానే బాద్ దర్గా ఆవరణలో ఆదివారం ఫాతేహా కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 26న రాత్రి 7 గంటలకు గుస్లే షరీఫ్. నాతియా ముషాయిరా. 27న గంథోత్సవం, ఖవ్వాలి. 28న దీపారాధన, జల్సాయే ఫైజానే ఆవులియా, 29న ఖత్మే ఖురాన్ ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాదుల్లా, సయ్యద్ ముజీబ్, గఫూర్ నియాజీ, మౌలానా జుబేర్, జహంగీర్ పాష ఖాద్రీ, ఇబ్రాహీం షర్ఫీ, ఖదీర్ ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డు ను సందర్శించిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్



మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లా బ్యూరో మార్చి 23 విజన్ ఆంధ్ర మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వీరన్నపేట చెత్త సేకరణ కేంద్రాన్ని సోమవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ పరిశీలించారు చెత్త సేకరణ కేంద్రం(డంపింగ్ యార్డ్) లో తీసుకోవలసిన చర్యలను, అగ్ని ప్రమాదాలను రాకుండా ప్రతి రెండు రోజులకు ఒకసారి నీటిని పొడి చెత్త పై వేసి మంటలు కాకుండా అదుపు చేసేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. వర్మి కంపోస్టు లను పరిశీలించారు. డంపింగ్ యార్డు లో పని చేస్తున్న సిబ్బంది కి తగు జాగ్రత్తలు తీసుకోగలరని అదనపు కలెక్టర్ సూచించారు

## సిరిసిల్ల మున్సిపల్ కోఆప్షన్ సభ్యునిగా అవకాశం ఇవ్వండి, కేటీఆర్ కు ,షేక్ అలీ విజ్ఞప్తి

### అధిష్టానం ఆదేశాలతో పార్టీ ఆవిర్భావం నుండి కట్టుబడి పని చేశా

**మొన్న సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికల్లో మీరు సూచించిన అభ్యర్థికి భారీ ఓట్లతో గెలిపించడంలో ముఖ్యమైన పాత్ర నాది.**

**మైనార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు షేక్ అలీ**



సిరిసిల్ల, 23 మార్చి (విజన్ ఆంధ్ర)తెలంగాణ రాష్ట్రం టిఆర్ఎస్ పార్టీ 2001 ఏప్రిల్ 27 రోజున ఆవిర్భవమైంది. కేసీఆర్ తెలంగాణ సాధనకై దృఢ సంకల్పంతో ఉద్యమం పార్టీ గా టిఆర్ఎస్ పార్టీ కెసిఆర్ ముందుండి నడిపించారు. భారతదేశం మొత్తం తెలంగాణ వైపు చూసేలా ఉద్యమాలు,కేసీఆర్ నాయకత్వంలో,భారీ ర్యాలీలునిరాహార దీక్షలు,ప్రజా ఉద్యమాలుజరిగాయి. 2014లో తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం వరకు అనేక ఉద్యమాలలో షేక్ అలీ పెద్దూరుకు చెందిన మైనార్టీ నాయకుని ఆధ్వర్యంలో నా వంతు పోరాటం చేస్తూ నా మైనార్టీ వర్గ ప్రజలతో భారీ ఎత్తున తెలంగాణ పోరాటంలో అధిష్టానం పిలుపు మేరకు అనేక సందర్భాలలో అధిష్టానం ఆదేశాలను అనుసరించాను. మహాసభలకు టిఆర్ఎస్ మైనార్టీ కార్యకర్తలను, బస్సుల్లో భారీ సంఖ్యలో చేరవేయడంలో నా వంతు ప్రత్యేకమైన పాత్రను పోషించాను. తెలంగాణ రాష్ట్రం సాధించడం, పెద్దూరు గ్రామ ప్రజలతో పాటు ఏడు గ్రామాల ప్రజలను పెద్ద మొత్తంలో మమేకమై వారితో అనేక సందర్భాలలో పోరాటాలలో పాల్గొన్నాను అని షేక్ అలీ పేర్కొన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వం 10, సంవత్సరాలు ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు ఇతర సీనియర్ నాయకులతో, పార్టీ అధిష్టానం పిలుపు మేరకు అనేక పనులు చేశానని ఇప్పుడు సిరిసిల్ల మున్సిపల్ కోఆప్షన్ సభ్యులుగా ఒక్క అవకాశం ఇవ్వండి, అని కేటీఆర్ కు షేక్ అలీ విజ్ఞప్తి చేస్తున్నారు. తమ మైనార్టీ, విలీన గ్రామాల సమస్యల పై సిరిసిల్ల మున్సిపల్ లో విలీన గ్రామాల ప్రజల కోసం సమస్యల తరపున వారి ,వాని వినిపించేలా,కేటీఆర్ అనుగ్రహంతో, ఆశీర్వదిస్తే, సిరిసిల్ల మున్సిపల్ కోఆప్షన్ ఒక అవకాశం, కల్పిస్తే, సమస్య పరిష్కారాలు దొరుకుతాయి అన్న సహోద్దేశంతో ప్రజలు కోరుకుంటున్నారని, సిరిసిల్ల మున్సిపల్ కోఆప్షన్ లో ఒక అవకాశం కల్పించాలని జీవితాంతం రుణపడి ఉంటాను అని షేక్ అలీ తెలిపారు. చాలా సందర్భాలలో కేటీఆర్ అండతోనే ప్రజలకు న్యాయం జరిగిందన్నారు. మా వర్గ ప్రజలకు, విలీన గ్రామ ప్రజలకు న్యాయం జరిగేలా పోరాడుతామన్నారు. నా మైనార్టీ వర్గ ప్రజలకు కోసం ఎన్నో పనులు చేశారని మా వెనుకబడిన మైనార్టీ వర్గాలు తుర్కాశి కులస్తులకు చెందిన వాడిని అన్ని కులాల అన్నదండలతో ఆశీర్వాదంతో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. నాపై ఎమ్మెల్యే కేటీఆర్ ఆశీర్వాదంతో నాకు సిరిసిల్ల మున్సిపల్ లో ఆప్షన్ గా సభ్యుడిగా అవకాశం కల్పిస్తే బిఆర్ఎస్ పార్టీకి కేసీఆర్, కేటీఆర్ కు జీవితాంతం రుణపడి ఉంటానని షేక్ అలీ తొమ్మిదవ వార్డ్ నివాసి విలీన గ్రామమైన పెద్దూరు వాసి కేటీఆర్ కు విజ్ఞప్తి చేశారు.

## వి ఎస్ ఆర్ నగర్ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం

### విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



బచ్చన్నపేట,మార్చి23(విజన్ ఆంధ్ర):బచ్చన్నపేట మండలంలోని వి ఎస్ ఆర్ నగర్ ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయులు గా భాద్యతలు స్వీకరించి పాఠశాల నిర్వహణలో తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంనకు అతిధులుగా గ్రామసర్పంచ్, ఏఎపిసి చైర్మన్ లు పాల్గొన్నారు. ఈ సందర్బంగా విద్యార్థులు ఎంఇఓ గా మోతే విద్యాసాగర్,ప్రధానోపాధ్యాయులు లక్ష్మి ప్రసన్న, ఉపాధ్యాయురాలిగా కలియ సిరి, నాగుల భవ్య, డ్రిల్ మాస్టర్ యశ్వంత్ బాబు భాద్యతలు నిర్వహించినారు. ఈ సందర్బంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాస్యం కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ తో మెలిగి, బాగా చదివి భవిష్యత్ లో ప్రయోజకులు గా ఎదగాలని సూచించారు. ముఖ్య అతిథి గా విచ్చేసిన గ్రామ సర్పంచ్ గొడుగు రేణుక కమలాకర్ మాట్లాడుతూ పిల్లలు పూర్తి స్థాయిలో ఉపాధ్యాయుల పాత్రలో లీనమై చాలా చక్కగా, ఎలాంటి బిడియం లేకుండ బోదించారు అని అలాగే భవిష్యత్ లో తల్లితండ్రులకు, గ్రామస్తులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకొని రావాలని పిల్లలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేందర్ కుమార్, అంగన్వాడీ టీచర్ హజీర, విద్యార్థుల పేరెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

## చెరువుల కబ్జాలపై 3 రోజుల్లో నివేదిక ఇవ్వాలనీ ఇరిగేషన్ అధికారులకు కలెక్టర్ ఆదేశాలు



మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లా బ్యూరో మార్చి 23 విజన్ ఆంధ్ర జిల్లాలో చెరువులు, కుంటలపై పెరుగుతున్న ఆక్రమణలపై పూర్తిస్థాయి నివేదికను మూడు రోజుల్లో ఇవ్వాలని ఇరిగేషన్ అధికారులను జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా ఆదేశించారు. సోమవారం ప్రజావాణిలో స్థానిక ప్రతినిధులు, ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు మెట్టుకాడి ప్రభాకర్ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై కలెక్టర్‌ను సంప్రదిస్తూ సమస్య వివరించడం, పరిస్థితి తీవ్రతను చూపిస్తోందన్నారు. మూడు రోజుల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలనీ అధికారులకు జిల్లా కలెక్టర్ డెడ్‌లైన్ విధించారు. మహబూబ్‌నగర్ అర్బన్ మండలం పరిధిలోని 31 చెరువులు, కుంటలపై జరుగుతున్న ఆక్రమణలపై మూడు రోజుల్లో పూర్తి నివేదిక ఇవ్వాలని ఇరిగేషన్ అధికారులకు కలెక్టర్ స్పష్టం చేశారు. నివేదికలో తప్పనిసరిగా ఉండాల్సిన అంశాలుప్రతి చెరువు అసలు విస్తీర్ణంఖీూ (Full Tank Level) & బఫర్ జోన్ వివరాలుప్రస్తుత ఆక్రమణల స్థితిఅక్రమ నిర్మాణాల పూర్తి జాబితాబాధ్యుల వివరాలుఇప్పటివరకు తీసుకున్న చర్యలుఖీూలో అక్రమాలపై కఠిన హెచ్చరికఇటీవల చెరువుల ఖీూ పరిధిలో:అక్రమ కట్టడాలుమట్టితో నింపివేతలుభూకబ్జాలుపెరుగుతున్నాయని ముదిరాజ్ మహాసభ నుంచి వచ్చిన ఫిర్యాదులను కలెక్టర్ సీరియస్‌గా తీసుకున్నారు. కలెక్టర్ స్పష్టం"చెరువులు ప్రజల ఆస్తి. ఆక్రమణలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించమనీ అన్నారు పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వాలను. అవసరమైతే కఠిన చర్యలు తప్పవు" అని అధికారులు హెచ్చరించారు.

## పదో తరగతి పరీక్షా కేంద్రాలు తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



కరీంనగర్ జిల్లా ప్రతినిధి మార్చి 23 (విజన్ ఆంధ్ర)కరీంనగర్ జిల్లాలో సప్తగిరి కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తిరుమల నగర్ లోని మైనార్టీ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సోమవారం నిర్వహిస్తున్న ఇంగ్లీష్ పరీక్షల సరళిని పరిశీలించారు. విధులు నిర్వర్తిస్తున్న అధికారులు సిబ్బందితో మాట్లాడారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా పరీక్షలు నిర్వహించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన తాగునీరు, ప్రథమ చికిత్స, మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. తరగతి గదిలో తగిన వెంటిలేషన్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడా ఎలాంటి చిన్న తప్పిదానికి అవకాశం ఇవ్వకుండా విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసేలా అధికారులు తగిన చర్యలు, విద్యుత్ కార్యాలు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. హౌసింగ్ బోర్డు కాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల(కుమర్వాడి), సుభాష్ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే తనిఖీ చేశారు. విధులు నిర్వర్తిస్తున్న అధికారులకు తగిన సూచనలు చేశారు. పదవ తరగతి పరీక్షలు పక్కాగా నిర్వహించాలని, ఎక్కడా తప్పులు జరగకుండా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో వసతులను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు.

## వరి సేకరణపై అసెంబ్లీలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఫైర్

జనగామ, మార్చి23(విజన్ ఆంధ్ర):రాష్ట్రవ్యాప్తంగా ఎదురు చూస్తున్నరైతుల వరి సేకరణ అంశంపై అసెంబ్లీలో సోమవారం జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి తీవ్రంగా ఫైర్ అయ్యారు. రాష్ట్రంలో వరి కొనుగోళ్లపై ప్రభుత్వం చెప్పే గణాంకాలు, వాస్తవ పరిస్థితులు మధ్య వ్యత్యాసం ఉందని రికార్డు స్థాయిలో వరి సేకరణ చేశామని చెబుతున్న ప్రభుత్వం, ఆ రికార్డు ఎక్కడ? అని పల్లా ప్రశ్నించారు. కొనుగోళ్లలో ఉన్న అసలు నిజాలను బయటపెట్టారు. వరి సేకరణలో ఆలస్యం ఎందుకు జరుగుతోందని ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రభుత్వం 50 లక్షల టన్నుల వరి కొనుగోలుకు అనుమతి ఇచ్చిందని చెబుతున్న సీఎం రేవంత్ రెడ్డిని మిగిలిన వరి పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. రైతులకు చెల్లించాల్సిన బోనస్, బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులు ఎదుర్కొంటున్న కష్టాలను అర్థం చేసుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని పల్లా కోరారు. రాష్ట్రవ్యాప్తంగా వరి సేకరణ కోసం రైతులు ఎదురుచూస్తున్నారు అని,కేంద్రం కేవలం 50 లక్షల మెట్రిక్ టన్నులకు మాత్రమే అనుమతి ఇచ్చిందని ముఖ్యమంత్రి చెప్పడం రైతుల్లో అయోమయం కలిగించిందన్నారు. ప్రభుత్వం ప్రతి సీజన్‌లో రికార్డు స్థాయి సేకరణ అని చెప్పినా, అధికారిక గణాంకాల్లో అది కనిపించడం లేదు అన్నారు. గత ప్రభుత్వం కాలంలో (201920 నుండి 202223 వరకు) ప్రతి సంవత్సరం 100 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా వరి సేకరణ జరిగిందని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వం మాత్రం ఆ స్థాయిలో సేకరణ చేయలేకపోయిందన్నారు. 202324లో రెండు సీజన్లు కలిపి సుమారు 95.31 లక్షల మెట్రిక్ టన్నులు, 202425లో సుమారు 100.31 లక్షల మెట్రిక్ టన్నులే సేకరించారు అని తెలిపారు. రికార్డు సేకరణ ఎక్కడ జరుగుతోందో ప్రభుత్వం స్పష్టం చేయాలని ప్రశ్నించారు. కేంద్రం ఇచ్చిన 50 లక్షల టన్నులు ఒక సీజన్‌కా లేదా రెండు సీజన్ల కా అనేది క్లారిటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వరి సేకరణ కేంద్రాలు ఆలస్యంగా ప్రారంభమవుతున్నాయి అనిజనగామలో ఆలస్యంతో మార్కెట్ ధర రూ. 16001700 వరకు పడిపోయిందన్నారు. సీఎం ప్రకటించిన రూ. 1800 ధర సరిపోదు అని వాస్తవానికి రూ. 2400 రావాలని, బోనస్ కలిపితే రూ. 2900 వరకు రావాల్సి ఉందన్నారు. రూ. 1700 నుంచి రూ. 1800 పెంపు రైతులకు న్యాయం కాదని తెలిపారు. మొక్కజొన్నల మాదిరిగా వరి సేకరణను సమయానికి ప్రారంభించాలని, అవసరం వచ్చినప్పుడు మాత్రమే కేంద్రాలు ప్రారంభిస్తారా అని ప్రశ్నించారు. బోనస్ దొడ్డు వరికి ఇస్తామని చెప్పి అమలు చేయడం లేదు అని సన్న వరికే బోనస్ ఇస్తున్నారన్నారు. గత యాసంగికు సంబంధించిన రూ. 12,800 కోట్ల బకాయిలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని,ఆ బకాయిలను ఎప్పుడు చెల్లిస్తారో ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు.

## ప్రజలకిచ్చిన హామీలు దశలవారీగానెరవేరుస్తా

### కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ.



నారాయణపేట, మార్చి 23 (విజన్ ఆంధ్ర) మున్సిపల్ ఎన్నికల్లో మూడో వార్డు ప్రజలకు ఇచ్చిన హామీలు దశలవారీగా పరిష్కరిస్తామని మూడో వార్డు కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ అన్నారు. సోమవారం నారాయణపేటమూడో వార్డులో ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు తన సొంత ఖర్చుతో గుంతలమైన రోడ్లను మట్టి వేసి రోడ్డును బాగుచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలకు తాను గెలిచిన వెంటనే వార్డులో గుంతలమైన రోడ్లను మట్టి వేసి బాగు చేయించారు. దీంతో కాలనీవాసులు తన దృష్టికి తీసుకురావడంతో కాలనీలో గుంతలమైన రోడ్డును మట్టి వేసి గుంతలను పూడ్చి రోడ్డును వేయించినట్లు తెలిపారు. ఇది ఇంకా మేము ప్రమాణస్వీకారం చేయకపోయినా కూడా వార్డు ప్రజలకు మాట ఇవ్వడంతో మట్టి రోడ్డు వేయించడం జరిగిందన్నారు. గతంలో తాను కౌన్సిలర్ గా ఉన్నా లేకున్నా కూడా వార్డు అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశాననిగుర్తు చేశారు. తన కుమారుని పేరు పై కాకర్ల సురేష్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఎన్నో సేవ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందనిగుర్తుచేశారు. గతంలో తాను కౌన్సిలర్ గా ఉన్న ఎంతో అభివృద్ధి చేశానని మరి ఇప్పుడు మూడో వార్డును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది కాలనీవాసులకు మంచినీరు రోడ్డు సమస్యలను పరిష్కరించేందుకు తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తాననిఅన్నారు. ముందుగా మట్టి రోడ్డును వేయించడం జరిగిందని ఆమె తెలిపారు వార్డులో ఎలాంటి సమస్యలు ఉన్న నేరుగా తన దృష్టికి తీసుకు వస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు

## పదో తరగతి పరీక్షల సరళి పరిశీలిన

### జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



రఘునాథపల్లి, మార్చి23(విజన్ ఆంధ్ర):పదవ తరగతి వార్షిక పరీక్షల నిర్వహణలో భాగంగా పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులు సరిగా ఉండాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. సోమవారం రఘునాథపల్లి మండలంలోని జెడ్పీహెచ్ఎస్, సెయింట్ ఆల్ఫోన్సస్ హెచ్ఎస్, సెయింట్ మేరీస్ హెచ్ఎస్ పాఠశాలలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సందర్శించి పరీక్షల సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణ విధానం, సదుపాయాలను, వైద్య శిబిరాన్ని పర్యవేక్షించి, వేసవి దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మందులను సరిపడా అందుబాటులో ఉంచాలన్నారు. సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ లను సంబంధిత వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్ తో లోపలికి ఎవ్వరినీ అనుమతించవద్దని స్పష్టం చేశారు. అదే విధంగా ఎలాంటి లోటు పాట్లకు తావు లేకుండా పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలన్నారు. ప్రహారీ గోడ సరిగా లేని చోట భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని, పరీక్షలు నిష్పాక్షికంగా, క్రమశిక్షణతో నిర్వహించాలని తెలిపారు. ఈ పరిశీలనలో సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## తోఫా పంపిణి..



సూర్యాపేట మార్చి 23:(విజన్ ఆంధ్ర)కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని 44వార్డు కౌన్సిలర్ గుణగంటి హేమ సతీష్ లు అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 44 వార్డులో కౌసర్ మజీద్ ప్రెసిడెంట్ కాజా ఇస్రార్ అహ్మద్ ఆధ్వర్యంలో తోపా ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముస్లింలకు సంక్షేమ ఫలాలు అందించడం లో కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు ముందుంటుందని తెలిపారు. గత ప్రభుత్వాలు మైనార్టీల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించాయని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు మైనార్టీల పక్షపాతి అని, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించిన 4 శాతం రిజర్వేషన్ల వల్ల నేడు ఎంతోమంది ముస్లిం విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి ఉద్యోగ రంగాల్లో రాణిస్తున్నారు అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, మన్సూర్, ఖదీర్, సోనీ, సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి లో 96 దరఖాస్తులు

### కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి బ్యూరో మార్చ్23 (విజన్ ఆంధ్ర) కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి లో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ వివిధ సమస్యలపై వచ్చిన ఆయా శాఖలకు సంబంధించిన 96 అర్జీలను అర్జీదారుల నుండి స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ ప్రజావాణి లో వచ్చిన అర్జీలను అత్యంత ప్రాధాన్యతగా గుర్తించి తక్షణమే స్పందించి పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణి లో ఎ సి రోల్ బి మధుమోహన్, సీఈఓ చందర్, ఆర్డిఓ వీణ, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ యాక్షన్ ప్లాన్ రుణాలకు దరఖాస్తులు చేసుకోండి

## -- జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా



మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లా బ్యూరో మార్చి 23 విజన్ ఆంధ్ర ఎస్సీ యాక్షన్ ప్లాన్ రుణాలకు దరఖాస్తులు చేసుకోండని జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు జిల్లా లోని షెడ్యూల్డు కులాలకు చెందిన నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు తద్వారా ఆర్థిక పురోగతి పెంపొందిచాలనే లక్ష్యంతో షెడ్యూల్డు కులాల సేవా సహకార అభివృద్ధి సంఘం లిమిటెడ్ "ఎస్.సి. యాక్షన్ ప్లాన్ 2025-26" క్రింద రూ. 1.00 లక్ష రూపాయల వరకు ఎలక్ట్రికల్ ద్విచక్ర వాహనాలు (90% సబ్సిడీ), రూ. 3.00 లక్షల విలువ గల త్రిచక్ర ఎలక్ట్రికల్ ఆటో (ప్యాసింజర్/ గూడ్స్) వాహనాలు (70% సబ్సిడీ) మరియు రూ. 3.00 నుండి రూ. 7.00 లక్షల (రూ. 5.00 లక్షల వరకు 60% సబ్సిడీ) విలువ గల సోలార్ యూనివర్సల్ పంప్ కంట్రోల్ మరియు వ్యవసాయ అనుబంధ భాగాల యూనిట్లను లోన్ల క్రింద ప్రకటించారు. వయస్సు 21-50 సం,,లు కల అభ్యర్థులు ఉపాధి హామీ పథకాలకు మరియు 21-60 సం,,లు కల అభ్యర్థులు భూసంబంధ, వ్యవసాయ/ సోలార్ పరికరాల పథకాలకు దరఖాస్తు చేసుకొనగలరు. అభ్యర్థి సంవత్సర ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ. 1.50 లక్షలు మరియు పట్టణ/ మున్సిపాలిటీ ప్రాంతాల వారికి రూ. 2.00 లక్షలు మించి ఉండరాదు. మీ-సేవ నుండి పొందిన కులం మరియు ఒక సంవత్సరం లోపు ఆదాయ ధృవపత్రం, ఆధార్ కార్డ్ మరియు ఫుడ్ సెక్యూరిటీ కార్డ్ (FSC Card), డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన దారిద్ర రేఖకు దిగువన (ధ్రూా) కల అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకొనగలరు. కావున అర్హత మరియు ఆసక్తికల షెడ్యూల్డు కులాల అభ్యర్థులు TGOBMMS €HîÕ¢HŽ bþsÁ¼ýÙ https://tgobmmsnew.cgg.gov.in ద్వారా దరఖాస్తులు నమోదు చేసుకోవచ్చును. ఈ నమోదు ప్రక్రియ తేదీ. 17.03.2026 నుండి 24.03.2026 వరకు అందుబాటులో ఉంటుంది. ఆన్లైన్ లో ధరఖాస్తు చేసుకున్నవారు సంబంధిత పత్రాలు ఎస్.సి. కార్పోరేషన్ కార్యాలయం, మహబూబ్ నగర్ జిల్లా, రూమ్ నెం. 105, మొదటి అంతస్తు, సమీకృత జిల్లా ఆఫీసుల కార్యాలయము, కలెక్టరేటు (IDOC) నందు (2) జిరాక్స్ కాపీలు సమర్పించగలరు. ఇతర వివరములకు 9849905996 నందు సంప్రదించవలసినదిగా తెలిపారు

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలిలి: జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

## ప్రజావాణిలో 90 దరఖాస్తుల స్వీకరణ

మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లా బ్యూరో మార్చి 23 విజన్ ఆంధ్ర జిల్లా ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజావాణి లో అందిన ప్రతి ఫిర్యాదును నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా పాల్గొని ప్రజల నుండి వచ్చిన వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా భూ సర్వే, రెవెన్యూ సంబంధిత సమస్యలు, గృహ నిర్మాణ పథకాలు, వృద్ధాప్య పెన్షన్లు, మున్సిపాలిటీ మరియు పంచాయతీ పరిపాలనకు సంబంధించిన అంశాలపై మొత్తం 90 దరఖాస్తులు స్వీకరించబడినట్లు అధికారులు తెలిపారు. ప్రతి ఒక్క ఫిర్యాదు దారిని యొక్క సమస్యను జిల్లా కలెక్టర్ శ్రద్ధగా విని, సమస్యల స్వభావాన్ని అర్థం చేసుకున్నారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులకు స్పష్టమైన సూచనలు చేస్తూ, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజావాణి ద్వారా వచ్చిన వినతులపై నిర్దిష్ట కాలపరిమితిలో స్పందిస్తూ, పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను తగ్గించే దిశగా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, జడ్.పి. సీఈఓ, ఇంచార్జ్ డిపిఓ వెంకట్ రెడ్డి, ఆర్.డి.ఓ ఇ. నవీన్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మహాత్మా గాంధీ నగర్ కు ఆర్టీసీ బస్సులు నడపాలి: ఐద్వా



మల్కాజిగిరి, మార్చి 23, (విజన్ ఆంధ్ర): మహాత్మా గాంధీ నగర్ వైపు ఆర్టీసీ బస్సులను నడపాలని ఐద్వా మహిళలు కోరారు. సోమవారం ఐద్వా మహాత్మా గాంధీ నగర్ ఉమ్మడి కమిటీ ఆధ్వర్యంలో కుషాయిగూడ డిపో మేనేజర్ ని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఐద్వాఅధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ జ్యోతి, సహాయ కార్యదర్శి అన్నపూర్ణ, శిరీష, విజయలు మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ నగర్, నెహ్రూ నగర్, భారత్ నగర్, శ్రామిక నగర్, గాయత్రీ నగర్, ప్రగతి నగర్ కాలనీలలో ఎంతోమంది ప్రజలు నివసిస్తున్నారని, వందలాదిగా ప్రజలు అటు ఏఎస్ రావు నగర్ వెళ్లాలన్నా ఇటు ఎస్పీ నగర్ వెళ్లాలన్నా ఆర్టీసీ బస్సులు లేక రెండు కిలోమీటర్లు నడవవలసి వస్తుందని వాపోయారు. చిన్నపిల్లలు వృద్ధులు నడవలేక ఇబ్బందులు పడుతున్నారని, అట్లాగే చదువుకునే పిల్లలు, కాలేజీకి వెళ్లేవారు, ఉద్యోగస్తులు టైం కి చేరుకోక బస్సులు అందక ఇబ్బంది పడుతున్నారని కాబట్టి ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని డిపో మేనేజర్ వేణుగోపాల్ స్పందించి దయచేసి మహాత్మా గాంధీ నగర్ వైపు త్రీ నెంబర్ బస్సులను నడపాలని కోరారు. అలాగే సికింద్రాబాద్ నుండి కూడా బస్సులను ఇటు వైపు వచ్చే విధంగా చేయాలని వారు కోరారు. దీనికి మేనేజర్ చాలా మంచిగా స్పందించారని, తప్పకుండా ఒకసారి వెరిఫై చేసుకొని మొత్తం దారులు చూసి బస్సులు వేస్తామని తమకు చెప్పారని ఐద్వా మహిళలు తెలిపారు. ఈ కార్యక్రమంలోమల్కాజ్గిరి మండల అధ్యక్ష, కార్య దర్శులు చల్లా లీలావతి, పిట్టల మంగ, ఎస్ఎఫ్ఐ దువా కిరటి తదితరులు పాల్గొన్నారు

# జొన్న, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

**ప్రభుత్వం కొనుగోలు చేసే వరకు పోరాడుతాం**
**దిగుబడి పంటకు గిట్టుబాటు ధర చెల్లించాలి**
**యూరియా యాప్ లో కాకుండా షాపులో అందుబాటులో ఉండాలి**
**ధారూరు మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పట్లోళ్ల శ్రీకాంత్ రెడ్డి, సీనియర్ నాయకులు కోస్నం వేణుగోపాల్ రెడ్డి**





వికారాబాద్ జిల్లా ప్రతినిధి మార్చ్ 23 ( విజన్ ఆంధ్ర ) : వికారాబాద్ జిల్లా పరిధిలోని ధారూర్ మండల కేంద్రంలో ప్రభుత్వం జొన్న, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని బి ఆర్ ఎస్ పార్టీ ధారూర్ మండల అధ్యక్షుడు పట్లోళ్ల శ్రీకాంత్ రెడ్డి, సీనియర్ నాయకులు కోస్నం వేణుగోపాల్ రెడ్డి అన్నారు. సోమవారం బి ఆర్ ఎస్ పార్టీ ధారూర్ మండల అధ్యక్షుడు పట్లోళ్ల శ్రీకాంత్ రెడ్డి, సీనియర్ నాయకులు కోస్నం వేణుగోపాల్ రెడ్డి బి ఆర్ ఎస్ పార్టీ నాయకులతో కలిసి వికారాబాద్ జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రాజేశ్వరికి ధారూర్ మండల కేంద్రంలో జొన్న, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైతులు పండించిన పంటలను ప్రభుత్వం కొనుగోలు చేసే వరకు వదిలిపెట్టే ప్రసక్తే లేదని అన్నారు. ధారూర్ మండలంలోని ఆయా గ్రామాలలో సుమారు 5 వేల ఎకరాల భూమిలో జొన్న మొక్కజొన్నను రైతులు పండించారని తెలిపారు. రైతులు పండించిన పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని అన్నారు. యూరియా యాప్ లో కాకుండా షాపులో అందుబాటులో ఉండే విధంగా చూడాలని అన్నారు. ధారూర్ మండలంలో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జి రాములు, అవుసు పల్లి అంజయ్య, మాజీ కో ఆప్షన్ సభ్యులు ఆఫీస్, యువ నాయకుడు జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వివక్షకు నిరసనగా.25న జర్నలిస్టుల "ఛలో హైదరాబాద్"

## టిడబ్ల్యూజేఎఫ్ జనగామ జిల్లా అధ్యక్షుడు నీల నరేష్ బాబు



జనగామ, మార్చి23(విజన్ ఆంధ్ర): జర్నలిస్టుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అవలంబభిస్తున్న నిర్లక్ష్యవైఖరి, వివక్ష ధోరణికి నిరసనగా ఈ నెల 25వ తేదీ ఉదయం 11 గంటలకు రాష్ట్రవ్యాప్త జర్నలిస్టుల "ఛలో హైదరాబాద్-ఐ అండ్ పీఆర్ ఆఫీస్" కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) జనగామ జిల్లా అధ్యక్షుడు నీల నరేష్ బాబు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన గత రెండేళ్లలో జర్నలిస్టులను పూర్తిగా విస్మరించిందని అన్నారు. జర్నలిస్టుల సంక్షేమం పట్ల తీవ్రమైన వివక్ష చూపుతుందని చెప్పడానికి మొన్న అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెటే నిదర్శనమని అన్నారు. బడ్జెట్ లో జర్నలిస్టుల సంక్షేమం ఊసే లేకపోవడం, కనీసం జర్నలిస్టుల సంక్షేమం గురించి ఒక్క మాట కూడా చెప్పకపోవడం దారుణమని అన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా జర్నలిస్టులకు కనీసం కొత్త అక్రెడిటేషన్ కార్డులు ఇంతవరకు ఇవ్వలేదని, హెల్త్ కార్డులు సైతం ఇవ్వలేకపోయిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల ఊసే లేదని, సుప్రీం కోర్టు తీర్పు సాకుతో ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా తప్పుకుంటుందని ఆరోపించారు. మీడియా అకాడమీకి గవర్నింగ్ కౌన్సిల్ వేయలేదని, పదవీవిరమణ పొందిన పాత్రికేయులకు అనేక రాష్ట్రాలలో పెన్షన్ ఇస్తుండగా, మన రాష్ట్రంలో ఏ ఒక్కరికీ ఇవ్వడంలేదని అన్నారు. చిన్న, మధ్య పూర్తిగా తరహా పత్రికలు, పీరియాడికల్స్ ను అణిచివేస్తున్నదని, గత రెండేళ్లుగా అడ్వర్టైజ్మెంట్స్ బిల్స్ చెల్లించడం లేదని ధ్వజమెత్తారు. ఆర్ ఎన్ ఐ, పీఆర్ జి ఐ రిజిస్ట్రేషన్ తో నడుస్తున్న అనేక చిన్న, మధ్య తరహా పత్రికలను ఎంపానల్మెంట్ చేయడం లేదని, కనీసం ఆ పత్రికలకు అక్రెడిటేషన్ కార్డులు కూడా ఇవ్వకపోవడం దారుణమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత ఎన్నికల్లో జర్నలిస్టులకిచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదని, జర్నలిస్టుల సంక్షేమానికి ఎటువంటి చర్యలు వివక్ష చూపుతూ నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తున్నారని నీల నరేష్ బాబు ధ్వజమెత్తారు. ఈ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఈనెల 25న తలపెట్టిన "ఛలో హైదరాబాద్-ఐఅండ్ పీఆర్ ఆఫీస్" ఆందోళన కార్యక్రమంలో జిల్లా వ్యాపితంగా జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ దీపక్ తివారి





వికారాబాద్ జిల్లా ప్రతినిధి మార్చ్ 23 ( విజన్ ఆంధ్ర ) : పెండింగ్ లో ఉన్న ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి సమస్యల పరిష్కారం కొరకు వచ్చిన వారి ఫిర్యాదులను పూర్తి స్థాయి లో పరిశీలించి పెండింగ్ ఉంచకుండా సత్వరమే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి 135 పిర్యాదులు స్వీకరించారు. ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను పూర్తి స్థాయి లో పరిశీలించి పెండింగ్ ఉంచకుండా సత్వరమే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులు పరిష్కరించడం అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజావాణిలో వచ్చే ప్రతి దరఖాస్తును అధికారులు జాగ్రత్తగా చదివి, అందులో పేర్కొన్న సమస్యలను పూర్తిగా అర్థం చేసుకుని, అవసరమైన విచారణ జరిపి సరైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను పెండింగ్ ఉంచకుండా నిర్ణీత కాలంలో పరిష్కరించి స్పష్టమైన నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వివిధ శాఖ ల వారిగా డి పి ఓ ,పంచాయతీ రాజ్, గృహ నిర్మాణము డీఆర్డీఏ, ప్రణాళిక శాఖ, భూ సేకరణ విభాగాలకు చెందిన అధికారుల వద్ద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై వివరణ ఇవ్వాలని కోరారు. వారంలోపు అన్ని పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించి, గత వారం అందిన దరఖాస్తుల సంఖ్య, పరిష్కరించినవి, ఇంకా పెండింగ్‌లో ఉన్నవి వంటి వివరాలతో కూడిన సమగ్ర నివేదికను స్పష్టమైన నమూనాలో సమర్పించాలని అధికారులకు ఆదేశించారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై అధికారులతో మాట్లాడుతూ గ్రామ పంచాయతీ, మండల, మున్సిపాలిటీ , జిల్లా స్థాయిలో రోజువారీ షెడ్యూల్ ప్రకారం ప్రజలు,. ప్రజా ప్రతినిధులునిర్వహించిన కార్యక్రమాలను తప్పని సరిగా ఫోటోలు పంపించాలని సూచించారు. ప్రతి రోజూ చేపట్టిన కార్యక్రమాలకు సంబంధించిన ఫోటోలు , వివరాలను కార్యక్రమం అనంతరం జిల్లా అధికారుల వాట్సాప్ గ్రూపులో అప్లోడ్ చేయాలని, ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, అదనపు కలెక్టర్ రెవెన్యూ రాజేశ్వరి ,జడ్.పి సి ఇ ఓ సుధీర్, డి ఆర్ ఓ మంగీ లాల్ ,డి ఆర్ డి ఓ శ్రీనివాస్ ,ఆర్ డి ఓ వాసు చంద్ర,వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మినీ సరస్ మేళాలి ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**శిల్పారామం లో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా గ్రామీణ మహిళలు తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శన,అమ్మకం**

మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లా బ్యూరో మార్చి 23 విజన్ ఆంధ్ర మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం శిల్పారామంలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా గ్రామాభివృద్ధి సంస్థలు,నాబార్డ్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన లి"మినీ సరస్ మేళా"లి ను సోమవారం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ప్రారంభించారు. ఈ నెల 29 వరకు నిర్వహించనున్న మినీ సరస్ మేళా ను ప్రజలు పెద్దఎత్తున సందర్శించి, స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన వస్తువులను కొని వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పడాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ ఎగ్జిబిషన్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన స్వయం సహాయక సంఘాల ద్వారా సుమారు 50 స్టాళ్లను ఏర్పాటు చేశారు. గ్రామీణ మరియు పట్టణ స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన వివిధ ఉత్పత్తులను ఈ స్టాళ్లలో ప్రదర్శించి విక్రయానికి ఉంచారు. ఎగ్జిబిషన్ ప్రారంభం అనంతరం కలెక్టర్ కొన్ని స్టాళ్లను సందర్శించి, స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలించారు. సభ్యులతో మాట్లాడి వారి అనుభవాలు, బ్యాంకుల ద్వారా పొందుతున్న రుణాలు, ఉత్పత్తుల తయారీ విధానం, మార్కెటింగ్ విధానాలు, ఆదాయం తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, జిల్లా కేంద్రంలోని శిల్పారామంలో మినీ సరస్ ఎగ్జిబిషన్ ప్రారంభించడం ఆనందంగా ఉందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు అభినందనలు తెలియజేస్తూ, డి.ఆర్.డి.ఎ, నగర పాలక సంస్థ ఇతర ,శాఖల అధికారులను ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారుఉమ్మడి జిల్లాలోని నారాయణపేట, గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ ప్రాంతాల మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా స్టాళ్లు ఏర్పాటు చేసి, వారు తయారు చేసిన వస్తువులను ప్రదర్శించి విక్రయిస్తున్నారని తెలిపారు. ఈ ఎగ్జిబిషన్ ప్రధాన ఉద్దేశం స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు మార్కెటింగ్ మరియు ప్రోత్సాహం కల్పించడమేనని పేర్కొన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున ఈ ఎగ్జిబిషన్‌ను సందర్శించి, స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులను కొనుగోలు చేసి వారికి ఆర్థికంగా తోడ్పడాలని పిలుపునిచ్చారు. దీంతో వారు ఆర్థికంగా బలోపేతం అవుతారని తెలిపారు. శిల్పారామం ఒక మంచి పర్యాటక స్థలం కావడంతో, ప్రజలు తమ కుటుంబ సభ్యులతో సాయంత్రం వేళల్లో ఎగ్జిబిషన్‌ను సందర్శించాలని సూచించారు. అలాగే సాయంత్రం నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించి ఆనందంగా గడపవచ్చని తెలిపారు. ఈ మినీ సరస్ ఎగ్జిబిషన్‌లో స్వయం సహాయక సంఘాల స్టాళ్లతో పాటు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'భరోసా', వైద్య ఆరోగ్య శాఖ హెల్త్ క్యాంప్, బి.సి సంక్షేమ శాఖ, ఎస్‌బిఐ బ్యాంక్ స్టాళ్లు ఏర్పాటు చేసి, వివిధ అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎస్.పి,డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి,జిల్లా గ్రంధాలయ సంస్థ మల్లు నర్సింహ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, డి.ఆర్.డి.ఓ నరసింహులు, మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డి, నాబార్డ్ ఎ.జి.యం డి.ఈ. రవిశంకర్ , డి.డి.యం.షణ్ముఖ చారి,జిల్లా పరిశ్రమల కేంద్రం జి.ఎం. యాదయ్య, ఎల్.డి.యం. చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# చేనేత హస్తకళల కార్మికులకు అండగా ఉంటాం

## డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి



మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లా బ్యూరో మార్చి 23 విజన్ ఆంధ్ర చేనేత వస్త్ర హస్త కళాకారులకు అండగా ఉంటామని మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని శిల్పారామంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ , గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(నాబార్డ్) ఏర్పాటు చేసిన మినీ సరస్ ఫెయిర్ కి ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు . ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మేయర్ గుమల మమత శ్రీనివాస్,మూఢ చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ ,గ్రంథాలయ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి ,జిల్లా ౹ూ జానకి ,కమిషనర్ రామంజుల రెడ్డిలతో కలిసి మినీ సరస్ ఫెయిర్ ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ & పట్టణ స్వయం సహాయక సంఘాలు తయారుచేసిన చేనేత వస్త్రాలు, హస్తకళలు, ఆర్టిఫిషియల్ ఆభరణాలు, హెర్బల్ ప్రొడక్ట్స్ వడకంతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి అని ఆకాంక్షించారు. మీూా యెన్నం శ్రీనివాస్ రెడ్డి సహకారంతో చేనేత కార్మికులకు ఉత్పత్తులకు, అమ్మకాలకు ప్రభుత్వ పరంగా మేము అందరం ఎప్పుడు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ డివిజన్స్ కార్పొరేటర్లు,నాబార్డ్ సంస్థ అధికారులు,వివిధ సంఘాల చైర్మన్లు, జిల్లా నాయకులు, మున్సిపల్ అధికారులు, ప్రజలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# బీపీ డ్రింకింగ్ వాటర్ నుంచి 'ద వన్ అండ్ ఓన్లీ' విడుదల





హైదరాబాద్, మార్చి 23 (విజన్ ఆంధ్ర) : తన కొత్త కాంపైన్ లో భాగంగా బ్లెండర్స్ ప్రైడ్(బీపీ) ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ తమ కొత్త కాంపైన్ 'ద వన్ అండ్ ఓన్లీ'ని ఆవిష్కరించినట్లు పెర్నాడ్ రికార్డ్ ఇండియా ఛీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ దేబాశ్రీ దాస్ గుప్తా సోమవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈ కొత్త కాంపైన్ అవంతి నాగ్ రథ్, కిరణ్ దీప్ చహల్, మహికా శర్మ లతో విలక్షణంగా చిత్రీకరించినట్లు తెలిపారు. స్టైల్, అర్థవంతమైన కంటెంట్ లో మూలాలు కలిగిన ఈ బ్రాండ్ ఆధునిక భారత దేశపు సంస్కృతిలో ఆశావహ విజయాన్ని నిరంతరంగా తీర్చిదిద్దిందని పేర్కొన్నారు. భారత దేశంలో ఆకాంక్ష కలిగిన యువత విజయం సాధించడమే కాకుండా ప్రత్యేకంగా నిలవాలని లక్ష్యం చేసుకున్న సాంస్కృతిక సందర్భాన్ని ఇది ముందుకు తెస్తుందన్నారు. విజయం యొక్క కథనంతో బీపీ యువత యొక్క ప్రతిధ్వనించే ఆకాంక్షలను గ్రహిస్తుందని అన్నారు. ఆవిష్కరణలతో ముందుండటం నుండి, పరిశ్రమలో ఎన్నో ప్రథమాలకు మార్గదర్శకత్వం వహించడం, దిగ్గజపు ఫ్యాషన్ ప్లాట్ ఫాంలను రూపొందించడం వరకు 'ద వన్ అండ్ ఓన్లీ'తో బీపీ తన తదుపరి అభివృద్ధి గమనాన్ని వివరిస్తుందని తెలిపారు.

# ప్రజా ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి

## జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్



నారాయణపేట మార్చి 23 (విజన్ ఆంధ్ర) నారాయణపేట జిల్లా పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలోకి వచ్చే ప్రజా ఫిర్యాదులను ఎలాంటి ఆలస్యం చేయకుండా తక్షణమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ సిఐలు, ఎస్ఐలకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుని గౌరవంగా తీసుకోవాలని, వారి సమస్యలను శ్రద్ధగా వినాలని సూచించారు. ప్రజలు పోలీస్ స్టేషన్‌కు రావడం అనేది వారి సమస్యకు పరిష్కారం దొరకాలనే ఆశతోనేనని, అందువల్ల ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యంగా తీసుకొని వెంటనే చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులు తమ ఫిర్యాదులను స్టేషన్‌లో నమోదు చేసిన వెంటనే పరిష్కారం లభించకపోతే ఇంత దూరం రాకుండా సంబంధిత సర్కిల్ ఇన్స్పెక్టర్‌ను సంప్రదించాలని సూచించారు. సర్కిల్ స్థాయిలో కూడా సమస్య పరిష్కారం కాకపోతే సంబంధిత డీఎస్పీని, జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు. అదేవిధంగా, ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ప్రజలకు న్యాయం చేయడం పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని, అందులో ఎటువంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు.
పోలీస్ స్టేషన్లలో పారదర్శకత, బాధ్యతాయుత విధానం పాటిస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలని, ప్రతి ఒక్కరూ తమ విధులను నిబద్ధతతో నిర్వర్తించాలని ఎస్పీ ఆదేశించారు. జిల్లా ప్రజలు ఎటువంటి సమస్యలు ఎదుర్కొన్నా భయపడకుండా పోలీస్ శాఖను సంప్రదించి న్యాయం పొందాలని ఎస్పీ సూచించారు.

# వెంకన్న స్వామి హుండీ ఆదాయం లెక్కింపు



మల్కాజిగిరి, మార్చి 23,( విజన్ ఆంధ్ర): ఆనంద్ బాగ్ చౌరస్తాలోని శ్రీ లక్ష్మి వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో భక్తులు స్వామి వారికి హుండీలో సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించారు. ఎండోమెంట్ పర్యవేక్షణ అధికారి మోహన్ రెడ్డి సమక్షంలో హుండీని లెక్కించారు. 40 రోజులకు గాను 2,16,980( రెండు లక్షల పదహారు వేల తొమ్మిది వందల ఎనభై) రూపాయలు ఆదాయం వచ్చినట్టు ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎ బి రవీంద్ర రెడ్డి తెలిపారు.హుండీ లెక్కింపులో ఆలయ అర్చకులు డా.తులసి వెంకట రమణాచార్యులు, ఆలయ జూనియర్ అసిస్టెంట్ సంద్ర సుధాకర్ అభివృద్ధి కమిటీ మాజీ సభ్యులు సానాధి శంకర్, హేమంత్ కుమార్, అనిత, భక్తులు రత్నమాల, రత్న కుమారి, గాంధీ, కొండ లలిత, కామేశ్వర రావు, సుబ్బా రావు, టి.మధుసూదన్ రావు, సూర్యకుమారి, రాజేశ్వరి, వాసంతి, రమేష్, కె వి ఎస్ ప్రసాద్, నాగేశ్వర రావు సరళ, పద్మంజలి, కల్యాణి,హర్షిత తదితరులు పాల్గొన్నారు.

# డొమెస్టిక్ సిలిండర్లను వాణిజ్యానికి వాడితే కఠిన చర్యలు

## జిల్లా పౌరసరఫరాల అధికారి కాశీ విశ్వనాథ్



వనపర్తి,విజన్ ఆంధ్ర ప్రతినిధి :గృహ( డొమెస్టిక్) సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగించడం చట్ట విరుద్ధమని, ఇలాంటి వాటిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పౌరసరఫరాల అధికారి కాశీ విశ్వనాథ్ హెచ్చరించారు. సోమవారం వనపర్తి పట్టణంలోని పలు హోటళ్లలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా సివిల్ సప్లై అధికారి కాశీ విశ్వనాథ్ తమ బృందంతో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హోటళ్లలో గృహ వినియోగానికి ఉద్దేశించిన ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తున్నట్లు గుర్తించారు.తనిఖీలలో భాగంగా మొత్తం 19 గృహ వినియోగ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. గృహ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగించడం చట్ట విరుద్ధమని, ఇలాంటి చర్యలపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారి హెచ్చరించారు. హోటల్ యజమానులు తప్పనిసరిగా వాణిజ్య సిలిండర్లను మాత్రమే ఉపయోగించాలని సూచిస్తూ, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని తెలిపారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్యాస్ సరఫరా వ్యవస్థను సక్రమంగా నిర్వహించేందుకు అధికారులు కట్టుబడి ఉన్నారని ఆయన స్పష్టం చేశారు.

# జనగణనసర్వేలో హెచ్ఎంలను పర్యవేక్షకులుగా కేటాయించాలి

ఊట్కూర్, మార్చి 23 (విజన్ ఆంధ్ర) వేసవి సెలవుల్లో జనగణన సర్వేలో ఎల్ ఎఫ్ ఎల్ హెచ్ఎం, పి ఎస్ హెచ్ ఎం లకు పర్యవేక్షకులుగా విధులు కేటాయించాలని హెచ్ఎంల సంఘం అధ్యక్షులుదుంపనర్సింగప్ప అన్నారు. సోమవారం ఊట్కూర్ తాసిల్దార్ చింతరవికి హెచ్ఎంలు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఊట్కూర్ మండలంలో ఉపాధ్యాయులకు జనగణన లో సీనియర్ ఉపాధ్యాయులకు ప్రాధాన్యత కల్పిస్తూ ఎల్ ఎఫ్ ఎల్ హెచ్ ఎం, పిఎస్ హెచ్ఎంలను పర్యవేక్షకులుగా విధులు కేటాయించడంతో తమకు ఎలాంటిఅభ్యంతరంలేదని అన్నారు. వేసవి సెలవుల్లో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా చేపట్టే సర్వేలో భాగంగా మన రాష్ట్రంలో సర్వే చేపడుతుందని తమకు విధులు జన గణనసర్వేలోతాము కోరిన విధంగా విధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం కార్యదర్శి రవీందర్ నాయక్ ఉపాధ్యక్షులు గురునాథ్, విలు వ సభ్యులు పద్మావతి, సుజాత, శ్రీవిద్య, చంద్రశేఖర్, తిప్పన్న తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 25న పాలెంలో మెగా వైద్య శిబిరం

## పాలెం వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక.

నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర): మార్చ్ 23ఈనెల 25వ తారీఖున అనగా (బుధవారము)రోజు ఉదయం 9 గంటల నుంచి పాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 99 రోజుల ప్రణాళికలో భాగంగా పాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు స్పెషలిస్ట్వైద్యులచే ఉచితంగా మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరుగుతుంది అని స్థానిక వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలియజేశారు.ఈ సందర్భంగా డాక్టర్ ప్రియాంక గారు మాట్లాడుతూ నిపుణులైన డాక్టర్లు గ్రామాలకు వచ్చి ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినప్పుడు ప్రజలు నిపుణులైన వైద్యుల సలహాలు సూచనలు ; ట్రీట్మెంట్ తీసుకొని ఆరోగ్యకరమైన జీవితం గడపాలని తెలియజేశారు.25 జరిగే వైద్య శిబిరం నందు స్త్రీ వైద్య నిపుణులు చిన్న పిల్లల వైద్య నిపుణులు ఎముకలు /కీళ్ల వైద్య నిపుణులు దంత వైద్య నిపుణులు కంటి వైద్య నిపుణులు మరియు జనరల్ ఫిజీషియన్ మొదలగు డాక్టర్లు నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని సాధారణ ఆస్పత్రి నుంచి వచ్చి ఇట్టి క్యాంపును నిర్వహిస్తున్నారు కాబట్టి బిజినపల్లి మండల ప్రజలు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ప్రియాంక సూచించారులి

# ఈ శానిటేషన్ ఇన్స్పెక్టర్ చెప్పేదొకటిచేసేది మరొకటి..!

## సమయపాలన పాటించడు ఎవ్వరి మాట వినడు...కలెక్షన్ కింగ్ ... సి హెచ్, శ్రీనివాస్



మల్కాజిగిరి, మార్చి 23,:మాట వింటుంటే ఆయనవన్నీచిలక పలుకులు...చేతలు మాత్రం గుట్టు చప్పుడు కాకుండా అడ్డదారిలో వసూళ్లతో రెండు చేతులా సంపాదన..ఆయనే మల్కాజిగిరి సర్కిల్ శానిటేషన్ సూపర్వైజర్ సీహెచ్ శ్రీనివాస్. ఈ మున్సిపాలిటీలో ఆయనే ఎస్ ఎస్ గా సీనియర్ కావడంతో ఇక్కడ అంతా ఆయన ఇష్టారాజ్యంగా నడుస్తోంది.తన ఇష్టం వచ్చినప్పుడు విధులు నిర్వహిస్తూ, సమయపాలన పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు. ఆయన ఆఫీసుకు , విధులకు ఎప్పుడు వస్తాడో ఎప్పుడు పోతాడో ఎవరికి తెలియదు.. ఏమన్నా ఎవరైనా అడిగితే నేను కమిషనర్ దగ్గర ఉన్న, అని చెప్పడం ఇతగాడి ఊతపదమై పోయింది. ఫీల్డ్ లో ఏం జరుగుతుందో కనీస అవగాహన కూడా తెలియని ఈ పెద్దమనిషి ఈ శానిటేషన్ సూపర్ వైజర్ అని వివిధ కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.ఇక కలెక్షన్స్ వసూళ్లలో ఇతని రూటే సపరేటు. తనకు నచ్చిన వారికి మాముళ్ళు ఇస్తూ, తన అవినీతి,అక్రమాలు, బలవంతపు వసూళ్లు గురించి బయటకు పొక్కకుండా మేనేజ్ చేస్తూజాగ్రత్త పడుతుంటాడని మల్కాజిగిరి సర్కిల్లో పెద్ద టాక్ వినిపిస్తోంది. చిన్నచిన్న ఫుట్ పాత్ ల మీద ఎవరైనా బండ్లు పెడితే వాళ్లను భయభ్రాంతులకు చేసి తనకు నెలసరి మాముళ్ళు ఇవ్వాలంటూ బెదిరించి మామ-మియలతో రెండు చేతులారా సంపాదించి, నాలుగు జేబులలో దాచుకుని ఇంటికి వెళ్ళనిదే ఈయనగారికి నిద్రపట్టదని మల్కాజిగిరిలో పలువురు బాధ్యతలు లబోదిబోమంటున్నారు.కలెక్షన్స్ కింగ్ గా మారి వసూళ్లలో తన రూటే సపరేటు అంటూ కాలరేగేస్తున్న శానిటేషన్ శ్రీనివాస్ పేరు వినిపిస్తేనే చిరు వ్యాపారులు హడలి పోతున్నారు. నాకు నెల జీతం నరిపోదు, దీపం ఉండగానే ఇల్లు చక్క బెట్టుకోవాలి..నెలసరి కలెక్షన్లు కన్నా డెయిలీ కలెక్షన్స్ కావాలి అంటూ ఇతను చేసే పనులు, దిగమింగే అమ్యామ్యాలు కథలు అన్నీ ఇన్నీ గావు అని పలువురు చెవులు కొరుక్కుంటున్నారంటే ఎస్ ఎస్ శ్రీనివాస్ అంటే మజకానా...? అనే వ్యాఖ్యలు హాట్ టాపిక్ గా వినపడుతు న్నాయి. ఇలా.. ఒకటి కాదు రెండు కాదు.., పదుల సంఖ్యలో ఉన్నాయి ఈయన లీలలు. ఈ మామూళ్ల దందా సర్కిల్ కమిషనర్ కు తెలిసే జరుగుతుందా.. !?? వారి అండ చూసే ఎస్ ఎస్ శ్రీనివాస్ పెట్రేగిపోతున్నాడని స్థానికంగా తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కంచే చేను మేసిందన్న చందంగా మున్సిపల్ శానిటేషన్ సూపర్ వైజర్ బలవంతపు వసూళ్ళకు పాల్పడితే ఇక అడిగే నాధుడు ఎవరంటూ స్థానికులు వాపోతున్నారు. స్థానికంగా ఎక్కడ చూసినా, ఎవరి నోట విన్నా శ్రీనివాస్ లీలలు జోరుగా వినవస్తున్నాయి. ఇకనైనా మల్కాజిగిరి మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ స్పందించి, మల్కాజిగిరి ఎస్ ఎస్ శ్రీనివాస్ బలవంతపు అక్రమ వసూళ్ళపై విచారణ జరిపించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు

# వనపర్తిని పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దుతాం

## జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి వివరణాత్మక నివేదిక (DPR) సిద్ధం చేస్తే నిధుల మంజూరుకు కృషి




వనపర్తి, విజన్ ఆంధ్ర ప్రతినిధి : వనపర్తి జిల్లాలోని పర్యాటక కేంద్రాలను అభివృద్ధి పరచి జిల్లాను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు డి.పి.ఆర్. సిద్ధం చేసి పంపిస్తే తమ వంతు సహకారం అందిస్తామని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. సోమవారం మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్ (కర్ణాటక) వారు సోమశిల – అలంపూర్ పర్యాటక సర్క్యూట్ లో పర్యాటక కేంద్రాల అభివృద్ధిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సర్క్యూట్ పరిధిలో ఉన్న ఘనపూర్ ఫోర్ట్, శ్రీ రంగనాయక స్వామి దేవాలయం, తీర్మలాయ గుట్ట, చంద్రగడ్ కోట, సరళాసాగర్ తదితర ప్రాంతాల్లో పర్యాటకుల కొరకు మౌలిక సదుపాయాలు కల్పించి వనపర్తి జిల్లాను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తమ వంతు సహకారం చేస్తామని, ముందుగా డి.పి.ఆర్ సిద్ధం చేసి ప్రతిపాదనలు పంపించాలని కలెక్టర్ టూరిజం ప్రాజెక్ట్ మేనేజర్ వాత్సల్య ను కోరారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్ ప్రాజెక్ట్ మేనేజర్ వాత్సల్య మాట్లాడుతూ సోమశిల, అలంపూర్ పర్యాటక సర్క్యూట్ కేంద్రానికి వనపర్తి జిల్లా ఒక కేంద్ర బిందువుగా ఉందని, పర్యాటకులు ఇక్కడ బస చేసి చుట్టుప్రక్కల ఉన్న పర్యాటక ప్రాంతాలను సందర్శించి రావచ్చు అన్నారు. వనపర్తి జిల్లాలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి చాలా అనువైన ప్రాంతమని, భూములు కేటాయిస్తే మౌలిక వసతులు అభివృద్ధి చేసేందుకు దోహదపడుతుందని కలెక్టర్ ను కోరారు. స్పందించిన కలెక్టర్ డి.పి.ఆర్ సిద్ధం చేసి ప్రతిపాదనలు పంపిస్తే జిల్లా యంత్రాంగం తరపున పూర్తి సహకారం అందిస్తామని తెలియజేశారు. ఆర్డీఓ సుబ్రమణ్యం , జిల్లా టూరిజం అధికారి సుధీర్ కుమార్ రెడ్డి, ఆర్కిటెక్చర్ సాత్విక, రోడ్లు భవనాల శాఖ కార్యనిర్వహక ఇంజనీరు దేశ్యా నాయక్, అటవీ శాఖ అధికారి తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ పనుల్లో వేగం పెంచండి

## జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పెండింగ్‌లో ఉన్న సర్వే పనులు తక్షణమే పూర్తి చేయాలని ఆదేశం



వనపర్తి జిల్లా జిల్లాలోని నీటిపారుదల ప్రాజెక్టులకు భూసేకరణకు సంబంధించి పెండింగ్లో ఉన్న సర్వే పనుల్ని వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ ఇరిగేషన్ మరియు రెవెన్యూ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో కొనసాగుతున్న పలు నీటిపారుదల ప్రాజెక్టుల భూ సేకరణకు సంబంధించిన పెండింగ్ అంశాలపై అధికారులతో చర్చించారు. కర్నె తాండ లిఫ్ట్ ఇరిగేషన్ కు సంబంధించి పెండింగ్ 34 ఎకరాల భూసేకరణకు పెగ్ మార్కింగ్ పూర్తి అయినప్పటికీ ఇంకా సర్వే పూర్తి చేయకపోవడంపై సర్వే అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో వారంలోపు ఈ 34 ఎకరాల సర్వే పూర్తి చేసి, మార్చి 31 నాటికి ప్రిలిమినరీ నోటిఫికేషన్ పబ్లిష్ చేసే విధంగా అడుగులు పడాలని ఆదేశించారు. జిల్లాలో గణపసముద్రం ప్రాజెక్టులో భాగంగా పెండింగ్లో ఉన్న 197 ఎకరాల భూసేకరణకు సర్వే పూర్తి అయిందని, ప్రిలిమినరీ నోటిఫికేషన్ మార్చి 31 లోపు పూర్తి చేయాలన్నారు. మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద డి 1, డి 5, డి 8, ప్యాకేజ్ 29 కు సంబంధించి 92 ఎకరాల భూసేకరణకు పెగ్ మార్కింగ్ 2 వారాలలోపు కంప్లీట్ చేయాలని, పెగ్ మార్కింగ్ తో పాటే సర్వే విభాగం అధికారులు ఎంజాయ్మెంట్ సర్వే కూడా పూర్తి చేయాలని ఆదేశించారు. ఖాన్ చెరువుకు సంబంధించి 18.82 ఎకరాల భూసేకరణకు పెగ్ మార్కింగ్, సర్వే ఏకకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని ప్రజలకు నీటి ఇబ్బందులు లేకుండా చూడాలి వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు తాగు నీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. నీటి సరఫరా నిర్వహణకు సంబంధించి ఏమైనా ఇబ్బందులు ఉంటే ఇప్పుడే పరిష్కరించుకోవాలని సూచించారు. గతేడాది సమస్యలు తలెత్తిన ప్రాంతాలు, లైన్లను మరోసారి సరిచూసుకొని ఈ ఏడాది అటువంటి సమస్యలు తలెత్తకుండా తెలియజేశారు. సమావేశంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, నీటిపారుదల శాఖ ఎస్ ఈ చంద్రశేఖర్, సర్వే ఏడి శ్రీనివాసులు, మిషన్ భగీరథ అధికారులు, ఇతర రెవెన్యూ అధికారులు, నీటిపారుదల శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గిరివాణికి ఫిర్యాదుల వెల్లువ అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

## భూ వివాదాల పరిష్కారం కోసం ఎస్ డి సి కోర్టు నిర్వహణ. జిల్లా కలెక్టర్, ఐటీడీఏ ఇంచార్జ్ ప్రాజెక్ట్ ఆఫీసర్ దివాకర టి.ఎస్





ములుగు మార్చి 23;విజన్ ఆంధ్ర ప్రతినిధిసోమవారం ఐటీడీఏ ఏటూరునాగారం సమావేశ మందిరంలో ప్రజావాణి – గిరివాణి (గిరిజన దర్బార్) కార్యక్రమం లో స్వయంగా ప్రజల నుండి దరఖాస్తులను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. స్వీకరించారు. గిరివాణి (గిరిజన దర్బార్) కార్యక్రమానికి 130, ప్రజావాణి కార్యక్రమానికి 52 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గిరిజనులు ప్రధానంగా తమ గ్రామాల్లో రోడ్ల నిర్మాణం, కొత్త బోర్వెల్‌ల ఏర్పాటు, వ్యవసాయ భూముల్లో బోర్ వెల్స్ ఏర్పాటు వంటి పలు అంశాలపై తమ అర్జీలను సమర్పించడం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు.భూ సమస్యలు ఎల్టిఆర్ కేసుల పురోగతి అభ్యంతరాలపై ప్రజల నుండి ఎక్కువగా దరఖాస్తులు వస్తున్నాయని వాటిని సమగ్రంగా పరిశీలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రత్యేకంగా భూ వివాదాల పరిష్కారం కోసం ఎస్‌డిసి కోర్టును వారానికి నాలుగు రోజులు మంగళ, బుధ, గురు, శుక్రవారాలు ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు ఏర్పాటు చేయడం జరుతుందని తెలిపారు. ప్రజలు కోరిన మౌలిక సదుపాయాల కల్పన కోసం ఉపాధి హామీ పథకం నిధులు, ఇతర నిధులను ఉపయోగిస్తూ ప్రాధాన్యత క్రమంలో పనులను పూర్తి చేస్తామని వెల్లడించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి, పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి ఐటిడిఏ యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో డి ఎఫ్ ఓ రాహూల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్ సంపత్ రావు, ఏ పి ఓ వసంత రావు, ఆర్డీఓ వెంకటేష్, ఎస్ డి సి ప్రతాప్, డి డి జనార్దన్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏ ఓ, ఐటిడిఏ ఎస్ ఓ, తహసీల్దార్లు, ఎంపి డి ఓ లు, ఎం పి ఓ లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# టీచర్ల పోరులో 'పెబ్బేరు రైడర్స్' జైత్రయాత్ర

## జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ తొలి విజేతగా నిలిచిన ఉమ్మడి పెబ్బేరు టీమ్



వనపర్తి, విజన్ ఆంధ్ర ప్రతినిధి : వనపర్తి జిల్లాలో తొలిసారిగా నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుల క్రికెట్ టోర్నమెంట్ ఛాంపియన్ గా ఉమ్మడి పెబ్బేరు మండల రైడర్స్ టీం నిలిచింది. టోర్నమెంట్లో మొదటి నుంచి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఫైనల్లో వీపనగండ్ల టీంపై అద్భుత విజయాన్ని చేజిక్కించుకుని తొలి టోర్నమెంట్ లో తొలి ఛాంపియన్ గా నిలిచింది. ఛాంపియన్ గా నిలిచిన ఉమ్మడి పెబ్బేరు రైడర్స్ టీంకి వనపర్తి జిల్లా విద్యాశాఖ సెక్టోరల్ అధికారులు మరియు వివిధ మండలాల మండల విద్యాధికారులు విన్నర్ ట్రోఫీని అందించారు. టోర్నమెంట్లో రన్నరప్ గా నిలిచిన వీపనగండ్ల టీంకి రన్నరప్ ట్రోఫీని అందించారు. ఈ సందర్భంగా వారు ప్రసంగిస్తూ ఉపాధ్యాయులు అనునిత్యం నాలుగు గోడల మధ్య దేశాభివృద్ధికి పునాదులు వేస్తుంటారని అలాంటివారు ఈ సెలవు రోజుల్లో జిల్లా స్థాయి టోర్నమెంట్ నిర్వహించడం చాలా ఆనందదాయకమని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు మానసికంగా ఫిట్ గా ఉండడంతో పాటు శారీరకంగా కూడా ఫిట్ గా ఉంటే విద్యార్థులకు అత్యుత్తమ బోధన అందించగలుగుతారని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని టోర్నీలు నిర్వహించుకుందామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి జిల్లా సెక్టోరల్ అధికారులు మహానంది, ప్రతాప్ రెడ్డి, శేఖర్, వివిధ మండలాల మండల విద్యాధికారులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పెద్దమొత్తంలో హాజరయ్యారు.

# భగత్ సింగ్ స్ఫూర్తిని కొనసాగించాలి

## రక్తదానం ప్రాణదానం లాంటిది ములుగు మున్సిపల్ చైర్మన్ చింత నిప్పుల చంద్రకళ బిక్షపతి



ములుగు మార్చి 23;విజన్ ఆంధ్ర ప్రతినిధి సోమవారం భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా ములుగు లోని రాధాకృష్ణ హాస్పిటల్ లో సిఐటియు, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తూ ములుగు మున్సిపాలిటీ చైర్మన్ చంద్రకళ బిక్షపతి మాట్లాడుతూ ఆనాడు భగత్ సింగ్ దేశం కోసం 23 ఏళ్ల వయసులోనే తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన వీరులనుస్మరించుకుంటూ రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని వారి పోరాటస్ఫూర్తిని యువత పూనికి పుచ్చుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. యువత డ్రగ్స్ కు మత్తుకు దూరంగా ఉండాలి సిఐ డి సురేష్.మాట్లాడుతూ నాడు యువత దేశం కోసం పోరాడి ప్రాణాలు అర్పించారని వారిని స్ఫూర్తిగా తీసుకోవాల్సిన యువత నేడు పక్కదారి పట్టకుండా డ్రగ్స్ కు బానిస కాకుండా యువతరం వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ బి ప్రవీణ్, రియాజ్ మీర్జా, కౌన్సిలర్లు కుద్బుద్దీన్, ఓం ప్రకాష్, జన్ను రవి, రత్నం ప్రవీణ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జాగటి రవితేజ, సద్దాం హుస్సేన్, చింతరాజు, తదితరులు పాల్గొన్నారు.

# వైభవోపేతంగా నిర్వహించిన "మా వైష్ణవ దేవి" జాగరణ్ మహోత్సవం



హైదరాబాద్ మార్చ్ 2026, విజన్ ఆంధ్ర (ఆకెళ్ళ. విశ్వనాథ్ ) : మా వైష్ణవ దేవి జాగరణ్ మండల్, హైదరాబాద్ సభ్యుల ఆధ్వర్యంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు వైభవోపేతంగా నుమాయిష్ మైదాన్, ఎగ్జిబిషన్ గ్రౌండ్స్, నాంపల్లి, హైదరాబాద్ వేదికగా ఏర్పాటు చేసిన "మా వైష్ణవ దేవి" జాగరణ్" లో పాలు పంచుకుని మాత దివ్య మంగళ స్వరూపాన్ని దర్శించుకుని అలౌకిక ఆనందం పొందవలసిందిగా భక్తులకు సాదర స్వాగతం పలికింది. ఈ జాగరణ్ మహోత్సవంలో భాగంగా ప్రఖ్యాత భజన గాయకులు, జాతీయ గాయకుడు ఛోద్ సింగ్ రావ్తా, జోధ్‌పూర్, న్యూ ఢిల్లీ నుండి వచ్చిన గాయకులు తమ భజన గంగా ప్రవాహంతో జాగరణకు వచ్చిన భక్తులకు అలోకిక భక్తి పార్వస్యాన్ని, తన్మయత్వాన్ని, వైష్ణవ దేవి దర్శన ఆనందాన్ని అందించారు.

గ్రాండ్ డివైన్ కోర్ట్ దర్బార్ రూపంలో ఉన్న మండపంలో భక్తులకు అమ్మవారి దైవ దర్శనంతో పాటుగా ఎటర్నల్ ఫ్లేమ్ అఖండ్ జ్యోతి దర్శనం అలాగే లంగర్ ప్రసాద వితరణ నిర్వాహకులు మా వైష్ణో దేవి జాగరణ్ మండల్, హైదరాబాద్, కమిటీ సభ్యులు అందజేసి, అమ్మవారి భక్తుల నుండి ప్రశంశలను అందుకున్నారు.

# పరీక్ష కేంద్రాల వద్ద అప్రమత్తంగా ఉండాలి

**-పరీక్ష కేంద్రాలలో పరిశీలించిన జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్**



నారాయణపేట ప్రతినిధి మార్చ్ 23 (విజన్ ఆంధ్ర) పదవ తరగతి పరీక్షల సందర్భంగా నారాయణపేట జిల్లా కేంద్రంలోని గ్రౌండ్ స్కూల్, గర్ల్స్ హై స్కూల్ లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలన్ని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించబడుతున్న తీరును సమీక్షించి, పరీక్ష కేంద్రాల వద్ద విధుల్లో ఉన్న పోలీస్ అధికారులకు, సిబ్బందికి అప్రమత్తంగా ఉండాలని పలు సూచనలు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 43 పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులు వెళ్లే సమయంలో క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించాలని పరీక్ష కేంద్రాలకి సెల్ ఫోన్లు ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించరాదని, పరీక్షలు సజావుగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పరీక్ష కేంద్రాల వద్ద 163 బి ఎల్ ఎస్ ఎస్ (సెక్షన్ 144) అమలులో ఉంటుందని స్పష్టం చేశారు. పరీక్షల సమయంలో పరిసర ప్రాంతాల్లో నిరంతర పెట్రోలింగ్ నిర్వహించాలని, ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు పరీక్షా కేంద్రాల వద్ద గుమికూడ కుండా చూడలన్నారు. పరీక్షల్లో అక్రమాలకు తావులేకుండా ఉండేందుకు పరీక్షా కేంద్రాల సమీపంలోని (100 మీటర్ల పరిధిలో) అన్ని ఫోటోకాపీ (జిరాక్స్) మరియు ఇంటర్నెట్ సెంటర్లను పరీక్షలు జరిగే రోజుల్లో ఉదయం 8:00 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు ఈ కేంద్రాలు మూసి ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా ప్రజలందరూ సహకరించాలని ఆయన కోరారు. ఎస్పీ వెంట టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఎస్ బి ఎస్సై నరేష్ సిబ్బంది ఉన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



సూర్యాపేట మార్చి 23:(విజన్ ఆంధ్ర)కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చలమల నరసింహ అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టడానికి సిద్ధమవుతున్న బిజెపి నాయకులను, కార్యకర్తలను పోలీసులు ఉదయమే వారి ఇంటికి వెళ్లి ముందస్తు అరెస్టులు చేసి స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చ లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు కానీ హామీలను అనేకం ఇచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అరెస్టులతో తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవాలని ప్రభుత్వం చూస్తుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ఎల్గూరి రామ్మూర్తి, ఆకారపు పరిపూర్ణ చారి, ధనుంజయ గౌడ్, దోసకాయల ఫణి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి

**- కలెక్టర్ ప్రతీక్ జైన్**



నారాయణపేట ప్రతినిధి మార్చ్ 23 (విజన్ ఆంధ్ర) ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. సోమవారం ప్రజావాణి సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి కలెక్టర్ హాజరయ్యారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను విన్నవిస్తూ అర్జీలను కలెక్టర్ కు సమర్పించగా, ప్రజల ఫిర్యాదులను సమస్యలను సావధానంగా విన్న కలెక్టర్ సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. సోమవారం నాటి ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 37 ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి, అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను,వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బాలల స్నేహపూర్వక గ్రామపంచాయతీగా నిర్మిద్దాం

**సర్పంచ్ బానోతు నిర్మల**

ములుగు మార్చి 23;విజన్ ఆంధ్ర ప్రతినిధిగోవిందరావు పేట:జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో సోమవారం గోవిందరావుపేట మండలంలోని గాంధీనగర్, ఈ గ్రామంలో గ్రామ బాలల పరిరక్షణ కమిటీలు ఏర్పాటుచేసి సభ్యులు, గ్రామస్తులు చురుకుగా పాల్గొని బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన పొందారు. గ్రామాన్ని బాలల స్నేహపూర్వక గ్రామపంచాయతీగా అభివృద్ధి చేయడానికి క్రింది అంశాలపై కమిటీ సభ్యులు సంకల్పం వ్యక్తం చేశారు:బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనబాల్య వివాహాల నివారణపిల్లలపై లైంగిక దాడులను నిరోధించడంబడి బయట ఉన్న పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించడందీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న పిల్లలను గుర్తించి వారికి అవసరమైన సహాయం అందించడంసమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం పొందడంఅవగాహన కార్యక్రమాలు:ఈ సందర్భంగా బాల్య వివాహాల నిరోధం, విద్య ప్రాముఖ్యత,



బాల కార్మిక నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్లు 1098 మరియు 112 గురించి కూడా వివరించారు. పాల్గొన్నారు:ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు (కమిటీ చైర్మన్లు), కమిటీ సభ్యులు, గ్రామస్తులు , జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది బి. జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి కార్యక్రమాల ఫలితాలు క్షేత్రస్థాయిలో కనిపించాలి

**కలెక్టర్ బి.చంద్రశేఖర్**

ఉమ్మడి నల్గొండ జిల్లా బ్యూరో, మార్చ్23, విజన్ ఆంధ్రప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల ఫలితాలు క్షేత్రస్థాయిలో స్పష్టంగా కనిపించేలా చూడాల్సిన బాధ్యత జిల్లా అధికారులపై ఉందని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు. ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా సోమవారం అయన కలెక్టర్ కార్యాలయంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ తర్వాత జిల్లా అధికారులతో వివిధ అంశాలపై కలెక్టర్ సమీక్షిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక ను సీరియస్ గా తీసుకోవాలి. ఎట్టి పరిస్థితులలో నిర్లక్ష్యం చేయవద్దు. గతంలో ఆదేశించినట్లు ఏప్రిల్ 2న నిర్వహించే గ్రామ సభలో ప్రభుత్వ ప్రాధామ్య పథకాలు,6 గ్యారంటీలకు సంబంధించి గ్రామపంచాయతీ,మండల,మున్సిపల్,జిల్లా వారిగా లబ్ధి పొందిన లబ్ధిదారుల జాబితాను తక్షణమే తయారు చేసి సిపిఓ కు నమర్పించాలి. మండలప్రత్యేక అధికారులు మున్సిపాలిటీలు,గ్రామపంచాయతీల ను సందర్శించి ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని చురుకుగా నిర్వహించాలి. క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలి. జనగణనకు సంబంధించి తక్షణమే ఎన్యుమరేషన్ బ్లాక్ లను నిర్ణయించడంతోపాటు, సూపర్వైజర్ల తుది జాబితాను రూపొందించాలి. అంతేకాక నియామకపు తరువులు జారీ చేయాలి. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న దృష్ట్యా వివిధ పథకాల కింద నిధులు పొందిన అధికారులందరూ తక్షణమే యుటీలైజేషన్ సర్టిఫికెట్లను సమర్పించాలి. జంతు సంరక్షణ లో భాగంగా మిర్యాలగూడలో చేపట్టిన ఏబీసీ స్టెరిలైజేషన్ కేంద్రం పనులను వేగవంతం చేయాలి. మిర్యాలగూడ మున్సిపల్ కమిషనర్ ప్రతిరోజు పనులు జరిగేలా చూడాలి. దేవరకొండ ఆర్డీఓ దేవరకొండలో ఏబి సి కేంద్రం ఏర్పాటుకు రెండు ఎకరాల స్థలాన్ని



చూడాలి. అందరూ మున్సిపల్ కమిషనర్లు,జిల్లా పంచాయతీ అధికారి అన్ని మేజర్ గ్రామపంచాయతీలు,అన్ని మున్సిపాలిటీలలో ఏబీసీల ఏర్పాటుకు స్థలాన్ని చూడాలి. కుక్కల రిహబిలిటేషన్ గాను నల్గొండ మున్సిపల్ కమిషనర్ నల్గొండలో కుక్కల షెల్టర్ ను ఏర్పాటు చేయాలి. ప్రత్యేకించి ప్రభుత్వ సంస్థల ఆవరణలలో సంచరించే కుక్కలకు సెంటర్లకు తరలించే ఏర్పాటు చేయాలి. 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా ఒక రోజు"దత్తత" కార్యక్రమాన్ని నిర్వహించి ఆవులు,కుక్కలను దత్తత ఇచ్చేలా జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రమేష్ చూడాలి. దీనికి మున్సిపల్ కమిషనర్లు,డిపిఓ సహకార అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఉపాధి హామీ,తదిత అంశాలపై సమీక్షించారు. కాగా ఈ సోమవారం రెవెన్యూ శాఖకు 40 పిటిషన్లు,ఇతర శాఖలకు 43 పిటిషన్లు,మొత్తం 83 ఫిర్యాదులను ప్రజలు ప్రజావాణిలో సమర్పించారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్,రెవెన్యూ అదనపు కలెక్ట్ జె.శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై.అశోక్ రెడ్డి,దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి,జిల్లా అధికారులు ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించారు.

# ప్రభుత్వ మోడల్ బేసిక్ హై స్కూల్‌లో ఎస్.ఎస్.సి పరీక్షా కేంద్ర్రాన్ని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్



మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లా బ్యూరో మార్చి 23 విజన్ ఆంధ్ర జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సోమవారం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ మోడల్ బేసిక్ హై స్కూల్ లో ఏర్పాటు చేసిన ఎస్.ఎస్.సి పరీక్ష కేంద్రాన్ని సందర్శించిపరీక్షల నిర్వహణ ను పరిశీలించారు. పరీక్షా కేంద్రంలోకి సెల్ ఫోన్ లు అనుమతించ రాదని చీఫ్ సూపరింటెండెంట్ కు సూచించారు. పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లను, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, భద్రతా చర్యలు వంటి అంశాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో ప్రహరీ గోడ కూలి ఉండడాన్ని గమనించిన జిల్లా కలెక్టర్, విద్య శాఖ అధికారులను వెంటనే గోడ పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ఎస్.ఎస్.సి పరీక్షలను ఎటువంటి సమస్యలు లేకుండా, సజావుగా నిర్వహించాలన, ఎటువంటి సమస్యలకు తావు ఇవ్వకుండా జాగ్రత్తగా ఉండాలని అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. పరీక్షల సందర్భంగా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

# ఖమ్మంలో ఘనంగా ఈద్ మిలాప్

ఖమ్మం, మార్చ్ 23 (విజన్ ఆంధ్ర)భారతదేశ సంస్కృతి సాంప్రదాయాలు చాలా గొప్పవని ఈ విషయంలో భారతదేశం మిగతా దేశాలకు ఆదర్శంగా నిలుస్తుందని జమాఅతె ఇస్లామి హింద్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సాదిక్ అహ్మద్ అన్నారు. ఖమ్మం షాదీ ఖానాలో జమాఅతె ఇస్లామి హింద్ నగర అధ్యక్షులు జైనుల్ పాషా అధ్యక్షతన జరిగిన జరిగిన ఈద్ మిలాప్ (పండగ కలయిక) కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు ఈద్ మిలాప్ కార్యక్రమం చాలా గొప్పదని దీని ద్వారా సమాజంలో ప్రజల మధ్య ఐకమత్యం, మతసామరష్యం, సోదరబావము పెంపొందుతాయన్నారు అందుకే భారతదేశము అనేక మతాల సాంప్రదాయాల నిలయమని భిన్నత్వంలో ఏకత్వం అని దీని ప్రత్యేకత అని దీని అందరూ కాపాడుకోవాలని అన్నారు .మనందరి సృష్టి కర్త అయిన దేవుడు ఒక్కడే. మనమంతా ఒక్కటేనని, కులమతాలకు అతీతంగా ఒకరి సుఖదుఃఖాలను మరోకరు పంచుకుంటూ కలిసి మెలిసి జీవించినప్పుడే సమాజం లో శాంతి సామరస్యాలు వెల్లివిరుస్తాయని అన్నారు. దివ్య ఖుర్ఆన్ బోధనలు మానవాళికి ఇహంలోనూ, పరంలోనూ దారిచూపుతాయని, మంచి, చెడుల విచక్షణ చూపే ఈ గ్రంథం రమజాన్ నెలలో అవతరించిందని అందుకుగాను రమజాన్ నెలకు ప్రాముఖ్యం లభించిందని అన్నారు. ముఖ్య వక్తగా విచ్చేసిన జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మహమ్మద్ ముజాహిద్ మాట్లాడుతూ మనుషులంతా ఒక్కటేనని, కులమతాల హెచ్చుతగ్గులు లేవని, ఉన్నదాంతో తృప్తి పడుతూ, మంచివారిగా జీవించాలి రంజాన్ ఉపవాసాలు శిక్షణ ఇస్తాయని అన్నారు. ఒకరి పండుగలు పర్వదినాలు మరోకరు పంచుకుంటే ప్రేమానురాగాలు ఆప్యాయత అనుబంధాలు పెరుగుతాయని అన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాన్ని నిర్వహించినందుకు నిర్వాహకులను అభినందించారు. అనంతరం అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షడు లింగాల కమల్ రాజ్ మాట్లాడుతూ భారతదేశం సర్వ మతాలకు ఒక వేదిక హిందూ ముస్లిం క్రిస్టియన్ , సిక్కు, జైన్ అన్ని మతాలవారు కూడా ఒకరి మతాలను గౌరవిస్తూ ఒకరి అభిప్రాయాలను ఒకరి గౌరవిస్తూనే




అంతిమంగా మానవాళి శ్రేయస్సు మానవ ధర్మమే లక్ష్యంతోనే అందరు ముందుకు సాగాలి అన్నారు. ఈ కార్యాక్రమములో జమాఅతె ఇస్లామి హింద్ రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ ఇలియాస్ సెంట్రల్ అధ్యక్షులు ఇంతియాజ్,సౌత్ అధ్యక్షులు సయ్యద్ నిజాముద్దీన్, నార్త్ అధ్యక్షులు మొహమ్మద్ యూసుఫ్ షరీఫ్, వెస్ట్ అధ్యక్షులు అబ్దుస్ సుబుర్,ఐట రీజనల్ సెక్రెటరీ మొహమ్మద్ అబ్దుల్ ముజీబ్, జిల్లా మీడియా సెక్రెటరీ అబ్దుల్ మలిక్, యం పి జె జిల్లా అధ్యక్షులు ఖాసిం, లంబాడి హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు బద్రి నాయక్, స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ పట్టణ అధ్యక్షులు అబ్దుల్ మతిన్ జమాఅతె ఇస్లామి హింద్ సభ్యులు జమీల్ అహ్మద్ ఖాన్, అబ్దుల్ సమి, ఫయాజ్ ,అబ్దుల్ రజాక్ , లతీఫ్, ఇలియాస్, గౌస్,మొయినుద్దీన్, ఇబ్రహీం షరీఫ్, హిమాదుద్దిన్, జిల్లా మహిళా అధ్యక్షురాలు అస్మా అన్జుమ్,సెంట్రల్ అధ్యక్షురాలు అస్ఫియ అన్జుమ్, నార్త్ అధ్యక్షురాలు హుస్సేన్ బి ,సౌత్ అధ్యక్షురాలు నాజియా తబస్సుం ,వెస్ట్ అధ్యక్షురాలు ఫర్జానా , జిల్లా మహిళా పబ్లిక్ రిలేషన్ కన్వీనర్ హాజీరా సదఫ్ సభ్యులు నస్రీన్ , సుమయ్య , షాకిరా ,రఫిఖా , ఫాతిమా , నసిమా, ఆరిఫా, జహెరా ,గర్ల్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ పట్టణ అధ్యక్షురాలు అమ్రీన్ మరియు పట్టణ పలువురు ముస్లిం మరియు ముస్లిమేతర సోదరి, సోదరులు పాల్గొన్నారు.

# సమాజ నిర్మాణంలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల పాత్ర కీలకం

**జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు**

నారాయణ పేట మార్చి 23( విజన్ ఆంధ్ర) తెలంగాణ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం డైరీని సోమవారం నారాయణ పేట డీఈవో డా.గోవిందరాజులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్జెక్టు ఫోరం డైరీ తయారు చేయడం వినూత్న ప్రక్రియ అని, ఈ డైరీలో అకాడమిక్ అంశాలు జోడించి సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులకు రోజువారి ఉపాధ్యాయ దినచర్యలో ఉపయోగపడేలా డైరీ ని తీర్చిదిద్దడం అభినందనీయమని తెలిపారు. అకాడమిక్ స్టాండర్స్, సాంఘిక శాస్త్రానికి సంబంధించిన ముఖ్య దినోత్సవాలు, టీచింగ్ డైరీ మొదలైన విషయాలతో కొత్తరకంగా డైరీని ఉపాధ్యాయులకు ఉపయోగపడేలా తీర్చిదిద్దారని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు రవి కుమార్ మాట్లాడుతూ సాంఘిక శాస్త్ర డైరీని జిల్లా వ్యాప్తంగా దాదాపు 100 మంది టీచర్లకు పంపిణీ చేయడం జరుగుతుందని , రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 4,000 మంది ఉపాధ్యాయులకు సాంఘిక శాస్త్రం ఫోరం డైరీలను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో జిల్లా సెక్టోరిటల్ అధికారులు రాజేంద్ర కుమార్,

నాగార్జున రెడ్డి, మండల ఎం ఈ ఓ బాలాజీ, జిల్లా అధ్యక్షుడు సాక రవి కుమార్, ప్రధాన కార్యదర్శి కనకప్ప బాలరాజు ఆర్య, నరసింహ, రెడ్యాప్ప, లక్ష్మణ్, నర్సిములు, నర్సింహ చారి, రాములు, అంజయ్య, మానిక్ ప్రభు, రవి తదితరులు పాల్గొన్నారు.

# పరీక్షా కేంద్రాలను ఆకస్మిక తనిఖీ

**జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి మార్చి 23 ( విజన్ ఆంధ్ర) :పదవ తరగతి పరీక్షా కేంద్రాలను కలెక్టర్ దీపక్ తివారి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సోమవారము జిల్లా కేంద్రంలోని పదవ తరగతి పరీక్షల సందర్భంగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ సంఘం లక్ష్మీబాయి గురుకుల పాఠశాలలోని పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా పర్యటించి పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. అనంతరం చీఫ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో విద్యార్థుల హాజరు, డ్యూటీ రిజిస్టర్, ప్రశ్నపత్రాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మెడికల్ సిబ్బంది గురించి ఆరా తీశారు. పరీక్షల నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు. విద్యార్థుల హాజరు, సిబ్బంది హాజరు గురించి ఆరా తీశారు. నిబంధనలకు అనుగుణంగానే నిర్ణీత సమయంలో ప్రశ్న పత్రాలను తెరిచారా? అని ఆరా తీశారు. తప్పనిసరిగా సి.సి కెమెరా రికార్డింగ్ నడుమ ప్రశ్న పత్రాల బండిల్ సీళు తెరవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీటి వసతి, ఆరోగ్య కార్యకర్త అందుబాటులో ఉన్నారా పరీక్ష హాల్లోకి సిబ్బంది ఎవరైనా సెల్ ఫోన్లతో వచ్చారా అని కలెక్టర్ పరిశీలన చేశారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సజావుగా పరీక్షలు జరిపించాలని సూచించారు. ఎక్కడ కూడా కాపీయింగ్ కు ఆస్కారం ఉండకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, కాపీయింగ్ కు ఆస్కారం కల్పిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేశారు. పరీక్షలు ముగిసేంత వరకు అప్రమత్తతతో పకడ్బందీగా విధులు నిర్వహించాలని సూచించారు. ఎలాంటి తప్పిదాలకు అవకాశం ఇవ్వకుండా పూర్తి పారదర్శకంగా, పరీక్షలు నిర్వహించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# పదో తరగతి పరీక్షా కేంద్రాలు తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రాలి



కరీంనగర్(విజన్ ఆంధ్ర) మార్చి, 23.కరీంనగర్ సప్తగిరి కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తిరుమల నగర్ లోని మైనార్టీ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తనిఖీ చేశారు. విధులు నిర్వర్తిస్తున్న అధికారులు సిబ్బందితో మాట్లాడారు,విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా పరీక్షలు నిర్వహించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన తాగునీరు, ప్రథమ చికిత్స, మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. తరగతి గదిలో తగిన వెంటిలేషన్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడా ఎలాంటి చిన్న తప్పిదానికి అవకాశం ఇవ్వకుండా విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ అంతరాయం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు

# ప్రభుత్వ మోడల్ బేసిక్ హై స్కూల్‌లో ఎస్.ఎస్.సి పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లా బ్యూరో మార్చి 23 విజన్ ఆంధ్ర జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సోమవారం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ మోడల్ బేసిక్ హై స్కూల్ లో ఏర్పాటు చేసిన ఎస్.ఎస్.సి పరీక్ష కేంద్రాన్ని సందర్శించిపరీక్షల నిర్వహణ ను పరిశీలించారు. పరీక్షా కేంద్రంలోకి సెల్ ఫోన్ లు అనుమతించ రాదని చీఫ్ సూపరింటెండెంట్ కు సూచించారు. పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లను, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, భద్రతా చర్యలు వంటి అంశాలను ఆమె పరిశీలించారు.
ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో ప్రహరీ గోడ కూలి ఉండడాన్ని గమనించిన జిల్లా కలెక్టర్, విద్య శాఖ అధికారులను వెంటనే గోడ పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ఎస్.ఎస్.సి పరీక్షలను ఎటువంటి సమస్యలు లేకుండా, సజావుగా నిర్వహించాలన, ఎటువంటి సమస్యలకు తావు ఇవ్వకుండా జాగ్రత్తగా ఉండాలని అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. పరీక్షల సందర్భంగా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

# రిజిస్టర్ కార్యాలయంలో సీలింగ్ ఫ్యాన్ పడి మహిళకు గాయాలు

మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లా బ్యూరో మార్చి 23 విజన్ ఆంధ్ర
మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సీలింగ్ ఫ్యాన్ పడి మహిళకు గాయాలైన ఘటన సోమవారం చోటు చేసుకుంది. రిజిస్టర్ కార్యాలయంలో కనీస వసతులు లేక రిజిస్ట్రేషన్ కొరకు వచ్చే వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రిజిస్ట్రేషన్ నిమిత్తమై కార్యాలయంకు వచ్చిన ఒక మహిళ బయట వరండాలోని రేకుల షెడ్డులో బెంచీపై కూర్చొని నిరీక్షిస్తూ ఉండగా, ఆఫీస్ సిబ్బంది ఒకరు వచ్చి సీలింగ్ ఫ్యాన్ స్విచ్ వేసి వెళ్లిపోయాడు. ఫ్యాన్ వేగం అందుకున్న కొద్దిసేపటికి ఊడి పడి అక్కడే కొద్దిగ పక్కకు కూర్చున్న ఒక మహిళా భుజంపై ఫ్యాన్ బ్లేడ్ బలంగా పడి గాయం అయ్యింది. సరిగ్గా ఫ్యాన్ కింద ఎవ్వరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. రోజూ వందకు పైగానే రిజిస్ట్రేషన్ నిమిత్తమై కార్యాలయంకు వచ్చి గంటల తరబడి నిరీక్షించే వినియోగదారులకు కూర్చోవడానికి సరిపోను కుర్చీలు, మంచినీటి సౌకర్యం, మహిళలకు టాయిలెట్లు లేవు. రిజిస్ట్రేషన్ చార్జీలు మాత్రం భారీగా వసూలు చేస్తున్నా వినియోగదారులకు కనీస వసతులు కల్పించడం లేదని పలువురు పెదవి విరుస్తున్నారు. వెంటనే కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

## పేద కుటుంబానికి అండగా నిలిచిన జిల్లా అధికార యంత్రాంగం



ఖమ్మం, మార్చి -23 ( విజన్ ఆంధ్ర)గత ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తుపై అధికారులు స్పందించి, మానవీయ కోణంలో చర్యలు చేపట్టారని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం జిల్లా తల్లాడ మండలం గోపాలపేటకు చెందిన రాయల రమేశ్, సులోచన దంపతులు 20 ఏళ్ళ క్రితం ఖమ్మం నగరానికి వలస వచ్చారని, వీరి చిన్న కుమారుడు అజయ్ (18) మెదడు ఎదుగుదల లోపించి మంచానికే పరిమితమయ్యాడని, తమకు సొంత ఇల్లు లేని కారణంగా కిరాయి ఇండ్లు లభించక అనేక ఇబ్బందులు పడుతున్నట్లు దరఖాస్తు చేసుకోవడం జరిగింది. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకున్న అధికారులు క్షేత్ర స్థాయిలో విచారణ చేసి, ఆ కుటుంబం నివాస సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు గుర్తించారు. దీనిపై స్పందించిన అధికారులు, ఆ కుటుంబానికి తక్షణ ఉపశమనం కలిగించేలా డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయించారు. ఇట్టి విషయంలో ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సైదులు, అల్లిపురంలోని డబుల్ బెడ్ రూంల సముదాయంలో బ్లాక్ నెంబర్ 5 నందు జి7 డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయిస్తూ ఉత్తర్వులను రమేష్-సులోచన దంపతులకు సోమవారం అందజేశారు. జిల్లా పరిపాలన తక్షణ స్పందనతో ఆ కుటుంబానికి నూతన ఆశలు కలిగినట్లు స్థానికులు అభిప్రాయపడ్డారు. ప్రజల సమస్యలపై జిల్లా యంత్రాంగం చూపుతున్న చొరవకు ప్రజలు అభినందనలు తెలిపారు.

## కరీంనగర్ ఆదర్శ నగర్ లో ఘనంగా ఈద్ మిలాప్




కరీంనగర్(విజన్ ఆంధ్ర)మార్చి 23. ఈద్ పర్వదినాన్ని పురస్కరించుకుని కరీంనగర్ పట్టణం ఆదర్శనగర్ లో బిజెపి మైనార్టీ మోర్చా నాయకులు మొహమ్మద్ బషీరుద్దీన్ ,మొహమ్మద్ అజారుద్దీన్ ల ఆధ్వర్యంలో ఘనంగా ఈద్ మిలాప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సమాజంలో ఐక్యతను మరింత బలపరుస్తూ, సామరస్యానికి ఈద్ మిలాప్ ఈ ప్రోగ్రాం ద్వారా సందేశాన్ని అందించింది. హిందూ ,ముస్లిం సమాజాలకు చెందిన అనేక మంది ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని, సోదరభావం సామరస్యాన్ని ప్రతిబింబించారు. ఈ కార్యక్రమానికి నగరంలోని ప్రముఖులు , కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, ప్రముఖ సామాజిక సేవకులు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. హిందూ ,ముస్లిం సమాజాలకు చెందిన అనేక మంది ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని, సోదరభావం మరియు సామరస్యాన్ని ప్రతిబింబించారు,ఈ సమావేశంలో శాంతి,ఐక్యత మరియు పరస్పర గౌరవం వంటి విలువలను ప్రతిపాదించారు,ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు హాజరైన అతిథులందరికీ హృదయపూర్వక స్వాగతం పలికారు. నగర ప్రముఖులు, కార్పొరేటర్లను శాలువాలతో సన్మానించారు. ఈద్ మిలాప్ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు మహమ్మద్ బషిరోద్దీన్ , మహమ్మద్ అజారుద్దీన్ లు కృతజ్ఞతలు తెలిపారు.

## 24 ఏళ్ల కలయిక అవదుల్లేని ఆనందం

**అ "పూర్వ "మధురస్మృతి**

**పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం**

**చదువులమ్మ బడి - అమ్మ ఒడి**

**సమ్మేళనంలో పాల్గొన్న 1993-2002 బ్యాచ్ విద్యార్థులు**



ఇబ్రహీంపట్నం, మార్చి 23 (విజన్ ఆంధ్ర ) : ఆనాటి జ్ఞాపకాలు ఎప్పటికీ మధురస్మృతులే. యాచారం మండల పరిధిలోని కురిమిద్ద పాఠశాలకు చెందిన 7వ తరగతి 1993- 2002 సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థులు కురిమిద్ద ప్రభుత్వ పాఠశాలలో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారంతా తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. దేశ, విదేశాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో స్థిరపడినవారు ఒక చోట కలుసుకుని పాత జ్ఞాపకాలను తలచుకున్నారు. 24 సంవత్సరాల తర్వాత స్నేహితులంతా ఒకేచోట చేరడం చాలా సంతోషాన్ని ఇస్తుందని అన్నారు. మానవ జీవితంలో కులమతాలకు అతీతంగా ఉన్నది కేవలం ఒక స్నేహం మాత్రమేనని అన్నారు. జీవితంలో ఎంత ఉన్నత స్థాయిని ఎదిగిన స్నేహాన్ని మాత్రం మరువలేమన్నారు. ఎవరి ఏ కష్టం వచ్చిన తోటి విద్యార్థులకు అండగా నిలబడాలని నిర్ణయం తీసుకున్నారు. తాము కలిసి చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. ఆనాటి తీపి గుర్తులను నెమరువేసుకున్నారు. 24 సంవత్సరాల తర్వాత ఇలాంటి వేడుక చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు ఒక్కొక్కరూ ఒక్కొక్క రంగంలో సెటిల్ అవ్వడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు తమ జ్ఞాపకాలను తలుచుకుంటూ, స్వీయ చిత్రాలు తీసుకొని సందడిగా, సంతోషంగా ఆడి పాడారు. ఆనాడు గురువులు తమకు బోధించిన బోధనలు సూచించిన మార్గాలు నేర్పిన క్రమశిక్షణనే తమను ప్రస్తుతం సమాజంలో ఇంతటి ఉన్నత స్థానంలో నిలబడగలిగేలా ప్రేరేపించాయనీ ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. అనంతరం పూర్వ ఉపాధ్యాయులను విద్యార్థులు శాలువాలతో ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. సమ్మేళనంలో ఉపాధ్యాయులు అంజయ్య, రాజశేఖర్, సరస్వతి, మంజుల, చంద్రకళ, పూర్వ విద్యార్థులు కల్లేపల్లి రవీందర్, జాన్, మూలి మహేందర్, కల్లెపల్లి మహేందర్, శ్రీనివాస్, రవి, శ్రీశైలం, సురేష్, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

# దేశసేవచేసేందుకు ముందుకు రావాలి

**అగ్నివీర్ కుఎంపికైజిల్లాకుమంచి పేరు తీసుకురావాలి**

**తెలంగాణజాగృతిఅధ్యక్షులు గవినోళ్ళ శ్రీనివాస్**



నారాయణపేట, మార్చి 23 (విజన్ ఆంధ్ర) దేశ సేవ చేసేందుకు యువత ముందుకు రావాలని సామాజిక కార్యకర్త తెలంగాణ జాగృతి అధ్యక్షులు గవినోళ్ల శ్రీనివాస్ అన్నారు. సోమవారంనారాయణ పేట పట్టణం లో మిల్కా సింగ్ అకాడమీ ఆధ్వర్యంలో భారత ఆర్మీ సెలక్షన్ లో భాగంగా అగ్ని వీర్ ల ఎంపిక కోసం ఉచిత శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయనమాట్లాడుతూ అగ్ని వీర్ లో ఎంపికై జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు. దేశ సేవ కోసం యువత ముందుకు రావడం అభినందనీయం అన్నారు. ఈ అకాడమీ లో చక్కగా ఫాకల్టీ ఉంది వారు కూడా ఎలాంటి లాభపేక్ష లేకుండా సమాజహితం కోసం ఉచితంగా శిక్షణ ఇవ్వడం గొప్ప విషయం గా పేర్కొన్నారు. వారిని మనస్ఫూర్తిగా అభినందించారు. విద్యార్థులు క్రమశిక్షణ తో తరగతులకు హాజరు అయ్యి చక్కగా విని ఆర్మీ కి ఎంపిక కావాలి అని సూచించారు. అకాడమీ బాద్యులను ఉచితంగా శిక్షణ ఇప్పిస్తున్నందుకు అభినందించారు ఈ కార్యక్రమం లో డి ఐ ఈ ఓ నర్సింగ్ రావు మాట్లాడుతూ యువత ఆర్మీ కి ఎంపిక అయ్యి జిల్లా కు పేరు తీసుకురావాలన్నారు. అయ్యవారిపల్లి మాజి సర్పంచ్ రఘూవేందర్ రెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణ తో ఉండి ఆర్మీ కి ఎంపిక కావాలని మాకు ఎల్లప్పుడూ సహాయం చేస్తూ ఉంటాం అన్నారు. ఈ కార్యక్రమం లో వ్యాయామ ఉపాధ్యాయులు రమణ, ఫాకల్టీ ప్రభకర్, చిన్ని కృష్ణ రంగయ్య గౌడ్, ఉదయ్ కిరణ్ అకాడమీ డైరెక్టర్ మహేష్ నరేష్ ఈ సందర్భంగా అకాడమీ ఉపాధ్యాయులు ప్రభాకర్ స్ఫూర్తి దాయక ప్రసంగం అందర్నీ ఆకట్టుకుంది ఈ సందర్భంగా భాగత్ సింగ్ కి నివాళులు అర్పించిన నాయకులు భగత్ సింగ్ దేశభక్తి ని త్యాగంన్నిఈ సందర్భంగా గవి నో ళ్ల శ్రీనివాస్ కొనియాడారు.

## వడ దెబ్బల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**




సూర్యాపేట మార్చి 23:(విజన్ ఆంధ్ర)వేసవి కాలం సమీపిస్తున్న కొద్దీ, ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున, ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో రానున్న వేసవికాలంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ తో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ తేజస్ నంద్ లాల్, అదనపు కలెక్టర్ కె.సీతారామరావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న వేసవికాలంలో వాతావరణ మార్పులతో మనుషులలో ఆరోగ్య సమస్యలు తలెత్తి శరీరంలో నీటి శాతం తగ్గి డీహైడ్రేషన్ గురయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.. ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా ఉండేందుకు అన్ని శాఖల అధికారులు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.. ముఖ్యంగా గ్రామ, పట్టణ, మున్సిపాలిటీ లలో చలి వేంద్రాలు ఏర్పాటు చేసి నీటి సమస్య లేకుండా చూడాలన్నారు. ముఖ్యంగా మున్సిపాలిటీ లలో, ప్రజలు ఎక్కువగా ఉండే ప్రదేశాలలో పాటు బస్ స్టాండ్ లలో చలి వేంద్రాలు ఏర్పాటు చేసి నీటి కొరత లేకుండా చూడాలన్నారు. అదే విదంగా వడ దెబ్బతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, అన్ని ధవాఖానాలలో అందుబాటులో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని, పిహెచ్సి లలో వడ దెబ్బ బారిన పడిన వారి కోసం బెడ్లను, సెలైన్ లను సిద్ధంగా ఉంచాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. త్వరలో ధాన్యం కొనుగోలు ప్రారంభం కానున్న క్రమంలో కొనుగోలు కేంద్రాల్లో త్రాగు నీటి సదుపాయాలను కల్పించాలని, గ్రామాలలో పశువుల కోసం నీటిని అందుబాటులో ఉంచాలని, ఇందుకోసం పశువుల తొట్టిలను మరమ్మతులు చేసి సిద్ధంగా ఉంచాలని సూచించారు. కలెక్టరేట్ లో పని చేసే ఉద్యోగులు, సిబ్బంది ఖచ్చితంగా వాటర్ బాటిల్స్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అదే విదంగా మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉండే అవకాశాలు ఉన్నందున బయటకు రాకుండా చేసుకోవాలన్నారు. ముఖ్యంగా కాటన్ దుస్తులను ధరించాలని, కూల్ డ్రింక్స్ కాకుండా ఓఆర్ఎస్ లేదా పండ్ల రసాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమం లో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ, సీఈఓ జిల్లా పరిషత్ శిరీష, డిప్యూటీ డిఎంహెచ్ఓ చంద్రశేఖర్ ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి పిర్యాదులపై అధికారులు సత్వరమే చర్యలు తీసుకొని పరిష్కరించాలి

**ప్రజావాణి దరఖాస్తులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు**

**జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



సూర్యాపేట మార్చి 23:(విజన్ ఆంధ్ర)ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించాలని, ఫిర్యాదులను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు..సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల వద్ద నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. రాష్ట్ర స్థాయి గ్రీవిన్స్ లకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించాలని తెలిపారు.. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి పనులు చేయడం జరుగుతుందని కానీ కొంతమంది అధికారులు నిర్లక్ష్యంగా పనులను పూర్తి చేయడం లేదని పేర్కొన్నారు.. పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. 15వ ఫైనాన్స్ కింద వచ్చిన నిధులతో అంగన్వాడీ కేంద్రాలలో బ్యాలెన్స్ పనులను పూర్తి చేయాలని, పీహెచ్సీలను ఆధునికరణ చేయాలని ఆదేశించారు.. అదే విదంగా గ్రంధాలయాల కోసం ఈ నిధులని వినియోగించాలన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో భూ సమస్యలకి సంబందించి 49 దరఖాస్తులు, డిపిఓ 5, డి ఆర్ డి ఏ 3, డిఎంహెచ్వో 3, మిగిలిన 9 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని, మొత్తం 69 దరఖాస్తులు వచ్చాయాని వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని కలెక్టర్ ఈ సందర్భంగా అన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి అదనపు కలెక్టర్ కే సీతారామారావు, సీఈఓ జడ్పీ శిరీష, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ రెడ్డి, సిపిఓ కిషన్, డీఎఫ్ఓ సతీష్, సంక్షేమ అధికారులు నర్సింహారావు, నరసింహ, శంకర్ జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## చందాపూర్ గ్రామశివారులో నల్లకుంట బోడ కుంట కబ్జా చేసిన అరబిందో రియాల్టీ పరిశ్రమపై చర్యలు తీసుకోవాలి

**హత్నూర మండల్ మాజీ ఎంపిటిసిల పోరం అధ్యక్షులు రాజేందర్ హత్నూర మండల్ఆత్మ కమిటీ డైరెక్టర్ సురేందర్ రెడ్డి**



విజన్ ఆంధ్ర హత్నూరహత్నూర మండల పరిధిలోని చందాపూర్ గ్రామ శివారులో గల నల్లకుంట బోడకుంట పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని హత్నూర మండల మాజీ ఎంపీటీసీల ఫోరంఅధ్యక్షులు రాజేందర్ అన్నారు దౌల్తాబాద్ కాసాల శివారులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అక్రమంగా రోడ్డు నిర్మాణం చేసి కుంటలను కబ్జాచేయడంపై ఆయన మండిపడ్డారు. కుంటలు కబ్జా చేసి రోడ్డు నిర్మాణం చేయడంతో నీటి వనరులు కుంటల్లో చేరని పరిస్థితులు నెలకొన్న నాయని ఆయనఆరోపించారు పరిశ్రమల యాజమాన్యాలు ఇష్టానుసారంగా కుంటలు కబ్జా చేసి కేవలం ఉత్పత్తిలో ధ్యేయంగా కుంటలను నామరూపాలు లేకుండా చేయడంతో కనుమరుగయ్యే పరిస్థితులు ఎదురయ్యాయి అన్నారు దీంతో ఆయకట్టు భూములకు నీరు చేరని పరిస్థితులు ఎదురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడకపోవడం విస్మయానికి గురిచేస్తుందని ఆరోపించారు. గతంలో ఇట్టి విషయమై అధికారులకు ఫిర్యాదు చేసిన నామమాత్రం తనిఖీలు చేసి వదిలేసారని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి కుంటల కబ్జాకు పాల్పడిన అరబిందో రియాల్టీ పరిశ్రమ ప్రతినిధులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. అంతేకాకుండా కుంటలు కబ్జాకు గురికాకుండా ఇరిగేషన్ రెవెన్యూ అధికారులు చూడాలని ఆయన డిమాండ్ చేశారు లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ డైరెక్టర్ సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## నవోదయ విద్యాలయాల విస్తరణ పరిస్థితి ఏంటి..?



ఖమ్మం బ్యూరో మార్చ్ 23 (విజన్ ఆంధ్రా)లి దేశంలోని ప్రతి జిల్లాకు జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటు చేయాలనే లక్ష్యాన్ని కేంద్రం ప్రకటించినప్పటికీ, తెలంగాణలో ఆ లక్ష్యం ఇంకా పూర్తిగా అమలు కాలేదని, కొత్త జిల్లాల్లో నవోదయాల ఏర్పాటు ఎందుకు జరగడం లేదని, పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో ప్రతిపాదనలు ఉన్నాయా? ఉంటే అవి ఏ దశలో ఉన్నాయో వివరించాలని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి లోక్ సభలో సోమవారం ప్రశ్నించారు. దీనికి కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్ చౌధరి సమాధానం ఇస్తూ దేశవ్యాప్తంగా నవోదయాల ప్రస్తుత పరిస్థితిని వివరించారు. లితెలంగాణలో పరిమిత విస్తరణదేశంలో 689 జవహర్ విద్యాలయాలు ఉండగా..తెలంగాణలో మాత్రం ఈ పథకం విస్తరణ పూర్తి కాలేదు. రాష్ట్రంలో 16 నవోదయ విద్యాలయాలు మాత్రమే మంజూరై, వాటిలో 15 ప్రస్తుతం పనిచేస్తున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం, నాగర్‌కర్నూల్, ఖమ్మం, కరీంనగర్, కామారెడ్డి, నిజామాబాద్, వరంగల్, మహబూబ్‌నగర్, సిద్దిపేట తదితర జిల్లాల్లో ఇవి కొనసాగుతున్నాయి. అయినప్పటికీ మరికొన్ని జిల్లాలు ఇంకా ఈ అవకాశానికి దూరంగా ఉన్నాయి. లికొత్త నవోదయాల మంజూరుపై కేంద్ర మంత్రి స్పష్టత ఇస్తూ. రాష్ట్ర ప్రభుత్వాలు భూమి ఉచితంగా కేటాయించడం, తాత్కాలిక భవనాలు ఏర్పాటు చేయడం, మౌలిక వసతులు కల్పించడం వంటి షరతులు నెరవేరితేనే కేంద్రం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల ప్రతిపాదనలు కూడా ఈ ప్రమాణాలపైనే ఆధారపడి ఉన్నాయని వివరించారు.

## 'ప్రజావాణి' దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి

**జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**



కరీంనగర్,(విజన్ ఆంధ్ర)మార్చి 23.ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు,సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి కలెక్టర్ దరఖాస్తులు స్వీకరించారు,మొత్తం 233 మంది అర్జీదారులు ప్రజావాణిలో దరఖాస్తులు సమర్పించారు,కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించగా మరికొన్నింటిని అధికారులకు బదిలీ చేశారు,త్వరితగతిన దరఖాస్తులు పరిష్కరించాలని,పెండింగ్ లో ఉంచవద్దని కలెక్టర్ ఆదేశించారు,ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు పాల్గొన్నారు.

## ఆశ్రమ పాఠశాల, ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన హెచ్ ఆర్ సి ఛైర్ పర్సన్



జన్నారం, మార్చ్ 23 (విజన్ ఆంధ్ర) : ఆశ్రమ పాఠ శాల, ఆరోగ్య కేంద్రాన్ని హెచ్ ఆర్ సి చైర్మన్ జస్టిస్ షమిమ్ అక్తర్ సందర్శించారు. సోమవారం రోజున జన్నారం మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠ శాల మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తెలం గాణ మానవ హక్కుల కమిషన్ చైర్ పర్సన్ జస్టిస్ షమీమ్ అక్తర్ సందర్శించారు. గిరిజన ఆశ్రమ పాఠ శాలలోని విద్యార్థులను నాణ్యమైన భోజనం అం దిస్తున్నారా, నాణ్యమైన విద్యను భోదిస్తున్నారా అని అడిగి తెలుసుకొని,వారి విద్యా ప్రమాణాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం మంచి భోజనాన్ని అందించాలని ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులకు సూచించారు. అక్కడి నుండి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ ఉమాశ్రీ ని ఆస్పత్రికి రోజు ఎంతమంది రోగులు వ స్తున్నారని, సంవత్సరంలో ఎన్ని కాన్పులు అవుతు న్నాయని,రోగులకు సరిపడ మందులు అందుబా టులో ఉంచుతున్నార అని అడిగి తెలుసుకున్నా రు. ప్రజలకు అందుబాటులో ఉంటూ రోగులకు మెరుగైన సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. అంతముందు ఉదయం 6గంటల సమయంలో కవ్వాల్ టైగర్ జోన్ జన్నారం డివి జన్ లోని గిరిజన గ్రామాల్లో పర్యటించి వారి స మస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్ర మంలో ఆర్డీవో శ్రీనివాస్ రావు,జిల్లా ఆశ్రమ పాఠశా లల డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి, ఇంచార్జ్ తహశీ ల్దార్ నెరేళ్ల రావెన్మోహన్ ,ఎంపీడీఓ ఉమర్ షరీఫ్ ,ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివరాం,త దితరులు పాల్గొన్నారు.

# పోనకల్ సర్పంచ్ ఆధ్వర్యంలో గర్భిణిలకు సామూహిక శ్రీమంతాలు

జన్నారం, మార్చ్ 23 (విజన్ ఆంధ్ర) : పోనకల్ సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్ ఆధ్వర్యంలో గర్భి ణీలకు సామూహిక శ్రీమంతాల కార్యక్రమం నిర్వ హించారు. జన్నారం మండలంలోని పోనకల్ గ్రామ పరిధికి చెందిన అంగన్వాడీ 4 కేంద్రంలో సోమవా రంరోజున సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్ ఆధ్వ ర్యంలో గర్భిణీలకు సామూహిక శ్రీమంతాల కార్య క్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 11 అంగన్వాడీ కేంద్రాల పరిధికి చెం దిన గర్భిణీలకు శ్రీమంతం చేశారు. అనంతరం స ర్పంచ్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నా రులకు, గర్భిణులకు, బాలింతలకు ప్రభుత్వం అం దించే పౌష్టికాహారాన్ని తప్పకుండా తీసుకోవాలని సూచించారు. గర్భిణిగా ఉన్న సమయం నుంచి బిడ్డ పుట్టేవరకు టీకాలు ఇవ్వడం, కాన్పు జరిగేంత వరకు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను వా రికి వివరించారు. అంగన్వాడీ కేంద్రాల సేవలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించా రు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సిడిపిఓ రేష్మ, ఎంపీడీఓ

ఉమర్ షరీఫ్,ఎంపీవో జలెందర్ ,పంచా యతీ కార్యదర్శి రాహుల్ గుప్తా , సూపర్వైజర్ సంఘ కవిత, ఉప సర్పంచ్ అప్పాల జలపతి,వార్డ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. **RNI.NO.70731/1999** EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.